అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 05-02-2019
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 38 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

చేద్దామన్నా.. పనిలేదు



జీవనోపాధి కోసం వెతుక్కునే శ్రామికులకు ఏ పనీ దొరకని దుస్థితి. వేతనాలు చెల్లించలేక క్యాష్‌కట్ పేరుతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్న కంపెనీలు.. అప్పుల ఊబిలో చిక్కుకొని మూతపడ్డ పరిశ్రమలు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆరాటపడే విద్యావంతులైన నిరుద్యోగులకు నిలిచిపోయిన రిక్రూట్‌మెంట్స్... ఉద్యోగాల వేటలో నిరుద్యోగ యువతకు ఏ గేటు తట్టినా నిరాశే.....

ఉపాధిలేని శ్రామికజనం 50 శాతానికిపైగా ..



2017-18లో శ్రామిక భాగస్వామ్యం 49.8 శాతానికే పరిమితం

- ఆరేండ్లలో 8 శాతం తగ్గిన మహిళాశక్తి
- శ్రామిక మహిళలు 23.3 శాతం మాత్రమే : ఎన్ఎస్ఎస్ఓ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో శ్రామికశక్తి భాగస్వామ్యం రేట్(ఎల్ఎఫ్‌పీఆర్) సగానికన్నా(50 శాతంకన్నా) తక్కువగా ఉన్నట్టు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్ఓ) ద్వారా నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడైంది. దీనినే మరోవిధంగా చెప్పాలంటే..పని చేయగల సామర్థ్యముండే వయసు(శ్రామిక వయసు)వారిలో 50 శాతానికన్నాపైగానే శ్రామికశక్తికి బయటే ఉన్నారని అర్థం. 2011-12లో శ్రామికశక్తి భాగస్వామ్యం 55.9 శాతం ఉండగా, 2017-18లో 49.8 శాతానికి పడిపోయినట్టు ఈ సర్వేలో వెల్లడైంది. 2004-05లో శ్రామికశక్తి 63.7 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్ఎస్ఓ గత సర్వేలో వెల్లడైంది. యూపీఏ-2 హయాంలో శ్రామిక భాగస్వామ్యం 11.5 శాతంమేర తగ్గింది. ఇప్పుడు మోడీ హయాంలోనూ శ్రామిక భాగస్వామ్యం గణనీయంగా తగ్గినట్టు ఈ నివేదిక ద్వారా వెల్లడైంది. 2016, నవంబర్ 8న పెద్దనోట్ల రద్దు తర్వాత మొదటి ఆర్థిక సంవత్సరం(2017-18) నివేదిక ఇది. బిజినెస్ ...9లో

మహిళలకు దక్కని ఉపాధి



2011-12తో పోలిస్తే 2017-18లో మహిళా శ్రామికుల సంఖ్య మరింత తగ్గింది. 8 శాతం తగ్గి 23.3 శాతానికి పరిమితమైంది. పురుష కార్మికుల సంఖ్య 4 శాతం తగ్గి 75.8 శాతానికి పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో శ్రామిక భాగస్వామ్యం 67.7 శాతం నుంచి 58.7 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 49.3 శాతం నుంచి 47.6 శాతానికి తగ్గింది. మహిళా శ్రామికశక్తి పట్టణాల్లో దాదాపు గతంలోవలె 20.4 శాతం ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 11 శాతం తగ్గింది.

ఏకీకృతంకు లైన్‌క్లియర్

సర్వీసు నిబంధనలకు మార్గం సుగమం

- హైకోర్టు ఆదేశాలు నిలుపుదల చేసిన సుప్రీం
- ఉపాధ్యాయ పదోన్నతులకు తొలగిన అడ్డంకి
- ఉపాధ్యాయ సంఘాల హర్షం
- సీనియార్టీ వివరాల సేకరణలో విద్యాశాఖ
- 9న హైకోర్టులో విచారణ
- న్యాయ నిపుణులతో అధికారుల సంప్రదింపులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు మార్గం సుగమమైంది. సర్వీసు నిబంధనల అమలుకు ఉన్న అడ్డంకి తొలగిపోయింది. ఏకీకృత సర్వీసు నిబంధనలు చెల్లవని హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు నిలుపుదల చేసింది. దీంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులకు అవకాశం లభించనుంది. సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు వీలుగా 2017, జూన్ 23న కేంద్ర ప్రభుత్వం గెజిట్ ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వులకు ...9లో



అమిత్‌షాక్

నల్లజెండాలు.. గోబ్యాక్ నిరసనలహోరు

- జనంలేక పోవటంతో వేదికకు దూరం
- బస్సుపైనుంచే బీజేపీ అధినేత ప్రసంగం
- వైసీపీ,టీడీపీ కుటుంబపార్టీలే: అమిత్‌షా



శ్రీకాకుళం: బీజేపీ అధ్యక్షుడికి షాక్ తగిలింది. ఓ వైపు అమిత్‌షా గోబ్యాక్ అంటూ నిరసనలు..మరోవైపు ఆయన సభలో జనాలు లేక వెలవెలబోయింది. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాసలో ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాలక్ష్మీనారాయణ తలపెట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రను అమిత్‌షా ప్రారంభించటానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనను వ్యతిరేకిస్తూ టీడీపీ నిరసన చేపట్టింది. అమిత్‌షా గోబ్యాక్ అంటూ ...9లో

ఎక్కడ నుంచి దిగుదాం..

ఎంపీగా పోటీపై కేసీఆర్ సమాలోచనలు

- మొన్న మెదక్.. నిన్న నల్లగొండ.. నేడు ఖమ్మం...
- పొంగులేటికి చెక్ పెట్టే వ్యూహం
- ఖమ్మంలో పార్టీ పటిష్టతకు ఇదే మంచిదనే అభిప్రాయం
- అసంతృప్తులు, అసమ్మతులు సర్దుకుంటాయంటున్న నేతలు

వివరాలు 9లో

యాదాద్రికి అవసరమైనన్ని నిధులు..

పనులన్నీ పూర్తయ్యాక సహస్రాష్టక కుండయాగం : ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రిలో చేపట్టిన నిర్మాణ పనులకు నిధుల కొరత లేకుండా ఈసారి బడ్జెట్లో కూడా అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. దేవాలయ పునరుద్ధరణ పనులన్నీ పూర్తయ్యాక సహస్రాష్టక కుండయాగం (1008 యాగ కుండాలతో) 11 రోజుల పాటు మహాయాగం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. యాదాద్రి పునరుద్ధరణ పనులను ఆదివారం సందర్శించి వచ్చిన సీఎం.. సోమవారం ప్రగతి భవన్‌లో విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. వందల ఏండ్లపాటు నిలిచిపోయే దేవాలయం కాబట్టి, ప్రతీ అంగుళం నిర్మాణంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఉన్నతాధికారులకు, ఆలయ నిర్మాణ నిపుణులకు ఆయన సూచించారు. ఇందుకోసం వెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి నిర్మాణాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. దేశంలోని ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా యాదాద్రిని సందర్శించాలనే ఉత్సుకత కలిగేలా ...9లో

ఎనిమిది ఇంజినీరింగ్ కాలేజీలు మూత

విద్యార్థుల్లేక నడపలేని స్థితిలో యాజమాన్యాలు

- రేపటివరకు అనుబంధ గుర్తింపు దరఖాస్తు గడువు

వివరాలు 9లో

ఆధారాల్లేవుగా.. తొందరేముంది?



సీబీఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

- 'కోల్‌కతా' వ్యవహారాలపై నేడు విచారణ
- అవాంఛనీయం :బెంగాల్ పరిణామాలపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

వివరాలు 2లో

దళిత ప్రొఫెసర్‌పై హిందూత్వ శక్తుల దాడి

బీహెచ్‌యూలో బూట్ల దండతో ఊరేగింపు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన బనారస్ హిందూ యూనివర్సిటీలో గత నెల 29న ఒక దళిత ప్రొఫెసర్‌పై ఏబీవీపీకి చెందిన హిందూత్వశక్తులు దాడి చేసి ఆయన్ను బూట్లదండతో ఊరేగించి అవమానించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీహెచ్‌యూలో సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ ప్రొఫెసర్ మనోజ్ వర్మ మరో ప్రొఫెసర్‌ను ఒక విద్యార్థినితో కలిపి కొన్ని వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై అఖిల భారత విద్యార్థి ...9లో

బొప్పాయి.. కేజీ రూపాయి



పడిపోయిన ధరలు

- అకాల వర్షం.. అనుకూలించని వాతావరణం
- ఎకరాకు రూ.2లక్షలకు పైగా ఖర్చు
- స్థానిక మార్కెట్ లేక అన్నదాతల ఇబ్బందులు

పండ్లల్లో మేలు రకమైన వాటిల్లో బొప్పాయి ఒకటి. ఆరోగ్యప్రదాయిని కూడా. ఇలాంటి పండ్ల తోటను సాగుచేసిన రైతులకు మాత్రం ఏమీ మిగలట్లేదు. అధిక దిగుబడితో పాటు మంచి లాభాలుంటాయనుకున్న రైతులను అకాల వర్షం నిలువునా ముంచింది. వాతావరణం కూడా అనుకూలించక దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. మరోవైపు నష్టపోయిన రైతులను వ్యవసాయ శాఖ కూడా పట్టించుకోవడం లేదు. స్థానికంగా మార్కెట్ సౌకర్యమూ లేక.. బొప్పాయికి తెగుళ్లు సోకడంతో కేజీ రూ.40 పెట్టాల్సిన మధ్యవర్తులు రూపాయికే కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి రాక, వచ్చిన పంటకూ సరైన ధర లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు.

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రతినిధి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 32వేల ఎకరాల్లో బొప్పాయి తోటలు సాగు చేసారు. ప్రధానంగా అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, నారాయణ్‌పేట, మక్తల్ ప్రాంతాల్లో ఈ తోటలు అధికంగా ఉన్నాయి. మొక్క నాటాక ఆరునెలల కాలంలో నెలకోసారి పూత పూసి బొప్పాయి కాత కాస్తుంది. రెండు, మూడేండ్ల నుంచి పంట అధికంగా రావడమే కాక ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో పెట్టుబడితో పాటు అధిక లాభాలొచ్చాయి. బయటి మార్కెట్‌లో కిలో ధర రూ.40 ఉంటే, వేసవిలో ఇంకా ఎక్కువగానే ఉంటుంది. అయితే, ఉమ్మడి జిల్లాలో ఇటీవల రెండు రోజులపాటు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులు వాతావరణం చల్లగా ఉండి మంచు బాగా కురిసింది. మారిన వాతావరణం వల్ల చేతికొచ్చే దశలో బొప్పాయి తోటలకు తీవ్ర ...9లో



హామీలను నెరవేర్చకుంటే..

- పద్మభూషణ్‌ను తిరిగి ఇచ్చేస్తా : అన్నా హజారే హెచ్చరిక



ముంబయి: లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటు కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే కేంద్రంపై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం.. హామీలను పరిష్కరించకుంటే తనకు వచ్చిన పద్మ భూషణ్ అవార్డును వాపస్ చేస్తానని హెచ్చరించారు. సోమవారానికి ఆయన నిరాహార దీక్ష ఆరో రోజుకు చేరుకున్నది. దేశంలో అవినీతిని రూపుమాపడానికి కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాలలో లోకాయుక్తల తక్షణ నియామకాలతో పాటు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గతనెల 30 నుంచి సొంత గ్రామం రాలేగావ్ సిద్ధిలో అన్నాహజారే దీక్షకు దిగిన విషయం తెలిసిందే. 'దేశానికి ఇచ్చిన వాగ్దానాలను రానున్న కొన్ని రోజులలో కేంద్రం పరిష్కరించకపోతే నాకు వచ్చిన పద్మభూషన్ అవార్డును తిరిగి ఇచ్చేస్తాను. మోడీ ప్రభుత్వం దేశ ప్రజల విశ్వసనీయతను కోల్పోయింది' అని హజారే తెలిపారు. 1992లో అన్నా హజారేకు దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ వరించింది. అంతకముందు బీజేపీ మిత్రపక్షం శివసేన హజారేకు సంఘీభావం తెలిపింది. ఈ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, హజారే జీవితంతో ఆడుకోవద్దని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే అన్నారు. మరోపక్క, ఆయనకు మద్దతుగా రైతులు, యువత అహ్మద్‌నగర్–పూణే రహదారిని దిగ్బంధించారు. హజారే ఆరోగ్యాన్ని పరీక్షించిన డాక్టర్ ధనంజయ్ పోటే.. ఆయన 3.8 కేజీల బరువు తగ్గారని, బీపీ, షుగర్, యూరిన్‌లో క్రిమాటిన్ స్థాయి పెరిగిపోయాయని తెలిపారు.

అన్నింటికీ ఆధార్ వద్దు!



సామాన్యుడిని సమస్యల్లోకి నెట్టొద్దు

- ఆధార్‌పై జంతర్‌మంతర్ ధర్నాలో వక్తల డిమాండ్



నవతెలంగాణ – న్యూఢిల్లీ బ్యూరో:
ఆధార్‌ను సర్వవ్యాపితం చేయడాన్ని వక్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. సైబర్ దాడుల ప్రభావిత దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉందని, ఇటువంటి తరుణంలో అన్నింటికీ ఆధార్ అంటూ మోడీ సర్కారు నిర్ణయం తీసుకోవడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఐడెంటిటీని మాస్క్ చేయడం, మాల్‌వేర్‌లో వాడిన కోడ్ బహిరంగ మార్కెట్‌లోకి వచ్చినపుడు, దానిని హ్యాకర్లు కొని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న డాటాను తస్కరిస్తున్నారని చెప్పారు. సైబర్ దాడులకు పాల్పడేవారు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా, ఇంధనం, నౌకాయానం, విద్యుత్తు, ఇతర రంగాల్లోకి చొరబడుతున్నారని వివరించారు. ఏదైనా తప్పిదం జరిగితే, దేశంలో ఎంతోమంది సామాన్య ప్రజానీకం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని వెల్లడించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం పలు ప్రజా సంఘాలు ఐక్యంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆధార్ దుర్వినియోగంపై భారీ ధర్నా నిర్వహించాయి. ఆయా ప్రజా సంఘాలకు చెందిన కార్యకర్తలు ధర్నాలో వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఢిల్లీ సైన్స్ ఫోరం ప్రతినిధి దినేష్ అబ్రోల్ మాట్లాడుతూ... ప్రయివేటు వ్యవహారాలకు ఆధార్‌ను వినియోగించవద్దని భారత సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని పలుమార్లు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. భారత రిజర్వ్ బ్యాంకు కూడా ఆధార్‌ను బ్యాంకులు తప్పనిసరి చేయడాన్ని తప్పుబట్టిందని తెలిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రతీ విషయానికి ఆధార్‌ను అడిగి సామాన్య ప్రజానీకాన్ని తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇది ఏమాత్రం సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి నిర్ణయాలు సగటు పౌరుడి భద్రతను ఆపదలోకి నెట్టివేయబడుతాయని అన్నారు. ఇంటర్‌నెట్ ఫ్రీడం ఫౌండేషన్ నిర్వాహకులు అపర్ గుప్తా మాట్లాడుతూ భారత ప్రభుత్వంతో ఎన్నికల సంఘం కూడా ప్రతి ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేయాలని యోచిస్తుందని తెలిపారు. ఇది చాలా ప్రమాదకరమైన చర్యగా అభివర్ణించారు. ఆధార్ సమాచారం నిక్షిప్తంగా ఉంచాల్సి ఉంటుందని అన్నారు. ఆ డాటా మూడో వ్యక్తికి దొరికితే తీవ్రమైన పరిణామాలను భారత పౌరులంతా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అందుచేత, తామంతా ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు వివరించారు. "అన్నింటికీ ఆధార్ వద్దు" అన్న నినాదంతో ముందుకెళ్తామని చెప్పారు. భారతీయ వ్యాపార మండలి బికె బన్సల్ మాట్లాడుతూ... జీఎస్టీ చట్ట సవరణతో దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారులంతా తీవ్రంగా దెబ్బతిన్నారని అన్నారు. జీఎస్టీ వల్ల వ్యాపారుల నడ్డి విరిగిందని, ప్రస్తుతం చిన్న వ్యాపారులకు గడ్డు రోజులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీని గద్దె దించాకనే చిన్న వ్యాపారులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. జీఎస్టీకి కూడా ఆధార్ అనుసంధానం చేస్తే తమ వ్యాపార వివరాలకు ఏమాత్రం గోపత్య ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. డాటా దుర్వినియోగం అయితే తమకు సంబంధించిన ప్రతి వివరాలు అంతర్జాల దొంగల చేతిలోకి వెళ్తాయని వివరించారు. సామాజిక సంబంధిత పథకాల లబ్ధిదారులను ఆధార్ లింక్ చేయడంపై ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. జాతీయ డేటా సెంటర్ వద్ద సరైన బయోమెట్రిక్ విధానం లేదని అన్నారు. బయోమెట్రిక్ విఫలమైన సందర్భంలో కూడా అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందకుండా పోతాయని వివరించారు. దీనిపై సమగ్రమైన చర్చ జరిగిన తర్వాతే సుప్రీంకోర్టు తీర్పు విడుదల చేసిందని, అన్ని అంశాలకు ఆధార్‌ను ముడిపెట్టవద్దని చెప్పినట్టు గుర్తు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆలిండియా బ్యాంకు అధికారుల సంఘం నాయకులు థామస్ ఫ్రాంకో, ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రోబీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు (ఫిబ్రవరి5) మహిళా రిజర్వేషన్ బిల్లు డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ధర్నా

ఆధారాల్లేవుగా.. తొందరేముంది ?

సీబీఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

- 'కోల్‌కతా' వ్యవహారాలపై నేడు విచారణ



న్యూఢిల్లీ,కోల్‌కతా : శారదా చిట్‌ఫండ్ కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్.. కీలక సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారనడానికి ఆధారాలు ఏవని సీబీఐని భారత సర్వోన్నత న్యాయస్థానం నిలదీసింది. అంతేకాక.. ఈ కేసును అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. కోల్‌కతాలో ఆదివారం జరిగిన పరిణామాలపై సీబీఐ.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు సీబీఐ తరపు న్యాయవాది, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం రెండు పిటిషన్లు దాఖలు చేశారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో దర్యాప్తునకు రాజీవ్‌కుమార్ సహకరించేలా ఆదేశాలు జారీ చేయాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని మెహతా కోరారు. కేసులో కీలక ఆధారాలను రాజీవ్‌కుమార్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ విషయమై విచారించేందుకు ఆయనకు సీబీఐ నాలుగు సార్లు సమన్లు జారీ చేసినా స్పందించలేదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ కేసుపై సత్వర విచారణ(సోమవారం) చేపట్టాలని ఆయన కోరారు. కాగా..ఈ ఆరోపణలకు సంబంధించి ఏమైనా ఆధారాలున్నాయా అని మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది.

ఆధారాలుంటే సమర్పించండి

సీబీఐ దాఖలు చేసిన పిటిషన్లకు సంబంధించి సాక్ష్యాధారాలు లేనందున సత్వర విచారణ కుదరదని, దీనిపై మంగళవారం(నేడు) విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. రాజీవ్‌కుమార్‌పై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి ఏమైనా ఆధారాలుంటే అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. నిజంగా రాజీవ్‌కుమార్ తప్పు చేసినట్టు రుజువైతే కఠినంగా వ్యవహరిస్తామని తేల్చి చెప్పింది.

ప్రాణాలైనా అర్పిస్తా.. రాజీ పడను: బెంగాల్ సీఎం

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా వేదికగా కేంద్రానికి, ఆ రాష్ట్ర సర్కారుకు మధ్య రాజుకున్న వేడి ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ నివాసానికి సీబీఐ అధికారులు రావడాన్ని నిరసిస్తూ ఆదివారం రాత్రి ధర్నాకు దిగిన పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం కూడా తన నిరసనను కొనసాగించారు. తన ప్రాణాలైనా అర్పిస్తా గానీ, రాజీ మాత్రం పడబోనని ఈ సందర్భంగా మమతా బెనర్జీ అన్నారు. ధర్నా స్థలికి సమీపంలో పోలీసులు సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 189 మంది పోలీసు అధికారులను మమత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్ యూనిఫాం ధరించి పాల్గొనడం గమనార్హం. కాగా.. మమత మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కేంద్రం టార్గెట్ చేసినప్పుడు కూడా తాను వీధుల్లోకి రాలేదని తెలిపారు. కానీ, కోల్‌కతా పోలీసు కమిషనర్ స్థానాన్ని అవమానపరిచేలా మోడీ సర్కారు పన్నుతున్న కుట్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని చెప్పారు. రాజీవ్‌కుమార్.. పోలీసు విభాగాన్ని లీడ్ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర పోలీసులు ఒత్తిడిలోనూ విశేషంగా కృషి చేస్తున్నారని ఆమె కితాబిచ్చారు. రాష్ట్ర పోలీసు విభాగం ప్రపంచంలోనే బెస్ట్ అని మరోసారి స్పష్టం చేశారు. ట్రాఫిక్ పోలీసులు సైతం రాష్ట్రం కోసం అవిరామంగా శ్రమిస్తున్నారని అన్నారు.

బీజేపీ కార్యాలయం ధ్వంసం

మరోవైపు మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం భవానీపూర్‌లో బీజేపీ కార్యాలయంపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఆఫీసులోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. కాగా.. ఇది తృణమూల్ కార్యకర్తల పనేనని బీజేపీ నేతలు అరోపించారు. మమత చేపట్టిన ధర్నాకు మద్దతుగా తృణమూల్ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. ప్రధాని మోడీని హిట్లర్‌తో పోలుస్తూ తమ నిరసనను కొనసాగించారు.

పార్లమెంటులో..

పార్లమెంటులో ఈ అంశంపై చర్చ చేపట్టాలంటూ విపక్షాలు పట్టుపట్టగా స్పీకర్ తిరస్కరించారు. దీంతో విపక్షాలు పెద్దఎత్తున నినాదాలతో ఉభయ సభలూ దద్దరిల్లాయి.

అవాంఛనీయం: సీపీఐ(ఎం)




న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), బెంగాల్ రాష్ట్ర పోలీసుల మధ్య చోటు చేసుకుంటున్న పరిణామాలు అవాంఛనీయమై నవని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో శారదా, రోజ్‌వ్యాలీ తదితర చిట్‌ఫండ్ కంపెనీలు ఆర్థిక కుంభకోణాలకు పాల్పడి కోట్లాది రూపాయల ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్న వైనంపై దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు 2014లోనే సీబీఐని ఆదేశించిందని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో గుర్తు చేసింది. నల్లధనాన్ని వెలికి తీస్తామంటూ ఆర్భాటపు ఎన్నికల వాగ్దానాలతో అధికారం చేపట్టిన మోడీ సర్కారు ఈ కుంభకోణాలపై ఐదేండ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లు ఉందని వివరించింది. ఈ ఐదేండ్ల కాలంలో ఈ కుంభకోణాలలో నిందితులైన ముకుల్‌రాయ్, హేమంత్ శర్మ వంటి తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరిపోయారని తెలిపింది. స్పష్టంగా చెప్పాలంటే ఈ కుంభకోణాలపై సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం చేపట్టిన దర్యాప్తు మందగమనానికి బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై దాడులు చేయటం, సీబీఐ వంటి రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించడం వంటి చరిత్ర ఉన్న మోడీ సర్కారు ఇప్పుడు చేపడుతున్న చర్యలు రాజకీయ దురుద్దేశంతో కూడినవేనని చెప్పక తప్పదని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. దాంతోపాటు ఈ చర్యలపై బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న చరిత్ర ఉన్న తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పందన రాజకీయ దురుద్దేశ పూరితమైనవేనని స్పష్టం చేసింది. ఈ కుంభకోణాల వెనుక ఉన్న దోషులను చట్టానికి పట్టించి వారిని కఠినంగా శిక్షించాలని, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధిత ప్రజలు నష్ట పోయిన సొమ్మును తిరిగి ఇవ్వాలని సీపీఐ(ఎం) మొదటి నుండి డిమాండ్ చేస్తు న్నట్టు పొలిట్‌బ్యూరో తెలిపింది. అయితే ఈ డిమాండ్‌కు ఇటు బీజేపీతో పాటు అటు తృణమూల్ కాంగ్రెస్ కూడా వెన్నుపోటు పొడిచాయని తెలిపింది. బెంగాల్‌లో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్‌పై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహానికి దర్పణం పడు తూ బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన చారిత్రాత్మక ర్యాలీ నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ పరిణామాలు తెరపైకి వస్తున్నాయని వ్యాఖ్యానించింది.

బీజేపీ, టీఎంసీలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) భారీ ర్యాలీ

మరోవైపు.. బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ కమిటీ కోల్‌కతాలో సోమ వారం భారీ ర్యాలీ నిర్వహించింది. మౌలాలీ క్రాసింగ్ సమీపంలోని రాంలీలా మైదానం నుంచి బ్రాబోర్న్ మహిళా కాలేజీ వరకు(1.5 కిలోమీటర్లు) జరిగిన ఈ ర్యాలీలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సూర్యమిశ్రా, లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మెన్ బీమన్ బసు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నృపేన్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య మిశ్రా మాట్లాడుతూ..చిట్‌ఫండ్ కుంభకోణాలపై సీబీఐ నాలుగేండ్లుగా ఏం చేసిందని ప్రశ్నించారు. కేసులకు సంబంధించిన సాక్ష్యా ధారాలను పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నాశనం చేశాడన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ ఎన్నో ఏండ్లుగా తెలుసని ఆరోపించారు. మదన్ మిత్రా లాంటి లాంటి సొంత పార్టీ(టీఎంసీ) నేతలు అరెస్టయినప్పుడు స్పందించని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ విషయంలో ఎందుకింత కలుగజేసుకుంటున్నారని ప్రశ్నించారు.

సీబీఐ చీఫ్‌గా శుక్లా బాధ్యతలు స్వీకరణ



న్యూఢిల్లీ : సీబీఐ నూతన డైరెక్టర్‌గా రిషీ కుమార్ శుక్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ శుక్లాను సీబీఐ డైరెక్టర్‌గా ఇటీవల ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. శుక్లా ఇంతకుముందు మధ్యప్రదేశ్ డీజీపీగా పని చేశారు. సీబీఐలో గతంలో ఉన్నతాధికా రులుగా ఉన్న అలోక్‌వర్మ, రాకేష్ ఆస్తానాల మధ్య వివాదం నెలకొన్న కారణంగా కేంద్రం వారిద్దరినీ బలవంతపు సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. అనంతరం తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు విధులు నిర్వహించారు. తనను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించడంపై వర్మ కోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల అనంతరం తిరిగి వర్మ రెండు రోజులపాటు డైరెక్టర్‌గా వచ్చారు. తదుపరి పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం వర్మను ఫైర్ సర్వీసెస్‌కు బదిలీ చేసింది. కాగా.. మరుసటి రోజే వర్మ తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని నేతృత్వంలోని నియామకాల కమిటీ శుక్లాను సీబీఐ డైరెక్టర్‌గా ఎంపిక చేసింది.

పౌరసత్వ సవరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

రానున్న ఎన్నికల్లో లబ్ది కోసమే ఈ బిల్లు..

- ఎస్పీ, బీఎస్పీ కలయికతో బీజేపీకి నిద్రలేని రాత్రులు: ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో మతోన్మాద చర్యలకు పురిగొల్పి, ప్రజల మధ్య అంతర్యుద్ధమయ్యేలా ప్రధాని మోడీ, బీజేపీలు యోచిస్తున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక రంగంలో చేసిన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చి, మళ్లీ అధికారంలోకి వచ్చేందుకే పౌరసత్వ చట్ట సవరణ బిల్లును తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... హిందువులు మాత్రమే ఉండాలనే భావనతో దేశాన్ని పాలించడం సిగ్గుచేటన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే ఈ తరహా చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తానని హామీనిచ్చిన మోడీ జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దుతో వ్యవస్థలన్నింటినీ భ్రష్టుపట్టించారని అన్నారు. నోట్ల రద్దు తర్వాత రూ. 5 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కు పోయాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కలయికతో బీజేపీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నట్టు ఎద్దేవా చేశారు. పౌరసత్వ చట్టసవరణ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాలతో పాటు అనేక రాష్ట్రాల్లో కేంద్రంపై తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. మతోన్మాద చర్యలతో రానున్న ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తున్న బీజేపీ, మోడీ, షాలకు తగిన బుద్ది చెప్పాలని సూచించారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణను పెద్ద ఎత్తున చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నరసింహారావు మాట్లాడుతూ... పౌరుల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా, ప్రజలను విభజించేందుకే ఈ బిల్లు తీసుకొస్తోందన్నారు. ఇప్పటికే అస్సాం, మణిపూర్‌లతో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నట్టు చెప్పారు. ఈ పౌరసత్వ చట్ట సవరణ బిల్లు రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కారణం కాబోతుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు మాట్లాడుతూ... ఈ దేశంలో ఓటర్లంతా పౌరులు కాదా అని ప్రశ్నించారు. పౌరసత్వం పొందడానికి నాన్ ముస్లిం అనే నిబంధనలు పెట్టడం ప్రమాదకరమైన ధోరణి అన్నారు. ఈ బిల్లుతో పౌరులకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకుండా పోతుందన్నారు. ప్లానింగ్ కమిషన్, ఆర్బీఐ, యూజీసీ, బ్యాంకింగ్ తదితర సార్వభౌమత్వానికి సంబంధించిన అంశాలన్నింటినీ మోడి ధ్వంసం చేశారని విమర్శించారు.

ధర్నాలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ, సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర నాయకురాలు ఎస్వీ రమ, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, నాయకులు అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మహాపూజతో నాగోబా ప్రారంభం

హాజరైన ఎస్పీ, ఐటీడీఏ పీఓ

- కొత్త కుండలతో జలాభిషేకం
- సంప్రదాయబద్ధంగా పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసుల ఆరాధ్య దైవం ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ నాగోబా జాతర ఆరంభమైంది. పుష్య అమావాస్య సోమవారం అర్ధరాత్రి 22 తెగలకు చెందిన మెస్రం వంశీయులు హన్మంతు కటోడ (పూజారి), మెస్రం కోసు, పటేల్ వెంకట్‌రావు ఆధ్వర్యంలో గంగాజలంతో జలాభిషేకం చేశారు. ఈ పూజతో జాతర ప్రారంభమైనట్టు. పురుషులు తెల్లటి వస్త్రాలు, మహిళలు తెల్లటి వస్త్రాలతో పాటు ముసుగులు ధరించి మర్రి చెట్టు ఆవరణలో ఉన్న కోనేరు నుంచి కొత్త కుండల్లో నీళ్లతో కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. కాగడాలతో మెస్రం వంశీయుల సంప్రదాయ వాయిద్యాలైన కాలికోమ్, తుడుం వాయిస్తూ ఆలయంలోకి ప్రవేశించారు. గోదావరి హస్తిన మడుగు నుంచి తెచ్చిన గంగాజలంతో నాగోబాకు జలాభిషేకం చేశారు. గుడి ఆవరణలో రాగి చెంబులో పాలను పెట్టి తెల్లటి వస్త్రాన్ని కప్పి ఉంచారు. ఈ తెల్లటి వస్త్రం కదిలే వరకు వాయిద్యాలు వాయిస్తూనే ఉన్నారు. తెల్లటి వస్త్రం కదిలితే నాగదేవత రాగి చెంబులోని పాలను తాగినట్టు గిరిజనుల నమ్మకం. అప్పటి వరకు నిరంతరంగా సంప్రదాయ పూజలు చేశారు. ఈ నాగోబాకు పాలు, నవధాన్యాలు, నైవేద్యాన్ని సమర్పించారు. మహాపూజకు జిల్లా ఎస్పీ విష్ణు వారియర్‌తో పాటు ఐటీడీఏ పీఓ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ చైర్మెన్ కనక లక్కేరావు హాజరయ్యారు. ఈ జాతర ఐదు రోజుల పాటు కొనసాగుతుంది. జాతరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి గిరిజనులు తరలివస్తున్నారు.



గంగాజలంతో ఆలయానికి చేరుకుంటున్న మెస్రం వంశీయులు

పుస్తకాలు దీపాలవంటివి. వాటి వెలుతురు
మనసులోని మాలిన్యమనే చీకటి తొలగిస్తుంది.- అంబేద్కర్

సంపాదకీయం

వీధికెక్కిన మోడీ, దీదీ

కలకత్తా వీధుల్లో సరికొత్త రాజకీయ క్రీడకు తెరలేచింది, మోడీ, దీదీల ఆధిపత్యపోరు రోడ్డెక్కడంతో ఈ ఆదివారం భారత రాజకీయాల్లో మున్నెన్నడూ కనీ వినీ ఎరుగని విపరీత పోకడలకు వేదికయింది. కేంద్ర సీబీఐ, రాష్ట్ర పోలీసు బాహాబాహీకి దిగజారడంతో కోల్‌కతా నడిబజారులో ప్రజాస్వామ్యం బేలగా మారింది. కేంద్రానికీ రాష్ట్రానికీ మధ్య పోరు పతాకస్థాయికి చేరడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

> **వేలకోట్ల ఈ కుంభకోణాల్లో నిండా మునిగిన తన సహచరులను రక్షించుకోవడానికే మమతాబెనర్జీ అప్రజాస్వామికంగా సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారనే బీజేపీ ఆరోపణలు ఎంత నిజమో... కేవలం ప్రతీకారేచ్ఛతో తన రాజకీయ ప్రయోజనాల కోసమే మోడీ ఈ సీబీఐ దాడులకు పూనుకుంటున్నారన్న తృణమూల్ ఆరోపణలూ అంతే నిజం!**

రోజ్ వ్యాలీ, శారదా పోంజీ కుంభకోణాల్లో విచారణ పేరుతో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను అదుపులోకి తీసుకునేందుకు 40మంది సీబీఐ అధికారులు ఢిల్లీ నుంచి తరలివెళ్లగా, కమిషనర్ నివాసానికి వెలుపలే ఆ రాష్ట్ర పోలీసులు సీబీఐ బృందాన్ని నిలిపేయడమేగాక నిర్బంధించి ఠాణాకు ఈడ్చుకెళ్లారు. సీబీఐ కార్యాలయంపైకి రాష్ట్ర పోలీసులు కదం తొక్కగా, అందుకు ప్రతిగా కేంద్ర భద్రతా దళాలు కవాతుకు దిగాయి. ఇరు పక్షాల ఎత్తులు పైఎత్తులతో అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడంతో బెంగాల్ ముఖ్యమంత్రి ఆకస్మిక దీక్షకు దిగారు. ఈ దీక్షకు మద్దతు పేరుతో ఒకవైపు తృణమూల్ మూకలు కోల్‌కతాను ముంచెత్తుతుండగా, మరోవైపు సీబీఐ బలగాలు కోర్టు మెట్లెక్కుతున్నాయి. దీనికితోడు నేతల దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

ఇంతకీ వీధిపోరాటాలు ఎవరికోసం? ఎందుకోసం? అన్నదే అసలు ప్రశ్న. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలను కూడగడుతున్నందునే ప్రతీకారేచ్ఛతో మోడీ ప్రభుత్వం ఈ దాడికి తెగబడుతోందని తృణమూల్ ఆరోపిస్తుండగా, ఈ కేసుల నుంచి దోషులను కాపాడుకునేందుకే మమతాబెనర్జీ తాపత్రయపడుతోందని బీజేపీ ఆరోపిస్తున్నది. ఇందులో ఏది నిజమో తెలుసుకోవాలంటే ఈ రాజకీయ విన్యాసాలకు మూలమైన రోజ్ వ్యాలీ, శారదా స్కీంల వివరాల్లోకి వెళ్లాల్సిందే. అధిక వడ్డీల ఆశ చూపడం, కోట్లకు కోట్లు పోగేసుకోవడం, చివరికి దుకాణం ఎత్తేయడమే ఈ 'పోంజీ' స్కామ్‌ల సారాంశం! రోజ్‌వ్యాలీ పేరిట రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్, హోటల్స్, రిసార్ట్స్, వినోద వ్యాపారాలను ప్రారంభించి 'గోరంత పెట్టుబడి పెట్టండి కొండంత లాభాలు పొందండి' అనే మోసపూరిత ప్రచారంతో చట్ట విరుద్ధంగా రూ.15వేల కోట్లు ప్రజలనుంచి దోచుకున్నారు. ఇక 'శారద' పేరుతో రెండేండ్లలోనే రెట్టింపు సొమ్మని ఊదరగొట్టి దాదాపు రూ.2500 కోట్లు కొల్లగొట్టారు. ఈ రెండు కుంభకోణాల్లోనూ నిందితులంతా తృణమూల్ నేతలే కావడం ఇక్కడ విశేషం! ఆ పార్టీ ముఖ్య నేతలైన తపన్‌సేన్, సుదీప్ బంధోపాధ్యాయలే వీటికి మూల విరాట్లు కావడం గమనార్హం! కాబట్టే మొదటినుంచీ నిందితులను కాపాడేందుకే మమత సర్కార్ ప్రయత్నిస్తుందన్నది జగమెరిగిన సత్యమే. ఇన్నాళ్లూ మిన్నకుండిన మోడీ సర్కార్ ఇప్పుడే కొరడా ఝులిపించడం వెనుక ఉద్దేశమూ ఊహకందనిదేమీ కాదు. అయితే ఇరుపక్షాలకూ ఈ విషయమై న్యాయాన్యాయాలకంటే రాజకీయాలే ప్రాధాన్యతాంశాలు కావడం విచారకరం!



వేలకోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన ఈ భారీ కుంభకోణాల్లో తృణమూల్ నేతలు పీకల్లోతు మునిగి ఉన్నారన్నది ఇప్పటికే తేలిపోయిన పచ్చినిజం. ఇంకా చెప్పాలంటే మమతా దీదీ ఆశీస్సులు లేకుండా ఆ పార్టీ నేతలు ఇంత సాహసం చేయలేరనే అభిప్రాయాలూ సత్య దూరమేమీ కావు. ప్రస్తుత వివాదానికి కేంద్రబిందువైన పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమారే ఈ స్కామ్‌లపై బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) నేతృత్వం వహిస్తుండటం, ఆయన అధికార పార్టీ నేతలను ఈ స్కామ్‌ల నుంచి తప్పించేందుకే లభించిన ఆధారాలన్నిటినీ ధ్వంసం చేశారని సీబీఐ ఆరోపిస్తుండటం, ఆ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికే మద్దతుగా మన దీదీ రంగంలోకి దిగి ఇంతటి హైడ్రామాకు తెరతీయడం దేనికి సంకేతం!? మమతాబెనర్జీ చెపుతున్నట్టు గత నవంబర్‌లో బెంగాల్ ప్రభుత్వం సీబీఐకిచ్చిన జనరల్ కన్సెంటును ఉపసంహరించుకున్న నేపథ్యంలో.. సీబీఐకి కోర్టు ఆదేశిస్తే తప్ప ఆ రాష్ట్రంలోని కేసుల్లో జోక్యం చేసుకునే అధికారం లేదు. చేసుకోవాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. కానీ మమతాబెనర్జీ ఏర్పాటు చేసిన 'సిట్' దర్యాప్తుపై నమ్మకంలేని బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో 2014లోనే కోర్టు దీనిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. కాబట్టి సీబీఐ జోక్యాన్ని తప్పుపట్టలేం.

కానీ 2014లో కోర్టు ఆదేశిస్తే.. ఈ నాలుగున్నరేండ్లుగా మోడీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? ఈ స్కాంలోని నిందితులు కొందరిని ఇప్పటికే తమ పార్టీలో కలిపేసుకున్నందున మిన్నకుండిపోయారా? లేక తృణమూల్ కాంగ్రెస్ తమ మిత్రపక్షంగా మారకపోతుందా అని ఉపేక్షించారా? ఎప్పటికైనా మమతాబెనర్జీ ఎన్డీఏలో కలవకపోతుందా అని ఎదురుచూశారా? ఇక మమత తమతో కలసిరాదనీ, ఆమె కూడా ప్రధాని కుర్చీపై కన్నేసారని తేలిపోయాకగానీ మోడీకి మోసపోయిన బాధితుల గోడు వినిపించలేదా? తీరా ఎన్నికల వేళ ఇది దేనిని సూచిస్తోంది! వేలకోట్ల ఈ కుంభకోణాల్లో నిండా మునిగిన తన సహచరులను రక్షించుకోవడానికే మమతాబెనర్జీ అప్రజాస్వామికంగా సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారనే బీజేపీ ఆరోపణలు ఎంత నిజమో... కేవలం ప్రతీకారేచ్ఛతో తన రాజకీయ ప్రయోజనాల కోసమే మోడీ ఈ సీబీఐ దాడులకు పూనుకుంటున్నారన్న తృణమూల్ ఆరోపణలూ అంతే నిజం! అయితే ఈ రాజకీయ చదరంగంలో తమ రెక్కల కష్టాన్ని కోల్పోయిన లక్షలాదిమంది బాధితులే దిక్కులేనివారు కావడం వీటన్నిటినీ మించిన నిజం...!!

రాజ్యాంగంపైన దాడి



కె.ఎన్. పణిక్కర్

శబరిమల దేవాలయంలోకి మహిళల ప్రవేశానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీల హింసాత్మక ఆందోళన రాజ్యాంగం పట్ల ఉన్న నిరాకరణను బహిర్గతం చేసింది.

తీర్పు ప్రాధాన్యత, ప్రధాన పార్టీల కుట్ర

శబరిమల తీర్పుకు వ్యతిరేకంగా బీజేపీ హింసాత్మక ఆందోళనలు, వాటికి కాంగ్రెస్ పార్టీ అందించిన సహకారంతో సహా తీర్పుకు సంబంధించిన పరిణామాలు, భారతదేశంలోని ప్రధానపార్టీల కుట్రలను, ద్వంద ప్రమాణాలను నొక్కి చెప్పాయి. ఈ పరిణామాలు భారత రాజ్యాంగంపట్ల, రాజ్యాంగ విలువల పట్ల, న్యాయ వ్యవస్థ, దాని తీర్పుల పట్ల, లింగ సమానత్వ సిద్ధాంతం పట్ల, హేతుబద్ధమైన మత విశ్వాసాల పట్ల, అన్నింటినీ మించి సామాజిక సంస్కరణ భావనల పట్ల ఈ రాజకీయ పార్టీలకు ఉన్న నిరాకరణను బహిర్గతపరిచాయి. ఈ క్రమంలో రెండు ప్రధాన రాజకీయ సంస్థలు భారతీయ సమాజంలో తిరోగమన సాంప్రదాయాలకు, పితృస్వామ్య ఆధిపత్యానికి చిహ్నాలుగా మిగిలిపోయినాయి.

> **మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్న సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మానవ కుడ్యాన్ని రూపొందించడానికి లక్షల సంఖ్యలో మహిళలు ముందుకు వచ్చినారు. అదే సమయంలో ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వేల సంఖ్యలో మహిళలను సమీకరించినారు. వారిలో దిగువ మధ్య తరగతికి చెందిన వారే ఎక్కువ. వాస్తవానికి వారంతా క్షతగాత్రులు. ఈ క్షతగాత్రులే తాము శబరిమల దేవాలయంలోకి ప్రవేశాన్ని కోరుకోవడం లేదని చెప్పడం ఆసక్తికరంగా వున్నది. ఇది వారిని వారు కించపర్చుకోవడమే అవుతుంది.**

నిష్పక్షపాతంగా విశ్లేషిస్తే, సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పు చాలా ముఖ్యమైనది. ఆ తీర్పు రాజ్యాంగ విలువలను సమర్థించింది. దాని పట్ల రెండు ప్రధాన రాజకీయ పార్టీల స్పందన రెండు విధాలుగా ఉన్నది. ప్రారంభంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కేంద్ర నాయకత్వం తీర్పును అంగీకరించింది. ప్రతి ఒక్కరు ఈ తీర్పును స్వాగతించాలని అభిప్రాయపడింది. అంటే ఆర్ఎస్ఎస్ తీర్పు ప్రాధాన్యతను అర్థం చేసుకున్నదని అర్థం. కానీ, కొద్ది సమయంలోనే ఉన్నత కులాల ఓట్లు పొందాలన్న రాజకీయ లబ్ధి కోసం ఈ రెండు పార్టీలు రాజకీయ పిల్లిమొగ్గలు వేసినాయి.

కేరళ రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఈ సమస్య, ప్రజల స్పందన (అంటే ఉన్నత కులస్తుల స్పందన) వదిలివేయకూడనటువంటి బంగారు అవకాశం అని బహిరంగంగా ప్రకటించే వరకు వెళ్ళింది. బీజేపీ, సంఘ్ పరివార్‌ల దూకుడూ ఎత్తుగడలను ఉపన్యాసాల ద్వారా తిరోగమనపరచాలన్న ఆలోచనలో కాంగ్రెస్ నాయకత్వం ఉన్నట్టు కనపడుతున్నది.

సంఘ్ పరివార్ హిందూత్వ వ్యూహంపై

కానీ, ఇప్పుడున్న రాజకీయ పరిస్థితిని అవకాశంగా తీసుకొని ఎన్నికలలో, సంస్థాగతంగా లబ్ధి పొందాలన్న అంశం మాత్రమే బీజేపీ, సంఘ్ పరివార్ హింసాత్మక ప్రచారంలో లేదు. ఇదే సమయంలో వారు ఈ సమస్యను తమ దీర్ఘకాలిక ఎజెండా, కేరళ సమాజాన్ని మతాంతీకరణ చేయడానికి కూడ ఉపయోగించుకుంటున్నారు. ప్రారంభం నుంచీ ఆర్ఎస్ఎస్ ప్రాథమిక రాజ్యాంగ సూత్రాలను అంగీకరించడం లేదు. హిందూత్వ పరిమితులకు లోబడి రాజ్యాంగాన్ని మార్పు చేయాలన్న ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ నాయకత్వ ఉద్దేశ్యం. కాబట్టి ఇది ఒక పథకం ప్రకారం శబరిమల తీర్పుపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత. విశాల హిందూత్వ వ్యూహం ప్రకారం వాస్తవంగా భారత రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడి ఇది. హిందువుల భావోద్వేగ సమస్యను అవకాశంగా తీసుకొని హిందువులందరినీ ఐక్యం చేసే వ్యూహం ఇది.

శబరిమల తీర్పు, కేరళలోని హిందూ జనాభాలోని కొన్ని వర్గాలు స్పందించిన తీరు సైద్ధాంతిక, రాజకీయ, సాంస్కృతిక, సంస్థాగత అవసరాలకు తగ్గట్టుగా ఉన్నది. ఒక సమానత్వ భావంపైన రాజ్యాంగం ఆధారపడి ఉన్నది. హిందూత్వ ప్రాథమిక భావం లింగ సమానత్వానికి వ్యతిరేకంగా వున్నది. కాబట్టి వారికి రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం లేదు. దానిని శబరిమల సమస్య స్పష్టంగా రుజువుచేసింది. అదే సమయంలో వారి ఆందోళనలు కూడా ఆర్ఎస్ఎస్ వాస్తవ స్వభావాన్ని కేరళ ప్రజలందరికీ బహిర్గతం చేసినాయి.


గతంలో సంఘ్ పరివార్ విభిన్న రూపాలలో ఉన్న హిందూత్వ సమీకరణలు పొరుగు రాష్ట్రమైన కర్నాటకతోపాటు, భారతదేశంలో విభిన్న ప్రాంతాలలో ఉన్నాయి. కర్నాటకలో ఒక సూఫీ దేవాలయంపై పదే పదే చేసిన దాడులతో వెంటనే దానిపై సంఘ్ పరివార్ అదుపు సాధించిన విషయాన్ని స్పష్టమైన ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఈ అన్ని కార్యకలాపాలలో హిందువులను దూకుడుగా, పిచ్చి పట్టినట్టుగా ప్రవర్తించే హిందువులుగా తయారుచేయడాన్ని గమనించవచ్చు. దీనిలో వారి దృష్టికి ఏ అంశం కనిపించినా దానిని వారు ఉపయోగించుకున్నారు. రాష్ట్రాలలోని వారి ప్రభుత్వాలలో, కేంద్రంలో కూడా వారు క్రమపద్ధతిలో ఈ వ్యూహాన్ని ప్రోత్సహించినారు. గడచిన నాలుగేండ్లలో ప్రభుత్వ కార్యకలాపాలలో, చర్యలలో దీనిని గమనించవచ్చు. వారిలో ప్రతి ఒక్కరికి ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా మార్గదర్శకాలున్నాయి. నగరాల పేర్ల మార్పు, గొడ్డు మాంసం వినియోగంపై వివాదాలు, గోరక్షక దళాల దాడులు ఇలా అన్నింటిలో కనిపించని హిందూత్వ దృక్పథాలున్నాయి. మతం కేంద్రంగా చూసే దృష్టి, లౌకికతత్వం కేంద్రంగా ఉండే రాజ్యాంగానికి వ్యతిరేకమైనది.

శబరిమల సమస్య కూడా అదే మార్గంలో రచించిన వేరొక వ్యూహం. కానీ, అది కేరళలో హిందూ ప్రజలను హైందవీకరించాలనుకున్న హిందూత్వశక్తుల వ్యూహాలను బట్టబయలు చేసింది. వారు ముందుగా హిందువులలో మత భావాలను రెచ్చగొడతారు. మతతత్వాన్ని రెచ్చగొట్టడం రెండవ దశగా వుంటుంది.

హిందూత్వ రాజకీయ ప్రచారం కోసం మైనార్టీ తీర్పును ఉపయోగించడం

శబరిమల సమస్యకు యిచ్చిన తీర్పుకు భిన్నమైన అభిప్రాయాన్ని తెలియజేసిన ఒకే ఒక న్యాయమూర్తి ఇందు మల్హోత్రా మైనార్టీ తీర్పును బీజేపీ-సంఘ్ పరివార్ నాయకత్వం, ప్రధాని మోడీ నుంచి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వరకు ఉటంకించారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నాయకత్వంలో ఏర్పడిన ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచి 4:1 నిష్పత్తిలో యిచ్చిన తీర్పులో, శబరిమల దేవాలయంలో మహిళల ప్రవేశాన్ని రద్దు చేయడం లింగ వివక్ష చూపించినట్టు అవుతుంది. ఈ ఆచారం హిందూ మహిళల హక్కులను ఉల్లంఘించినట్టు అవుతుందని స్పష్టంగా పేర్కొన్నది.

జస్టిస్ మల్హోత్రా వాదనలు ఈ విధంగా ఉన్నాయి. "మతపరమైన విషయాలలో హేతుబద్ధమైన భావనల ప్రస్తావన ఉండకూడదు. అవసరమైన మతాచారాలను ఏర్పాటు చేసేది ఏమిటి అనేది మతానికి చెందిన ప్రజలు నిర్ణయించుకుంటారు, న్యాయస్థానం కాదు... సాధారణంగా లోతైన మత మనోభావాలకు సంబంధించిన సమస్యలలో ఎవరి జోక్యం ఉండకూడదు". కానీ అక్కడ హేతుబద్ధమైన మత విశ్వాస భావన కూడా ఉన్నది. మత విశ్వాసాలకు సంబంధించిన విషయాలకు హేతుబద్ధమైన విశ్వాసాల అన్వయింపు మతాచారాలలో మార్పును తెస్తుంది. అది శబరిమల దేవాలయం అన్ని మతాల సమ్మేళనంతో కూడిన ఆరాధనా స్థలంగా ఉన్నదన్న విషయంతో స్పష్టమవుతుంది.



అక్కడికి వచ్చే భక్తులు విభిన్న కులాలూ మతాల నుంచి వస్తున్నారు. క్రైస్తవులు, ముస్లింలు అక్కడికి వెళ్ళకుండా అడ్డుకునేది ఏదీ లేదు. వావర్‌పల్లి, అర్తుంగళ్ చర్చిలు శబరిమల దర్శనం కోసం నెరవేర్చే ఆచారాలతో అభేద్యంగా ఉంటాయి. భక్తులు విభిన్నమైన మతాల నుంచి వస్తారు. ఆచారాలు, విశ్వాసాలు ప్రశ్నించనపుడు మార్పులు నిరంతరం సంభవించినాయి.

కాంగ్రెస్ సాత్విక హిందూత్వ విధానం, స్వభావం

కాంగ్రెస్ పార్టీకి నెహ్రూ లౌకిక సాంప్రదాయాలున్నప్పటికీ, హేతుబద్ధమైన మత విశ్వాసాలు, వాటికి సంబంధించిన భావాలపై విలువ కలిగి లేనట్టు కనిపిస్తుంది. కేరళ, ఇంకా ఇతర రాష్ట్రాలలో సాత్విక హిందూత్వ విధానాన్ని తమ రాజకీయ మార్గంగా కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్నది. ఈ విధానం, 1980 దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం చేపట్టిన శిలాన్యాస్ కార్యక్రమాన్ని అడ్డుకోలేకపోవడం ద్వారా ప్రారంభించింది. అప్పుడు అది చేసింది ఒక ప్రతికూలమైన చర్యగా బహిర్గతమైంది. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఆ విధానాన్ని అంటిపెట్టుకొని ఉంటున్నది. ఇది ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాలలో స్పష్టమైంది.

ఉదారవాదం లేకుంటే కాంగ్రెస్ పార్టీకి ఏమీ లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర ఉన్నది. అది రాజకీయ క్షేత్రంలో సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించింది. వలస పాలనా కాలంలో సామాజిక ఉద్యమాలలో కాంగ్రెస్ ముందున్నది. ఇప్పుడున్న కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఈ విషయాలన్నింటిని మరచిపోయినట్టుగా లేక మొద్దుబారిపోయి గందరగోళంలో పడినట్టు కనిపిస్తోంది. శబరిమల విషయంలో గందరగోళం స్పష్టంగా కనపడుతున్నది. రాహుల్‌గాంధీ ఈ తీర్పును స్వాగతించినారు. కానీ కేరళలోని మెజార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, శబరిమల దేవాలయంలోకి రుతుస్రావం అవుతున్న మహిళల ప్రవేశాన్ని రద్దు చేయడానికి అవసరమైన ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అదే సమయంలో, అయోధ్యలో దేవాలయాన్ని నిర్మించడానికి అవసరమైన ఆర్డినెన్స్‌ను ఇదే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది.

కేరళలో లింగ ధర్మంపై

అనేక విధాలుగా, కేరళలో వేళ్లూనుకొని ఉన్న లింగ వివక్ష, లింగ అసమానతలకు శబరిమల పరిస్థితి ప్రాతినిధ్యం వహిస్తున్నది. కేరళ సమాజంలో ఇప్పటికీ పితృస్వామ్య వ్యవస్థ చాలా బలీయంగా ఉన్నది. కేరళ సంస్కృతి పితృస్వామిక సంబంధమైనది. ప్రాముఖ్యత కలిగిన అధికార స్థానాలలో ఉన్న మహిళలు కూడా పురుష ఆధిపత్యానికి లొంగి ఉండడంతో వారు మరుగైపోతున్నారు. ప్రజా క్షేత్రంలోనే కాదు, గృహ సంబంధ క్షేత్రంలో కూడా మహిళలు ఇదే విధమైన లొంగుబాటుతనంతో ఉంటున్నారనేది స్పష్టం.

వాస్తవానికి మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్న సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మానవ కుడ్యాన్ని రూపొందించడానికి లక్షల సంఖ్యలో మహిళలు ముందుకు వచ్చినారు. అదే సమయంలో ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వేల సంఖ్యలో మహిళలను సమీకరించినారు. వారిలో దిగువ మధ్య తరగతికి చెందిన వారే ఎక్కువ. వాస్తవానికి వారంతా క్షతగాత్రులు. ఈ క్షతగాత్రులే తాము శబరిమల దేవాలయంలోకి ప్రవేశాన్ని కోరుకోవడం లేదని చెప్పడం ఆసక్తికరంగా వున్నది. ఇది వారిని వారు కించపర్చుకోవడమే అవుతుంది.

కేరళలో ఒక బలమైన పితృస్వామిక ఆలోచనా విధానం ఉన్నది. అది యిప్పుడు ఫెమినిస్టు, ఇతర మహిళా సాధికారత సమూహాల నుంచి ముప్పును ఎదుర్కొంటున్నది. రాష్ట్రంలో మహిళలకు కుదుంబశ్రీ లాంటి ప్రగతిశీల కార్యక్రమాలు అధికారాన్ని అందజేస్తున్నందువల్ల, పితృస్వామ్యం తన అధికారాన్ని పునరుద్ధాటించే ప్రయత్నం చేస్తుంది. ఆఖరికి కనకదుర్గ, బిందు దేవాలయ ప్రవేశం చేసిన తరువాత నిర్వహించిన శుద్ధి చర్యలలో కూడా పితృస్వామిక ముద్రలున్నాయి. శుద్ధిచర్య అనేది అంటరానితనానికి ఒక రూపం. తన అధికారాన్ని దాటి పూజారి శుద్ధి చర్యలు చేపట్టడం రాజ్యాంగ సమానత్వానికి వ్యతిరేకం. బహుశా రాష్ట్ర ప్రభుత్వం అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆ స్థానం నుంచి అతన్ని తప్పిస్తుందని భావిస్తున్నాను.

('ఫ్రంట్‌లైన్' సౌజన్యంతో)

వ్యాసకర్త: చరిత్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు
అనువాదం: బోడపట్ల రవీందర్
సెల్:9848412451

మెయిల్ @ నవతెలంగాణ



సిహెచ్ శ్రీనివాస్

ప్రజారోగ్యంపై ప్రభుత్వాలకు పట్టింపేది?

ఎప్పటికప్పుడు సైన్స్ ఎంతో అభివద్ధి చెందుతున్నా, ఎన్నో కొత్తకొత్త మందులను కనుగొంటున్నా కొన్ని రకాల వ్యాధుల నుండి ప్రజలను కాపాడుకోలేకపోతున్నాం. డెంగ్యూ, చికెన్ గున్యా, ఎబోలా ఇలా రకరకాల వ్యాధులు ప్రజారోగ్యంపై విరుచుకపడుతున్నాయి. ఇక సీజన్ మారినప్పుడల్లా విజంభిస్తున్న విషజ్వరాలు మరోవైపు అల్లాడిస్తున్నాయి. అయితే ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపలేకపోతున్నదన్నది వాస్తవం. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో విషజ్వరాలు విస్తరించాయి. శ్వాసకోశ వ్యాధుల బారిన పడిన వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ముందు జాగ్రత్తలతో నివారించగలిగే డయేరియా వ్యాధికి కూడా ప్రాణాలను కోల్పోతున్న పరిస్థితి. గ్రామాల్లో కుక్కకాటుకు రేబిస్ ఇన్‌ఫెక్షన్ సోకి చనిపోతున్నవారూ ఉన్నారు. ఇక గుండె జబ్బులు, కిడ్నీ రోగులు, ఇతర విషజ్వరాలు కూడా విజంభిస్తున్నాయి. క్షయ లాంటి వ్యాధుల నియంత్రణకు పాలకులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికీ క్షయవ్యాధి ప్రమాదకరంగా విస్తరిస్తున్నట్టు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. రాష్ట్రంలో ప్రతి యేటా 11 వేల మందికిపైనే ఈ వ్యాధి బారిన పడ్డారని చెబుతున్నాయి. ఇందులో చికిత్స కోసం నమోదవుతున్న వారు 60 శాతం మాత్రమే. నమోదైన కేసుల్లో అత్యధికంగా హైదరాబాద్‌లో కాగా, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్ తదితర జిల్లాలు వరుసక్రమంలో ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా క్షయవ్యాధి ప్రబలిన రోగి చికిత్స ప్రారంభించి ఆ తరువాత మధ్యలో ఆపేయడంతో మళ్ళీ ఈ వ్యాధి పెరగడంతో చికిత్స తిరిగి ప్రారంభించే పరిస్థితి ఏర్పడుతుంది. క్షయ నిర్మూలనకు తెలంగాణ రాష్ట్రంలో ఏటా రూ.24 కోట్లు మంజూరు చేస్తున్నా ఖర్చు చేయడంలో అధికారులు శ్రద్ధచూపలేకపోవడంతో పరిస్థితిలో మార్పు రావడంలేదు. మరికొన్ని చోట్ల ప్రభుత్వాసుపత్రుల్లో డాక్టర్ల స్థానంలో స్వీపర్లే ఇంజక్షన్లు ఇవ్వడం లాంటివి చేస్తుండటం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుకు అద్దం పడుతోంది. ఇక ప్రయివేటు రంగం సామాన్యునికి అందుబాటులో లేనంతగా పెరిగిపోతున్నది. వైద్యం ఒక వ్యాపారంగా రూపాంతరం చెందింది. కార్పొరేటు రంగం ప్రవేశించినప్పటి నుండి వైద్యం పేద ప్రజలకు, మధ్య తరగతి వర్గాలకు అందని ద్రాక్షగా తయారైంది. ఒక సామాన్య రోగిని, రోగాన్ని చూసి వైద్యం చేసే రోజులు పోయాయి. ఇప్పుడు కేవలం అతని జేబును చూసి వైద్యం చేసే రోజులు దాపురించాయి. రెండు, మూడు దశాబ్దాలుగా అధ్యయనాలు కమిటీలతో కాలయాపన చేస్తున్నారే తప్ప సమగ్ర చట్టానికి రూపకల్పన జరగడం లేదు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి పైసా, పైసా పోగేసుకొని నాలుగు రూపాయలు సంపాదించుకుని బతికీడుస్తుంటే అనుకోకుండా ఇలాంటి జబ్బులు వస్తే ఏంటి పరిస్థితి? ప్రభుత్వాసుపత్రుల్లో పట్టించుకోరు! కార్పొరేటు ఆస్పత్రికి వెళ్తే ఉన్నదంతా ఊడ్చుకొని పోయి అక్కడ పెట్టి మళ్ళీ దారిద్ర్యం పాలవుతున్నారు. ఇంకా ఆ మాత్రం స్తోమత కూడా లేని వారి పరిస్థితి అంతే గంగతులు రెండు తెలుగు రాష్ట్రాల్లో కొన్ని వేలాది కుటుంబాలు ఈ సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడుతున్నాయి. ఇకనైనా పాలకులు సామాన్య ప్రజలపై దష్టి సారించి వారికి అండగా నిలబడతారని కోరుకుందాం. **సెల్: 9603471199**

ప్రజావాణి

వేగమే ప్రమాదాలకు మూలం

వేగ నియంత్రణ లేక రహదారులు చావుకు మార్గాలై కడుపుకోత మిగిలిస్తున్నాయి. సీటు బెల్టు, హెల్మెట్, గీత దాటితే రుసుము, నెంబర్ ప్లేటు లాంటి నిబంధనలకన్నా ముఖ్యమైనది అతివేగం. ట్రాఫిక్‌కు సంబంధించిన ఎన్ని నియమాలున్నా వాటిని పాటించే పరిస్థితి లేదు. అందుకే వాహనాలకు వేగం 80 నుంచి 100 కి.మీ. మధ్య హద్దు నియమించాలి. ఏ వాహనానికైనా ఒకే విధమైన వేగం పరిమితి నిర్ణయిస్తే నష్టం ఏమీ లేదు. దానివల్ల ఎన్నో ప్రమాదాలను అరికట్టవచ్చు. అంతే కాకుండా 24గంటలూ వాహనం నడపడం కూడా ప్రమాదాలకు మరో కారణం అవుతుంది. నిర్లక్ష్యం, అతివేగం ప్రమాదాలకు ముఖ్యకారణమని అందరికీ తెలిసిన విషయమే. వెంట్రుక వాసిలో ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తమవాళ్ళను కోల్పోయిన వారి దుఃఖం అంతా ఇంతా కాదు. చేజేతులా మన ప్రాణాలకు మనమే బాధ్యులం అవుతున్నాం. అభివృద్ధి నాణానికి బొమ్మా బొరుసూ ఉంటాయి. శాస్త్ర సాంకేతికతలో మనం ఎంత ముందుకు దూసుకు వెళ్తున్నా వాటి వల్ల ప్రమాదం కూడా అంతే ఉంది. వాటిని ప్రమాద రహితంగా, అందరికీ శ్రేయస్సును కలిగించే విధంగా మార్చుకోవాలి. మనల్ని మనం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వం వేగ నియంత్రణ తప్పనిసరి చేసి, వాహనాలకు బిగిస్తే ప్రాణాలెన్నో కాపాడవచ్చు, పారే దుఃఖాన్ని అరికట్టవచ్చు.

- పుట్టి గిరిధర్, మహబూబ్ నగర్.


ఈ పాపం ఎవరిది?



పద్మశ్రీ

గత రెండు రోజులుగా వార్త పత్రికలు, ఛానళ్లు, సోషల్ మీడియా అమెరికాలో భారత విద్యార్థుల అంశంపై వివిధ కథనాలు వినిపిస్తున్నాయి. చూపిస్తున్నాయి. చర్చ గోష్ఠులు నిర్వహిస్తున్నాయి. అమెరికాలో ఉత్తుత్తి యూనివర్సిటీ అయిన ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం చేసిన స్టింగ్ ఆపరేషన్‌లో చిక్కుకున్న విద్యార్థుల్లో రెండు తెలుగు రాష్ట్రాల పిల్లలే ఎక్కువగా ఉన్నారని చెపుతున్నారు. కొంతమందిని అదుపులోకి తీసుకుని తీవ్రస్థాయి నేరస్థులుగా పరిగణించి విద్యార్థుల కాళ్లకు ట్రాకర్లు కట్టి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ చర్య భారతదేశ ప్రతిష్టను దెబ్బతీయటమే కాక అక్కడ ఉన్న విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నది. ఇక్కడ తల్లిదండ్రులు గుండెకోత అనుభవిస్తున్నారు. అయితే ఈ పాపం ఎవరిది? పిల్లలు పుడుతూనే కార్పొరేట్ స్కూళ్ల లిస్టులు వెతకడం ఇప్పుడు సర్వసాధారణ విషయమైంది. కారణం నేడు చదువు విజ్ఞానం కోసం కాక కేవలం మంచి ఉద్యోగం కోసం అది కూడా అమెరికాలో స్థిరపడటానికేనన్న ఆలోచనకు మన సమాజంలో 20ఏండ్ల క్రితం బీజం పడి అది మహావృక్షమై ఊడలు దిగింది. ఈ బీజం వేయడంలో ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాత్ర చాలా ఉంది.

వై2కె వైరస్‌ను ఎదుర్కొనేందుకు 2000లో అమెరికాకు అధిక సంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అవసరమయ్యారు. అప్పటికే నూతన ఆర్థిక విధానాలను అత్యంత ఉత్సాహంతో అమలు చేయాలని ప్రయత్నిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం ఇంజినీరింగ్ అదికూడా కంప్యూటర్ సైన్సు కోర్స్‌కి బాగా ప్రచారం కల్పించింది. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలను ప్రోత్సహించింది. దానితో ప్రయివేట్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. దానికితోడు చంద్రబాబు తన ఉపన్యాసాలలో కూడా చరిత్ర, సామజిక, భాషా శాస్త్రాలకు కాలం చెల్లిందని, భవిష్యత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీదే అని పెద్ద ఎత్తున ప్రచారం చేయటం, అలాగే కొంతమందికి విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో ఎంఎస్ చేయటానికి, ఉద్యోగాలకు మంచి అవకాశాలు లభించాయి. ఈ ప్రభావంతో ఇక మన తెలుగురాష్ట్రాలలో చదువు అంటే ఇంజినీరింగ్,



ఉద్యోగం అంటే అమెరికా లేదా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)దే అనే భావం అటు తల్లిదండ్రులలో, ఇటు పిల్లలలో కూడా బలంగా నాటుకుపోయింది. అది అంతకంతకు పెరిగి ఒక సోషల్ స్టేటస్‌గా మారిపోయింది. అందుకే తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్ పరీక్షల సీజన్ వస్తే విద్యార్థులతో పాటు ఇంకా చెప్పాలంటే వారికన్నా ఎక్కువగా తల్లిదండ్రులు నిద్రాహారాలు మాని హైరానాపడటం మన కుటుంబాలలో సర్వసాధారణంగా కనిపించే సన్నివేశం. ఈ వ్యామోహం చివరికి అమెరికా ఉద్యోగులను తప్పితే పెండ్లిచేసుకోమనే స్థాయికి చేరుకుంది. ఇంజినీరింగ్ చదివిన పిల్లలు అమెరికా వెళ్లకపోతే చిన్నతనంగా భావించే స్థితికి దిగజారింది.

ఇటువంటి పరిస్థితుల్లో పిల్లల స్థాయి శక్తి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా బలవంతంగా వారిని ఇంజనీరింగ్ చదువులకు బలి చేస్తున్నారు. మరోపక్క దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఈ పరుగుపందెంలో చోటుకోసం ఆర్థికంగా అష్టకష్టాలు పడుతున్నారు. మొదటితరం విద్యార్థులు మంచి అవకాశాలు పొందారు. అప్పుడు తమకు నిపుణులైన ఇంజినీర్లు అవసరం కావటంతో అమెరికా వారిని ప్రోత్సహించింది. తరువాత వెళ్లే విద్యార్థుల పట్ల అమెరికా ప్రభుత్వం అనేక ఆంక్షలు విధిస్తోంది. సప్లయ్ డిమాండ్ సూత్రాన్ని పట్టిస్తోంది. నైపుణ్యం తక్కువ ఉన్నవారు పోటీలో నిలబడలేక పోతున్నారు.

మనదేశంలో యువతకు సరైన ఉద్యోగావకాశాలు లేకపోవడం మరో ముఖ్య కారణం. అందువల్లనే చదువుకున్నవారు అమెరికా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్తుంటే చదువులేని నిరుపేదలు గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ అష్టకష్టాలు పడుతున్నారు. జీవన్మరణ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు స్వదేశానికి తిరిగి వస్తారో లేదో కూడా తెలియదు. ఆక్కడైనా ఇక్కడైనా చదువు ఉపాధి కోసం వెళ్లినవారు అభద్రతా భావానికి గురౌతున్నారు.

తప్పు దొంగ యూనివర్సిటీ పెట్టి విద్యార్థులకు వలపన్ని స్టింగ్ ఆపరేషన్ చేయించిన అమెరికా ప్రభుత్వానిదా? విదేశీ ఉద్యోగాల వ్యామోహం పెంచి పోషించిన గత ప్రస్తుత ప్రభుత్వాలదా? ఆ పద్మవ్యూహంలో చిక్కుకుని బయటపడలేక పోతున్న తల్లిదండ్రులదా? కండ్లు తెరిచిన దగ్గర నుంచీ ఇంజినీర్ గానే కలలు కనటం నేర్చుకుని ఆ కలల సాకారం కోసం అర్రులు చాస్తున్న ప్రక్క మార్గాలు పడుతున్న మన భావి అమెరికా పౌరులదా? ఒక్కసారి ఆలోచిద్దాం!!

సెల్: 9490098687

పెండ్లికి ట్రెండీగా...



ఒకప్పుడు పెండ్లి అంటే పట్టుబట్టలే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. నెట్టెడ్,ఫ్లోరల్, సిల్క్.. అన్నీ దర్జాగా కొలువుదీరుతున్నాయి. ఎంగేజ్‌మెంట్ నుంచి సంగీత్, మ్యారేజ్, రిసెప్షన్... ఒక్కో వేడుకకు ఒక్కో డ్రెస్. లాంగ్ గౌన్, గాగ్రాచోళీ, లంగావోణీ... ట్రెండీగా ముస్తాబవుతున్నాయి. అలాంటి కొన్నే ఇవి! ఓ లుక్కేయండి!

మన జీవితాల్లో అమ్మ సూపర్ హీరో. వాళ్ల చేసే చిన్న చిన్న పనులే.. మనలను ప్రత్యేకంగా భావించేలా చేస్తాయి. ఈమె కూడా అలాంటి అమ్మే! ఆమె పేరు సిల్వియా గ్రెకో. ఊరు బ్రెజిల్. ఫుట్‌బాల్‌కు వీరాభిమాని అయిన ఆ అమ్మ ఏం చేసింది? ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడామె పేరు వైరల్ కావడానికి కారణమేంటి? తెలియాలంటే ఇది చదవాల్సిందే.

అమ్మ కళ్లతో ఆటను...



గ్రెకో, కొడుకు నికొలస్‌లిద్దరికీ ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం.అందుకే సావో పాలోలో ఫుట్‌బాల్ టీమ్‌కు వాళ్లిద్దరూ సపోర్టర్స్. ఇద్దరు తప్పనిసరిగా మ్యాచెస్ చూస్తారు. అది కూడా టీవీలో కాదు. నేరుగా. ఇందులో ప్రత్యేకతేముంది? అనుకునేరు. కచ్చితంగా ఉంది. ఎందుకంటే నికొలస్ అంధుడు. అంధుడైన కొడుకుకు ఫుట్‌బాల్ మ్యాచెస్‌ను కళ్లకు కడుతుంది గ్రెకో. పిచ్‌లో ఇంచు ఇంచునా ఏం జరగుతుందనేది కొడుకుకు చెబుతుంది. తల్లి వివరిస్తుంటే వింటూ... సెకను ఆలస్యం లేకుండా మిగిలిన ప్రేక్షకులతోపాటు ఆనందిస్తుంటాడు నికొలస్. క్రీడాకారులు వేసుకున్న బట్టలు, వాళ్లు ధరించిన షూస్, హెయిర్ కలర్ నుంచి...ఆ సమయంలో వాళ్ల భావోద్వేగాల వరకు ఏమాత్రం తేడా లేకుండా చెబుతుంది. తను చూసిన, ఫీలయిన ప్రతీ విషయాన్నికొడుకుతో పంచుకుంటుంది.

గత ఏడాదే కెమెరా కంటపడ్డారు ఈ తల్లీకొడుకులు. ఆ తరువాత సెలబ్రిటీస్ అయిపోయారు.

ఇటీవల జరిగిన మ్యాచ్‌కు బ్రెజిలియన్ టీమ్‌కు మద్దతుగా వచ్చినప్పుడు క్రీడాకారుడు నెయిమర్... నికొలస్‌ను ఎత్తుకున్నాడు. అది తనకు మరిచిపోలేని మూమెంట్ అంటుంది గ్రెకో! ❄

ఇట్ల చేద్దాం

వేపపేస్ట్ బెస్ట్ హోం రెమెడీ. ఇందులో బ్యాక్టీరియల్ యాంటీసెప్టిక్ గుణాలుంటాయి. పాదాలు పగిలినప్పుడు ఈ పేస్ట్‌ను అప్లై చేస్తే చాలు. పాదాల పగుళ్ల సమస్య నుంచి వెంటనే ఉపశమనం పొందుతారు.



‘అసలు ఆడవారు ఎలాంటి దుస్తులు వేసుకోవాలో చెప్పడానికి మీరెవరు? నాకు తెలిసినంతవరకు పొట్టి దుస్తులు వేసుకునే వారిపైనే కాదు.. ఒళ్లంతా నిండుగా కప్పుకొనే ఆడపిల్లల పైనా అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఆడపిల్లలు ఫలానా రకమైన దుస్తులు వేసుకోవడం వల్లే మగవారు వారితో తప్పుగా ప్రవర్తిస్తున్నారని అనుకోవడం తప్పు. ఎలాంటి దుస్తులైనా వేసుకునే హక్కు ఆడవారికి ఉంటుంది. అదే ఆడపిల్ల.. ఓ మగవాడ్ని ‘ప్యాంట్స్ వేసుకోవద్దు, అది మన సంప్రదాయం కాదు, పంచెలు కట్టుకోండి’ అని ఎప్పుడైనా అనడం విన్నారా? అసలు మీ కళ్లు ఆడవారి దుస్తులపైకి ఎందుకు వెళ్తున్నాయ్?’

కలబందతో అందంగా

+ మేకప్ తొలగించడానికి కలబంద గుజ్జు బాగా ఉపయోగపడుతుంది. తాజా కలబంద గుజ్జులో కాటన్ ముంచి, చర్మం మీద అప్లై చేసి స్క్రబ్ చేయాలి. మేకప్‌కు వాడే కాస్మొటిక్స్‌లో కెమికల్స్‌ను రిలీవ్ చేసి, చర్మాన్ని శుభ్రపరచడానికి సహాయపడుతుంది.
+ కలబందను కనుబొమ్మలకు అప్లై చేయడం వల్ల ఒత్తుగా పెరుగుతాయి. ఒక టీస్పూన్ కలబందగుజ్జులో, ఒక చెంచాఆలివ్ ఆయిల్ మిక్స్ చేసి కనుబొమ్మలకు అప్లై చేయాలి. రాత్రంతా అలాగే ఉండనిచ్చి తర్వాత శుభ్రం చేసుకోవాలి.
+ బరువు తగ్గిన తరువాత, ప్రసవం తరువాత మహిళల్లో స్ట్రెచ్ మార్క్స్ ఏర్పడతాయి. వీటిని మాయం చేసేందుకు కలబంద బాగా పనిచేస్తుంది.అందులో కొద్దిగా ఆలివ్ ఆయిల్, బాదం ఆయిల్ మిక్స్ చేసి, మసాజ్ చేయాలి. రాత్రి పడుకునే ముందు ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.
+ కలబంద చర్మ కణాలకు ఆక్సిజన్‌ను అందిస్తుంది. చర్మాన్ని తేమగా ఉంచడమే కాదు మృదువుగా మారుస్తుంది. ఒక టేబుల్ స్పూన్ కలబంద గుజ్జులో కొద్దిగా పచ్చిపాలను మిక్స్ చేసి, చిక్కటి పేస్ట్‌గా చేయాలి. తర్వాత దీన్ని శరీరానికి మొత్తానికి అప్లై చేసి మసాజ్ చేయడం వల్ల చర్మం కాంతివతంగా తయారవుతుంది.
+ పొడిబారిన చర్మానికి తేమను అందించే చక్కని పదార్థం కలబంద గుజ్జు. ఒక టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు తీసుకుని అందులో గుడ్డులోని తెల్లసొన కలిపి ముఖం , మెడకు అప్లై చేయాలి. తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ❄

పరిమళం నిలవాలంటే...

బయటికి వెళ్లేటప్పుడు పర్ఫ్యూమ్ స్ప్రే చేసుకుంటాం. కానీ ఇలా వెళ్లామో లేదో... అలా దాని సువాసన పోతుంది. అలా కాకుండా ఎక్కువ కాలం నిలవాలంటే ఏం చేయాలి?

- ముందు పెట్రోలియం లిముందుగా మీ చర్మతత్వాన్ని ద ష్టిలో పెట్టుకోవాలి. పొడిబారిన చర్మతత్వమా లేక జిడ్డుదా అన్నది గమనించుకోండి. మీది పొడిచర్మతత్వం అయితే కాస్త గాఢత ఎక్కువగా ఉన్న పరిమళాన్ని ఎంచుకోవాలి. ఎంచుకునే ముందు, మీరు వాడబోయే మిగిలిన సౌందర్య సాధనాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. ఎందుకంటే పరిమళంతోపాటూ డియోడరెంట్ల లాంటివి వాడుతుంటే ఆ సుగంధం ఎక్కువ సమయం నిలిచి ఉండదు.



- స్నానం చేసిన వెంటనే పరిమళం వాడితే మంచిదంటారు నిపుణులు. స్నానాంతరం చర్మం కోమలంగా తయారౌతుంది. తడిపొడిగా ఉన్నప్పుడే వేస్తే పరిమళం బాగా పట్టి ఎక్కువ సమయం నిలిచిఉంటుంది. పరిమళాన్ని మెడ మధ్య భాగంలో, చెవి వెనకాల, మణికట్టు మీద, మోకాళ్ల వెన కాల రాసుకోవాల్సి ఉంటుంది. ఆయా భాగాల్లో పెట్రోలియం జెల్లీ రాసుకుని.. తరువాత పర్ఫ్యూమ్ వేసుకోవాలి. అలాగే వాసనలేని మాయిశ్చరైజర్ కూడా రాసుకున్న తరువాత స్ప్రే చేసుకోవచ్చు. స్ప్రే చేసిన తరువాత చేతులు రుద్దడం లాంటివి చేయకూడదు. దీనివల్ల పరిమళం వెంటనే పోతుంది.
- కొన్నిసార్లు ఎన్ని జాగ్రత్తలు పాటించినా... పరిమళం నిలవదు. అలాగని పర్ఫ్యూమ్ బాటిల్‌ను బ్యాగులో మోయలేం. అలాంటప్పుడు పరిమళాన్ని దూది బాల్స్‌కు పట్టించి బ్యాగులోవేసుకోవాలి. పరిమళం పోయిందనిపించగానే... ఆ బాల్స్‌తో టచప్ చేసుకోవాలి. పర్ఫ్యూమ్ వేసుకునే ముందు బాటిల్‌ను షేక్ చేస్తుంటారు చాలా మంది. ఇలా చేయడం వల్ల... అది గాలిగా మారుతుంది. ఆ గాలిని స్ప్రే చేసుకున్నా ఫలితం ఉండదు.
- కొన్న కొత్తలో మాత్రమే బాటిల్‌ను బాక్స్‌లో పదిలంగా పెడతాం. తరువాత వదిలేస్తాం. కానీ అలా కుండా కచ్చితంగా బాటిల్‌ను బాక్స్‌లోపెట్టి... సూర్యకాంతి పడని చోట ఉంచాలి. లేకపోతే పర్ఫ్యూమ్‌లోని నూనెలు డిగ్రేడ్ అయ్యి.. పరిమళం కోల్పోయే అవకాశం ఉంది. తేమ ఉన్న చోట బాటిల్‌ను అస్సలు ఉంచకూడదు. ఇది పరిమళాన్ని పోగొడుతుంది. ❄

కలకాలం నిలిచేలా...



స్నేహమైనా, ప్రేమైనా, పెండ్లయినా... బంధమేదైనా గొడవలు సహజం. వాటిని అధిగమించాలంటే... ఇద్దరూ కలిసి తమలోని పొరపాట్లను, చిన్నచిన్న సమస్యల్ని ఎలా సరిదిద్దుకోవాలనేది చూసుకోవాలి. ఆ పరిణతి పెంచుకోగలిగితే ఆ బంధం కలకాలం నిలుస్తుంది.

- ఎదుటివారిలో సమస్యలు, లోపాలు ఉండటం మామూలే. అవి ఇబ్బంది కలిగిస్తున్నా కూడా... మౌనంగా ఉండటం సబబు కాదు. ఉద్వేగాలు వ్యక్తం చేయాలి. ఎదుటి వారికి అర్థం అయ్యేలా మీ సమస్యను తెలియజేయాలి. కానీ చాలా మంది ఆ పనిచేయరు. అసలు విషయం కాకుండా ఇంకేదో మాట్లాడతారు. అది ఎదుటి వారికి అర్థంకాక సమస్యలు మొదలవుతాయి. అయితే ఇద్దరూ కలిసి ఎలా పరిష్కరించుకోవాలనే కోణంలో ఆలోచిస్తే ఏ గొడవలూ ఉండవు.
- ఎదుటివ్యక్తిలో ఓ లోపం లేదా సమస్య ఉందని గుర్తించినప్పుడు... ఎప్పుడో ఏదో గొడవ జరిగితే... పదే పదే ప్రస్తావించడం చాలామంది చేసే పొరపాటు. గతం గత్ణ అనే సూత్రాన్ని ఇద్దరూ పాటించాలి. గతాన్ని పదే పదే తవ్వడం, లోపాల్ని ఎత్తిచూపడం వల్ల మనస్పర్థలు పెరుగుతాయే తప్ప మరో ప్రయోజనం ఉండదు.
- వీలైనంతవరకూ ఇతరులతో పోల్చకూడదు. దానివల్ల సమస్యలు పెరుగుతాయే తప్ప తగ్గవు. వివాహ బంధం ఒక పోటీ కాదు. ఈ విషయాన్ని అన్నివేళలా గుర్తుపెట్టుకుంటే సమస్యలు ఉండవు. అబద్ధాలు బంధాలను బలహీనం చేస్తాయి. పొరపాటుగా చెప్పే ఓ చిన్న అబద్ధం... దాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరోటి... ఇంకోటి ఇలా అది కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి అనుబంధంలో నిజాయతీనే ముఖ్యం అని ఇద్దరూ గుర్తుపెట్టుకోవాలి. ❄

మానవి మీ స్పందన

‘మానవి’ పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? ‘నవతెలంగాణ’ కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.

అమ్మాయి ఫోటో ఎరగా...

- పక్కా ప్లాన్‌తోనే జయరామ్ హత్య

నందిగామ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చిగురుపాటి జయరామ్ హత్యకేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. జయరామ్ మేనకోడలు శిఖాచౌదరి ప్రియుడు రాకేష్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా భావిస్తున్నారు. రాకేష్‌రెడ్డి వాట్సప్ డీపీలో అందమైన అమ్మాయి ఫొటోపెట్టి రీనా అన్న పేరుతో ఎరగా చూపి ఒంటరిగా రమ్మని ఛాటింగ్ చేశాడు. ఇది నమ్మి డ్రైవర్ లేకుండా జయరామ్ రీనా ఇల్లుగా భావించి రాఖేష్‌రెడ్డి ఇంటికి వెళ్లాడు. అక్కడ రాఖేష్‌రెడ్డిని చూసి షాక్‌కు గురయ్యాడు. అతని అనుయాయులు జయరామ్‌ను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించినట్లుగా సమాచారం. తన డబ్బు కోసం రాఖేష్‌రెడ్డి ఒత్తిడి చేశాడని, దీంతో జయరామ్ మేనకోడలు శిఖా చౌదరిని రూ.10 లక్షలు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద డబ్బులు లేవని ఆమె తేల్చిచెప్పినట్లు తెలిసింది. కోస్టల్ బ్యాంక్‌లో పనిచేసిన ఓ మహిళకు కూడా జయరామ్ ఫోన్‌చేశాడు. ఆ తరువాత అదేబ్యాంక్‌లో పనిచేసిన ఈశ్వర ప్రసాద్‌కు కూడా జయరామ్ ఫోన్ చేయగా ఆయన 31న ఉదయం రూ. 6 లక్షలు ఇచ్చినట్టు సమాచారం. శిఖాచౌదరితో జయరామ్ లైంగిక సంబంధం కొనసాగిస్తుండటం, రోజూ ఇంటికి వస్తుండటం రాఖేష్‌రెడ్డికి నచ్చలేదని సమాచారం. దీంతో పక్కా ప్లాన్‌తో హత్య చేసినట్లు తెలుస్తోంది. జయరామ్ హార్ట్‌పేషెంట్ అవ్వటంతో అతన్ని గుండెల మీద బలంగా కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారిస్తున్నారు. రాఖేష్‌రెడ్డి జయరామ్‌ను హైదరాబాద్‌లోనే హత్యచేసి కారులోనే ఉంచి, తానే డ్రైవింగ్ చేసుకుంటూ వస్తూ నందిగామ పాతబస్టాండులో ఆగి ఒక వైన్ షాపులో రెండు బీరుసీసాలు కూడా కొనుగోలు చేసినట్లుగా సీసీ పుటేజీల ద్వారా వెల్లడైంది.

నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి


సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని


మాట్లాడుతున్న పోతినేని

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి పంప్‌హౌస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం అన్నారం బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించారు. అనంతరం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ డబ్బు, మద్యం, అధికార బలంతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాళేశ్వరం, కన్నెపల్లి పంప్‌హౌస్‌ల కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.5లక్షల 50వేలు ఇచ్చారనీ, కానీ 2013చట్ట ప్రకారం రూ.20లక్షలు చెల్లించాలనీ డిమాండ్ చేశారు. భూనిర్వాసితులను ఆదుకొని, స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రైతులకు పాస్‌బుక్కులు, రైతుబంధు సాయం అందలేదనీ, వెంటనే పాస్‌బుక్కులు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇసుక లారీల వల్ల అనేక మంది ప్రాణం కోల్పోతున్నారనీ, వారికి రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలనీ కోరారు. ఆయన వెంట కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మేటి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వర్దెల్లి బుచ్చి రాములు కన్నుమూత


ఫైల్

నవతెలంగాణ-సూర్యాపేట

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు వర్దెల్లి బుచ్చి రాములు(85) ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం కన్నుమూశారు. ఆయన సతీమణి వర్దెల్లి లక్ష్మమ్మ గతేడాది డిసెంబర్ 18న మృతిచెందారు. కాగా, అదే నెల 23న బ్రెయిన్ స్ట్రోక్‌తో బుచ్చిరాములు కోమాలోకి వెళ్లారు. చికిత్స నిమిత్తం ఆయనను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పది రోజులు చికిత్స పొందిన తర్వాత నల్లగొండలోని నవ్య మల్టీ స్పెషాలిటీ నర్సింగ్ హోంకు తీసుకొచ్చారు. నెల రోజుల నుంచి ఐసీయూలో ఆయనకు చికిత్స అందిస్తున్న క్రమంలో సోమవారం రాత్రి పరిస్థితి విషమించి చనిపోయారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు అన్నారు. భౌతికకాయాన్ని పార్టీ ఆఫీసులో మంగళవారం ఉదయం 10గంటల వరకూ ఉంచనున్నట్టు, అంత్యక్రియలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు.

ఒకే రవాణా సంస్థ ప్రతిపాదనను విరమించుకోవాలి

- ఆర్టీసీని పటిష్టపర్చేందుకు నిధులు కేటాయించాలి : టీఎస్ ఆర్టీసీ-ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ, ఎంఎంటీఎస్(సబర్బన్) మెట్రోలను అనుసంధానం చేసి ఒకే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ రాం చందర్, ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన పేరుతో ఈ రెండు సంస్థలను కలపడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సామాజిక సేవా ధృక్పదంతో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్టీసీకి బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే అన్ని డిపోల ముందు ఆందోళనకు దిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంత సర్వీసుల నిర్వహణలో వస్తున్న నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు.

20 మంది విద్యార్థినులకు అస్వస్థత



నవతెలంగాణ-చిట్యాల

కలుషిత ఆహారం తిన్న 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (వెలుగు)లో సోమవారం జరిగింది. వసతి గృహంలో ఉదయం విద్యార్థినులకు అల్పాహారంగా కిచిడీ పెట్టారు. అనంతరం 20 మంది విద్యార్థినులు కడుపునొప్పి, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 16 మందికి వసతి గృహంలోనే ప్రథమ చికిత్స అందించారు. ప్రళయ (పదవ తరగతి), స్రవంతి(ఐదవ తరగతి), అంజలి (ఏడవ తరగతి), ఛాయా దేవి(ఐదవ తరగతి)ని మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రళయకి కడుపు నొప్పి ఎక్కువ కావడంతో పరకాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆహారం కలుషితం కావడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు భావిస్తున్నారు.

యువతిపై బ్లేడ్‌తో దాడి

- మహబూబ్‌నగర్‌లో దారుణం

మహబూబ్‌నగర్: నగరంలోని లక్ష్మీ నగర్ కాలనీలో దారుణం జరిగింది. పాలిటెక్నిక్ విద్యార్థినిపై సహ విద్యార్థి అనుదీప్ బ్లేడ్‌తో దాడిచేశారు. ఆ తర్వాత గొంతు కోసుకుని అనుదీప్ ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇద్దరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతున్నది. ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రకాశంలో కుల దురహంకార హత్య

కుమార్తెను చంపిన తండ్రి




ప్రకాశం: తమ కంటే తక్కువ సామాజిక తరగతికి చెందిన యువకుడిని ప్రేమించిందనే దురహంకారంతో తండ్రే కూతురిని చంపేశాడు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం కొత్తపాలెంలో సోమవారం వెలుగుచూసిన ఈ ఉదంతం తీవ్ర సంచలనానికి దారితీసింది. వీఆర్వో యల్లమందారెడ్డి కథనం ప్రకారం.. కొత్తపాలేనికి చెందిన కె వెంకారెడ్డి, విజయమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తెకు పెళ్లి చేశారు. రెండో కుమార్తె వైష్ణవి(20) ఒంగోలులోని శ్రీహర్షిణీ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. అదే క్లాస్‌లో ఉన్న సునీల్, వైష్ణవి ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. . ఈ వ్యవహారం వైష్ణవి ఇంట్లో తెలిసింది. పదిరోజుల క్రితం ఎవరికి చెప్పకుండా ఇద్దరూ తిరుపతికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అమ్మాయి తండ్రి ఇంటికి తిరిగి తీసుకొచ్చారు. అయితే కొద్ది రోజులు కళాశాలకు పంపకుండా ఇంటికి పరిమితం చేశారు.. తాను చెప్పిన వ్యక్తినే పెళ్లిచేసుకోవాలని వెంకారెడ్డి హెచ్చరించాడు. రెండు రోజుల నుండి మళ్లీ కళాశాలకు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో వైష్ణవి, సునీల్ శనివారం రాత్రి శ్రీశైలం వెళ్లేందుకు బస్సు ఎక్కగా, విషయం తెలుసుకున్న వెంకారెడ్డి మార్గమధ్యంలో మార్కాపురంలో వీరి అచూకీ తెలుసుకుని వైష్ణవిని తిరిగి తీసుకొచ్చాడు. ఇదే విషయమై ఆదివారం రాత్రి వైష్ణవి, కుటుంబ సభ్యుల మధ్య వివాదం జరిగింది. ఇంట్లో నిద్రిస్తున్న కుమార్తెను అర్ధరాత్రి ఒంటిగంటి సమయంలో ఆమె తండ్రే గొంతు నులిమి చంపేశాడు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. దరిశి సీఐ ఎం.శ్రీనివాసరావు, తాళ్లూరు ఎస్సై డి.రంగనాథ్ దర్యాప్తు చేస్తున్నారు.

50 శాతం వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలి

ఈవీఎంలలో అవకతవకలపై విచారణ అవసరం :

కేంద్ర ఎన్నికల సంఘానికి 23 పార్టీల ఫిర్యాదు


మాట్లాడుతున్న గులాంనబీ ఆజాద్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో:

ఓట్ల లెక్కింపు సమయంలో 50 శాతం వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలని ప్రతిపక్ష పార్టీలు ఈసీని కోరాయి. సోమవారమిక్కడ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి(సీఈసీ) సునీల్ అరోరాను 23 రాజకీయ పార్టీల ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా ఈవీఎంలపై అనుమానాలు, వీవీప్యాట్ లెక్కింపు అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈవీఎంలపై తయారు చేసిన నివేదికను సీఈసీకి ప్రతిపక్ష నేతలు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లో అవకతవకలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించామని తెలిపారు. పోలైన ఓట్లలో కనీసం 50 శాతం వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాలని ఈసీని కోరినట్టు ఆయన చెప్పారు. ఈవీఎంలో ఏ పార్టీ గుర్తు నొక్కినా ఓట్లు బీజేపీకు వెళ్తున్నాయని ఆజాద్ ఆరోపించారు. బీఎస్పీ నేత సతీష్ చంద్ర మిశ్రా మాట్లాడుతూ వీవీప్యాట్ లెక్కింపుపై సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. సీపీఐ నేత డీ రాజా మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని కోరినట్టు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు, సాంకేతిక పరిజ్ఞానంలో ముందున్న దేశాల్లో సైతం పేపర్ బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఎన్నికల సంఘాన్ని కలిసిన వారిలో అహ్మద్ పటేల్, మల్లికార్జున ఖర్గే, ఆనంద్ శర్మ (కాంగ్రెస్), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), డెరెక్ ఒబ్రెయిన్(టీఎంసీ), సలీం, టీకే రంగరాజన్(సీపీఐ(ఎం)), మజీద్ మెమోన్(ఎన్సీపి), మనోజ్ ఝా (ఆర్జేడీ), సంజయ్ సింగ్(ఆప్), దినేష్ అలీ(జేడీఎస్), ప్రేమ్‌చంద్రన్ (ఆరెస్పీ), కోరుమ్ ఓమీర్ (ఐయుఎంఎల్), బదురుద్దీన్ అజ్మల్ (ఏఐయూడీఎఫ్) తదితరులు ఉన్నారు.


శరత్ పవార్ నివాసంలో ప్రతిపక్ష నేతల భేటీ

ఈసీని కలిసిన అనంతరం ప్రతిపక్షాల నేతలు ఎన్సీపీ అధినేత శరత్ పవార్ నివాసంలో భేటీ అయ్యారు. తాజా పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అమిత్ షాను అడుక్కొనే వాళ్లెవరూ ఇక్కడ లేరని, 2014లో ఎవరి దగ్గరకు ఎవరు వచ్చారో గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.

అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కూడా ఈసీని కలిశారు. ఏపీలో అధికార టీడీపీ దొంగ ఓట్లను సృష్టిస్తుందని ఈసీకి ఆయన ఫిర్యాదు చేశారు.

దారుణాలు..

- నెల్లూరులో యువతిపై సామూహిక.. కర్నూలులోబాలికపై లైంగికదాడి



నెల్లూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కర్నూలు జిల్లాల్లో ఓ యువతి, ఓ బాలిక లైంగికదాడికి గురయ్యారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట పోలీసులు చెప్పిన వివరాల మేరకు శ్రీసిటీలోని ఓ సెల్‌ఫోన్ కంపెనీలో విజయనగరం జిల్లాకు చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు కోసం ఆదివారం రాత్రి స్టేషన్‌లో వేచి ఉన్నారు. కొంతమంది ఆకతాయిలు ఇద్దరిని రైల్వే స్టేషన్ చివరి ప్రాంతానికి బలవంతంగా తీసుకెళ్లారు. యువకుడిపై దాడికి పాల్పడడమే కాకుండా ఆ ప్రాంతం నుంచి తరిమివేశారు. అనంతరం యువతిపై లైంగికదాడికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం యువకుడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తీవ్ర రక్తస్రావమై గాయాలతో బాధపడుతున్న యువతిని పోలీసులు వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరి కొంతమంది పరారీలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

కర్నూలు జిల్లాలో జరిగిన మరో ఘటనలో 11 ఏండ్ల బాలిక లైంగికదాడికి గురైంది. కొత్తపల్లి మండలం సింగరాజుపల్లెలో ఏడో తరగతి బాలికపై ఓ మృగాడు లైంగికదాడి చేశాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... ఆ బాలిక ఇంటి వద్ద చదువుకుంటోంది. పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన హుస్సేనాలం తన మామ గ్రామమైన సింగరాజుల్లెకు ఆదివారం భార్యతో కలిసి వచ్చాడు. బాలిక తల్లి వితంతు పింఛన్ తీసుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం ఎవ్వరూ లేకపోవడంతో బాలికకు మాయ మాటలు చెప్పి బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. రక్తస్రావం కావడంతో ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన సంఘటనను బాలిక వివరించింది. బాలిక తల్లి గ్రామస్తుల సాయంతో కొత్తపల్లి వైద్యశాలకు తరలించారు. ఆదివారం రాత్రి బాలిక తల్లి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితునిపై లైంగికదాడి, బాలల హక్కుల చట్టం కింద ఎస్ఐ బాబు కేసు నమోదు చేశారు.

కేంద్ర రాష్ట్రాల సంఘర్షణకు బీజేపీయే కారణం

- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కత్తాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తిన సంఘర్షణకు బీజేపీయే కారణమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి డివి. కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థలైన సీబీఐ, ఎన్నికల కమిషన్‌ను బీజేపీ ఇష్టమొచ్చినట్టు వాడుకుంటుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు, ప్రతిపక్ష రాష్ట్రాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దాడులను ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు ఖండించాలని కోరారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- మల్కపేట రిజర్వాయర్ పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ-కోనరావుపేట

కాళేశ్వరం 9వ ప్యాకేజీలో భాగంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులను ఆదుకుంటామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె తారకరామారావు అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్‌ను కేటీఆర్ సందర్శించారు. టన్నెల్‌లోకి వెళ్లి పనులను పరిశీలించారు. సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కపేట రిజర్వాయర్‌తో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇక్కడి నుంచి గంభీరావుపేట మండలంలోని సింగసముద్రం, ఎల్లారెడ్డిపేట మండలం లోని అన్ని చెరువులు, కుంటలను నింపేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కాలువల నిర్మాణంలో భూమి కోల్పో తున్న వారికి పరిహారం అందజేస్తామనీ, ప్రతి ఒక్కరూ కాలు వ నిర్మాణాలకు సహకరించాలనీ కోరారు. సిరిసిల్ల మండ లంలోని రగుడు శివారు నుంచి మల్కపేట రిజర్వాయర్ వర కు టన్నెల్ నిర్మాణం (సొరంగ మార్గం) ద్వారా నీటిని సరఫ రా చేసే పనులు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ సంవత్సరం చివరిలోగా టన్నెల్ నిర్మాణంతోపాటు రిజర్వాయర్ పనులు కూడా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఇన్‌చార్జి కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఈఎంసీ హరిరాం, ఈఈ బుచ్చిరెడ్డి ఉన్నారు.

ఆరె కటికలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

వారిని ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి

- ఇందిరాపార్క్ వద్ద ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆరె కటికలు సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ, రూ.500 కోట్ల నిధులతో ప్రత్యేక ఫెడరేషన్ చేయాలనీ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరె కటికల అభివృద్ధి సంఘం సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారిని ఎంబీసీ జాబితాలో చేర్చాలన్నారు. మాంసం వ్యాపారంలో కూడా కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి ఆరె కటికల జీవనోపాధిపై దెబ్బకొట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. మటన్ ప్రాసెసింగ్ యంత్రాలను ఆరెకటికలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్స్, క్యాంటీన్లు, జైళ్లు, ఆస్పత్రుల్లో మటన్ సరఫరాను వారికే అప్పగించాలన్నారు. ఆధునిక దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వమే ఆర్థిక సాయమందించాలన్నారు. మాంసం విక్రయదారులైన ప్రతి ఒక్క ఆరె కటికకూ రూ.5 లక్షల రుణం ఇవ్వాలని కోరారు. ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ.. గతంలో సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించినందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరె కటిక అభివృద్ధి సంఘం అధ్యక్షులు అశోక్ కుమార్, గౌరవ అధ్యక్షులు అరుణ్‌కుమార్, వరంగల్ జిల్లా నాయకులు క్రాంతి, సీపీఐ రాష్ట్ర నాయకులు పాండు రంగాచారి, ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.ఎస్. సుదర్శన్‌రావు, బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ కిల్లె గోపాల్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ, ఎంబీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి:

ఉన్నతవిద్యా సదస్సులో నవీన్ మిట్టల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాణ్యమైన చదువులతోపాటు నైపుణ్యం ఉన్న విద్యార్థులకే ఉద్యోగావకాశాలు లభిస్తాయని సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ చెప్పారు. రెండోరోజులపాటు జరిగే ఉన్నత విద్యా సదస్సు సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన నవీన్ మిట్టల్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమన్నారు. విద్యారంగంలో అనేక మార్పులొచ్చాయని చెప్పారు. మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు (మూక్స్) ద్వారా చదవొచ్చని అన్నారు. ప్రపంచంలో ఎక్కువ మంది ఆన్‌లైన్ కోర్సులు చేస్తున్నారని చెప్పారు. రెగ్యులర్ కోర్సులతో ఆన్‌లైన్ కోర్సుల సర్టిఫికెట్లకు సమాన గుర్తింపు ఉంటుందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రకటించిందన్నారు. ఒకప్పుడు తప్పనిసరిగా విద్యాసంస్థలకు వెళ్లాల్సి ఉండేదనీ, అక్కడ ఉండే కోర్సులనే చదవాల్సి వచ్చేదనీ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తర్వాత ఇంటి వద్ద ఉండే నచ్చిన కోర్సులను ఆన్‌లైన్‌లో చదువుకునే వెసులుబాటు వచ్చిందన్నారు. గతంలో ఓ తరగతిలో ఉండే వారందరూ ఒకే పాఠ్యాంశాలు వినాల్సి ఉండేదనీ, ఇప్పుడు ఆన్‌లైన్ కోర్సుల వల్ల ఎవరికి నచ్చిన పాఠాలను వారు వినొచ్చనీ అన్నారు. పారిశ్రామిక విప్లవం తరహాలో విద్యారంగంలో విప్లవం రావాల్సిన అవసరముందన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం మొబైల్ ఫోన్ల ద్వారానే వినియోగించుకునే సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఆలిండియా సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) డిప్యూటీ డైరెక్టర్ నీతూ భగత్ మాట్లాడుతూ సాంకేతిక విద్యాసంస్థల్లో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) వైస్ చైర్మెన్ ఆర్ లింబాద్రి మాట్లాడుతూ ఉన్నత విద్యలో చేరే విద్యార్థులు జాతీయస్థాయిలో 26 శాతం ఉంటే, తెలంగాణలో 36.3 శాతం ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో 52 గురుకుల డిగ్రీ కాలేజీలను అమ్మాయిలకోసం ప్రారంభించి నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు. టాస్క్ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచంలోనే ఉపాధి అవకాశాలు కల్పించడం పెద్ద సవాల్‌గా మారిందన్నారు. నిరుద్యోగం పెరగడం ఆందోళనకరమని అన్నారు. నాణ్యమైన విద్య అందించి నైపుణ్యం పెంపొందిస్తే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా డైరెక్టర్ అమల అక్కినేని మాట్లాడుతూ సృజనాత్మకంగా ఆలోచించే వారికోసం పరిశ్రమలు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ జె మహేందర్‌రెడ్డి, శ్రీనిధి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎస్ బ్యాంక్ గ్రూప్ ప్రెసిడెంట్ రింకీ ఢింగ్రా, డిజిటల్ లెర్నింగ్ ఎడిటర్ ఇన్ చీఫ్ రవి గుప్త, ఈలెట్ ప్రతినిధులు సుధీర్, అభిషేక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఆన్‌లైన్ చెల్లింపుల కోసం ఎస్ బ్యాంక్, సాంకేతతిక విద్యాశాఖ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది.

ఒకరి తప్పులను మరొకరు దాస్తున్నారు

మోడీ, కేసీఆర్‌లపై విజయశాంతి ఆగ్రహం

- తమ ప్రచారంతో పార్టీని గెలిపించే దిశగా కృషి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తమ తప్పులు బయటపడకుండా ఒకరినొకరు దాస్తున్నారని కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి విమర్శించారు. ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతు ఇవ్వాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కోరిన కేసీఆర్...సీబీఐ దాడులపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రత్యామ్నాయమే ఫెడరల్ ఫ్రంట్ అంటూ చెబుతున్న కేసీఆర్ పరోక్షంగా మోడీకి మద్దతు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రచారంతో పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి డికె అరుణ నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మోడీ, కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. అనేక విషయాలలో మోడీకి మద్దతు ఇచ్చిన కేసీఆర్...వచ్చే ఎన్నికల్లో మరొసారి మద్దతు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు మంత్రి వర్గం కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కేసీఆర్‌ని గెలిపించింది యాగాలు చేయడానికా? లేక పరిపాలన చేయడానికా? అని ప్రశ్నించారు. ఫామ్ హౌజ్‌లో ఉండేవారికి కాకుండా ప్రజల మనిషికి అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజలు కోపంగా ఉన్న తెలుగుదేశంపార్టీని ముందు ఉంచి కేసీఆర్ ఎన్నికల్లో లబ్ది పొందారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లనే వినియోగించాలని డిమాండ్ చేశారు. తాను పోటీ చేసే అంశంపై అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికార దుర్వినియోగం, డబ్బు, ప్రలోభాలకు గురి చేసిందని చెప్పారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, వాటన్నింటిని ఈసీ నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచార క్యాంపెయినర్‌గా తమను నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

టీఆర్ఎస్ కుట్రలకు మరోసారి మోసపోవద్దు : డికె అరుణ

పార్లమెంటు ఎన్నికల్లో టీఆర్ఎస్ కుట్రలకు మరోసారి మోసపోవద్దని ఎన్నికల ప్రచార కమిటీ కో చైర్‌పర్సన్ డికె అరుణ విజ్ఞప్తి చేశారు. శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తోందని చెప్పారు. టీఆర్ఎస్ పాలనలో విభజన హామీల్లో ఏ ఒక్కటీ సాధించలేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఎన్నికల కమిషన్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. అభివద్ధి చెందిన దేశాలు సైతం ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ వాడుతున్నాయని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ బ్యాలెట్ పేపర్ ఉపయోగించాలన్నారు. తమ అధిష్టానం ఆదేశిస్తే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షుడ్ని మార్చే నిర్ణయం అధిష్టానమే తీసుకుంటుందన్నారు.

భారత జాతికే అవమానం : పొన్నం ప్రభాకర్

హిందూమహాసభ కార్యకర్తలు.. గాంధీ విగ్రహాన్ని అవమానించిన మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఇది మొత్తం భారతదేశానికే అవమానం అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్ తెలిపారు. హిందూమహాసభ ప్రధాన కార్యదర్శి పాండేను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా గాంధీభవన్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాంధీ విగ్రహాన్ని అవమానించిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీకి హిందూమహాసభ అనుబంధసంఘం అని ఆయన పేర్కొన్నారు.

సోమాలియాలో కారు బాంబు పేలుడు

11 మంది మృతి, 10 మందికి గాయాలు

మొగదీషు : సోమాలియా రాజధాని మొగదీషులో కారుబాంబు పేలుడు సంభవించింది. ఈ పేలుడులో 11 మంది మృతి చెందగా, మరో 10 మంది తీవ్రంగా గాయ పడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. జిల్లా ఎస్పీ మొహ్మద్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం... మొగదీషులోని హమార్వేన్ మాల్‌కు సమీపంలో కారు బాంబు పేలింది. ఈ పేలుడులో 11 మంది మృతి చెందారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి పరిసర ప్రాంతంలోని భవ నాలన్నీ దద్దరిల్లాయి. పలు భవనాలు కూలిపోయాయి. భవనాల శకలాల కింద క్షతగాత్రులు చిక్కుకొని ఉండొచ్చని ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. ప్రత్యేక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు ప్రయత్ని స్తున్నాయి.

కాగా, ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. అయితే, సోమాలియాలో అల్‌షాబాబ్ ఉగ్రసంస్థ పలు భారీ విధ్వంసాలకు పాల్పడి వందలాది మంది అమాయక ప్రజలను పొట్టనబెట్టుకుంది. కారు బాంబు పేలుడు కూడా అల్‌షాబాబ్ మిలిటెంట్ల పనేనని పోలీస్ అధికారులు అనుమానిస్తున్నారు.



కాలిఫోర్నియాలో విమాన ప్రమాదం

- ఐదుగురు మృతి, ఇద్దరికి గాయాలు



వాషింగ్టన్ : కాలిఫోర్నియాలో విమాన ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ఆరంజ్ నగరంలో చిన్న విమానం కూలిపోయింది. ఈ ఘటనలో పైలట్ సహా ఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు.

ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. సెస్‌నా-414ఏ విమానం ఫుల్లర్టన్ మున్సిపల్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరిన కొద్దిసేపటికి ప్రమాదానికి గురైందని అధికారులు తెలిపారు. విమానం ఓ ఇంటిపై కూలిపోవడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. విమాన ప్రమాదం సంభవించిన పరిసరప్రాంతాల్లో దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్టు నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు పేర్కొన్నది.

బ్రిటన్‌లో బ్రెగ్జిట్ భయం

అల్లర్లు చెలరేగే ప్రమాదముందని నిఘావర్గాల హెచ్చరిక

లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలిగినట్టయితే అల్లర్లు చెలరేగే ప్రమాదముందిన నిఘా వర్గాలు హెచ్చ రిస్తున్నాయి. లండన్‌లో అల్లర్లు చెలరేగినట్టయితే బ్రిటన్ రాజకుటుంబ సభ్యులను క్షేమంగా తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. బ్రెగ్జిట్ ఒప్పందం ప్రకారం వచ్చేనెల 29న బ్రిటన్ ఈయూ నుంచి వైదొలగాల్సి ఉంది.

ఇప్పటికే బ్రెగ్జిట్‌పై బ్రిటన్ ప్రభుత్వంలో అనిశ్చితి నెలకొంది. బ్రెగ్జిట్ డెడ్‌లైన్‌లోగా ఈయూతో బ్రిటన్ ఒప్పందం కుదుర్చుకోని పక్షంలో బ్రిటన్‌లో అల్లర్లు తలెత్తే అవకాశం ఉందని దర్యాప్తు ఏజన్సీలు అనుమానిస్తున్నాయి.

ముందు జాగ్రత్తగా బ్రిటన్ రాణి, ఆమె భర్తను లండన్ వెలుపలకు తరలించేందుకు అవకాశం ఉంది. అల్లర్లు తలెత్తినట్టయితే శాంతి భద్రతల నిమిత్తం స్కాట్‌లాండ్ పోలీసులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని లండన్ పోలీసులు ప్రణాళికను ఖరారు చేశారు. కాగా మార్చిలోగా బ్రెగ్జిట్‌నుంచి వైదొలుగుతామనే నిర్ణయంతో ఉన్నట్టు ప్రధాని మే ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే.



కొత్త ఉత్సాహంతో చర్చలు

లండన్: బ్రెగ్జిట్ ఒప్పందంపై ఈయూ నెగోషియేటర్లతో భేటీ అయినప్పుడు తన వద్ద తమ ప్రజాప్రతినిధులు ఇచ్చిన తాజా తీర్పు, నవీన ఆలోచనలు అనే ఆయుధాలు ఉంటాయని బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసా మే పేర్కొన్నారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని మరోసారి చర్చకు పెట్టకూడదని ఈయూ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే బ్రెగ్జిట్ ఒప్పందంలోని సర్వసమ్మతం కాని అవరోధాలను వదిలించుకోవడానికి చేస్తున్న కృషిలో భాగంగా తాను బ్రిటన్, నార్తర్న్ ఐర్‌ల్యాండ్ కోసం పోరాడుతూనే ఉంటానని థెరిసా మే 'సండే టెలిగ్రాఫ్'లో రాశారు. 'మేము పరస్పరం కలిసి ఉండి, ఒకే స్వరంతో మాట్లాడితే మేము సరైన మార్గంలో ముందుకు వెళ్లగలమనే విశ్వాసం నాకు ఉంది' అని ఆమె పేర్కొన్నారు. ఐర్లాండ్‌తో సరిహద్దు గురించి మాట్లాడకూడదనే ఉద్దేశంతో అవరోధం కల్పిస్తూ నిబంధన పెట్టారు. అయితే, ఈయూ కస్టమ్స్ నియమాలకు బ్రిటన్ కట్టుబడి ఉండాల్సి వస్తుందని బ్రెగ్జిట్ ఒప్పందానికి మద్దతు ఇస్తున్న వారు భయపడుతున్నారు. ఈ నిబంధనపై తిరిగి చర్చలు జరిపేందుకు థెరిసా మే బ్రసెల్స్‌కు వెళ్లాలనే వైఖరికి అనుకూలంగా గత వారం బ్రిటన్ పార్లమెంటు సభ్యులు ఓటు వేశారు.

అప్పుడే బ్రెగ్జిట్ ఒప్పందానికి ఆమోదం లభిస్తుందని సూచించారు. గత నెలలో బ్రిటన్ పార్లమెంటు బ్రెగ్జిట్ ఒప్పందాన్ని దాదాపు తిరస్కరించింది. 'ఈయూ వద్దకు బ్రెగ్జిట్ ఒప్పందంపై తిరిగి చర్చించడానికి వెళ్లేందుకు హౌస్ ఆఫ్ కామన్స్‌లో మెజారిటీ ద్వారా ఒక సురక్షితమయిన మార్గం దొరికిందని నాకు ఇప్పుడు విశ్వాసం కలిగింది' అని థెరిసా మే 'సండే టెలిగ్రాఫ్'లో రాశారు.

గైడోకు మద్దతుగా ఈయూ సభ్యదేశాలు



కరాకస్ : యూరోపియన్ యూనియన్(ఈయూ)లోని ఆరు సభ్యదేశాలు వెనెజులా ప్రతిపక్ష నేత గైడోకు మద్దతిస్తునట్టు ప్రకటించాయి. వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దింపేందుకు అమెరికా కుట్ర పన్నిన సంగతి తెలిసిందే. అమెరికా మిత్రదేశాలు గైడోకు మద్దతు ప్రకటించగా, రష్యా మిత్రదేశాలు మదురోకు బాసటగా నిలిచాయి. వెనెజులాలో రాజకీయ సంక్షోభం కొనసాగుతున్నది. సైనిక తిరుగుబాటుకు అమెరికా పావులు కదుపుతుండగా ఇక్కడి సైన్యం మదురోకు మద్దతుగా నిలవడంతో సైనిక తిరుగుబాటు కుట్ర భగ్నమైంది. గైడో, మదురో వర్గీయుల మధ్య కొనసాగిన ఘర్షణల్లో 29 మంది మృతిచెందారు. పదులసంఖ్యలో గాయపడ్డారు.

ఇక్కడి అల్లర్లను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఐరాస ప్రయత్నిస్తున్నది. మదురోకు బొలీవియా, చైనా, క్యూబా, ఇరాన్, నికరాగ్వా, రష్యా, సిరియా, టర్కీ దేశాలు మద్దతిస్తుండగా...గైడోకు ఆస్ట్రేలియా, అల్జీరియా, బ్రెజిల్, కెనడా, చిలీ, కొలంబియా, కోస్టారికా, డెన్మార్క్, ఈక్వెడార్, ఫ్రాన్స్, జర్మనీ, గ్వాటెమలా, హోండ్యూరస్, లాట్వియా, లిథుయానా, నెదర్లాండ్, పనామా, పరాగ్వే, పెరూ, స్పెయిన్, స్వీడన్, బ్రిటన్, అమెరికా దేశాలు మద్దతిస్తున్నాయి.

ఇరాక్‌లో అమెరికా సైనిక శిబిరం : ట్రంప్



బాగ్దాద్ : ఇరాక్‌లో సైనిక శిబిరం నిర్మించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వెల్లడించారు. ట్రంప్ ప్రకటనపై ఇరాక్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, సిరియాలోని ఉగ్రసంస్థలపై విజయం సాధించినట్టు గతనెలలో ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో అక్కడ మోహరించిన 2వేల మంది సైనికులను వెనక్కి రావాలని ట్రంప్ ఆదేశించారు. సిరియా నుంచి వైదొలిగిన అమెరికా బలగాలను ఇరాక్‌కు తరలించే ఏర్పాట్లు చేయనున్నట్టు ప్రకటించారు. ఇరాక్ భూభాగంలోని తమ సైనిక శిబిరం నుంచి ఇరాన్ కదలికలను గమనిస్తామని ట్రంప్ చెప్పారు. అయితే, అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటన మధ్య ప్రాచ్య దేశాల్లో చిచ్చు రగిల్చేలా ఉంది. ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాక్ అధ్యక్షుడు బర్హామ్ సాలిహ్ మండిపడ్డారు. ఇరాక్ సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసేందుకు ట్రంప్ కుట్ర పన్నారని అన్నారు. అమెరికా ప్రకటనతో ఇరాన్, ఇరాక్ మధ్య ఉద్రిక్త వాతావరణ తలెత్తే ప్రమాదముందని అన్నారు. ఇరాక్‌లో అమెరికా బలగాల మోహరింపునకు సంబంధించి ట్రంప్ తమతో ఎలాంటి సంప్ర దింపులు, చర్చలు జరపలేదని అన్నారు. ఇరాక్‌ను సంప్రదించకుండానే ట్రంప్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఐఎస్‌పై పోరాటంలో భాగంగా తమ బలగాలు అమెరికా సైన్యంతో కలిసి ఉమ్మడి ఆపరేషన్ నిర్వహిస్తున్నాయని అన్నారు. ఇదే అదనుగా తీసుకొని తమ భూభాగంలో అమెరికా బలగాలను మోహరించాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నారని, ఇది ఏమాత్రం ఆమోద యోగ్యమైన నిర్ణయం కాదన్నారు. తమ పొరుగుదేశమైన ఇరాన్‌తో తమకు ఎలాంటి విబేధాలు లేవన్నారు. ట్రంప్ చర్యలతో ఇరాన్, ఇరాక్ మధ్య విబేధాలు తలెత్తి యుద్ధవాతావరణానికి దారి తీసే ప్రమాదముందని సాలిహ్ అన్నారు.

జాతీయ ఎమర్జెన్సీ ప్రకటిస్తా...: ట్రంప్



వాషింగ్టన్ : దేశానికి అక్రమ వలసల నిరోధం, గోడ నిర్మాణంపై వెనకడుగువేసేది లేదని డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం లభించకపోయినా తనకున్న విశేష అధికారాలను వినియోగించి గోడ నిర్మాణం చేపడతానని అన్నారు. అవసరమైతే జాతీయ ఎమర్జెన్సీని ప్రకటించాలని ట్రంప్ భావిస్తున్నారు. దక్షిణ మెక్సికో సరిహద్దు నుంచి అమెరికాలోకి వెల్లువెత్తుతున్న అక్రమ వలసను అరికట్టి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత తనకుందని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. 'ఫేస్ ద నేషన్' కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ అవసరమైనే విపత్తుల పురావాస నిధుల నుంచి డబ్బులు తీసుకొచ్చయినా మెక్సికో గోడ నిర్మిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష డెమోక్రాట్లపై ట్రంప్ విరుచుకుపడ్డారు. డెమోక్రాట్లతో చర్చలు శుద్ధ దండగ అని వ్యాఖ్యానించారు. ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.' ఫెలోసీ ఓ పట్టాన వినే మనిషి కాదు. అన్నింటినీ రాజకీయాలు చేస్తోంది' అని ట్రంప్ విమర్శించారు. నాన్సీ మారుతుందని తాము ఆశించామని అయితే ఫలితం లేకపోయిందని అధ్యక్షుడు చెప్పారు. ఫెలోసీ వల్ల దేశానికి ఎంతో నష్టం అంటూ ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. 'నిజం చెప్పాలంటే ఆమె సరిహద్దును తెరిచి ఉండాలనే కోరుకుంటారు. మానవ అక్రమ రవాణా, దేశ భద్రత ఆమెకు పట్టవు'అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నా నాన్సీ ఫెలోసీకి పట్టదని మరోసారి విరుచుకుపడ్డారు.

భూమీ లేదు... భుక్తీ లేదు...

పడకేసిన భూ పంపిణీ

- ఐదేండ్లలో 12వేల ఎకరాలే
- ఖజానాలో మూలుగుతున్న నిధులు
- లబ్దిదారులను గుర్తించడంలో సర్కారు నిర్లక్ష్యం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద దళితుల కోసం చేపట్టిన మూడెకరాల భూ పంపిణీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించి కాడెత్తేసింది. 2104 ఆగస్టు 15న గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు 52 మంది దళిత మహిళలకు పట్టాలు అందజేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏడాది పాటు భూ పంపిణీ కోసం అధికార యంత్రాంగం కొంత హడావుడి చేసింది. రాష్ట్రంలో మూడు లక్షల మంది భూమి లేని నిరుపేద దళితులున్నారని, వారందరికీ భూ పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. అవసరమైతే భూమి లేని చోట కొనుగోలు చేసి ఇవ్వాలని సూచించింది. దీంతో 119 నియోజకవర్గాల్లోని 52 గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్టు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. అర్హులైన నిరుపేద దళితులందరికీ భూ పంపిణీ చేసేందుకు భూమి లేని చోట ప్రయివేటు వ్యక్తుల నుంచి భూమి కొనుగోలు చేసేందుకు జిల్లాకు రూ.100 కోట్లు కేటాయించింది.3 లక్షల మందికి గడిచిన ఐదేండ్లలో కేవలం 12వేల ఎకరాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ భూములు లేవని, ప్రయివేటు వ్యక్తులు భూములు విక్రయించడానికి సిద్ధపడటం లేదంటూ గత నాలుగున్నర సంవత్సరాలుగా భూ పంపిణీ నత్తనడకన నడుస్తున్నది. భూ పంపిణీపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షలు కూడా నిర్వహించకపోవడం గమనార్హం. గత మంత్రివర్గంలో ఎస్సీ సంక్షేమ శాఖకు దళిత మంత్రి లేకపోవడంతోనే భూ పంపిణీ కార్యక్రమం పడకేసిందన్న విమర్శలు ఇప్పటికీ ఉన్నాయి.

ఏది లేదు

గ్రామాల్లో నిరుపేద దళితుల పరిస్థితి దయనీయంగా మారింది. మూడెకరాల భూమిపై ఆశలు పెట్టుకున్న దళితుల పరిస్థితి ఇప్పుడు భూమి లేదూ..భుక్తీ లేదు అన్న తీరుగా తయారైంది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో గ్రామాల్లోని భూములన్నీ ప్లాట్లుగా మారాయి. వ్యవసాయ పనులు లేకపోవడం, ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో నిరుపేద దళితులు పట్టణాలకు వలస బాట పట్టారు. సర్కారు భూమి ఇవ్వకపోదా? మా బతుకులు మారకపోవా? అనుకున్న దళితులు చివరికి అడ్డా మీద కూలీలుగా బతకాల్సిన దుస్థితి. మూడెకరాల భూమి కోసం పెట్టుకున్న అర్జీలు ప్రభుత్వ కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. భూముల కొనుగోలు కోసం జిల్లాకు కేటాయించిన రూ.100 కోట్లు ఖజానాలో మూలుగుతున్నాయే తప్ప ఖర్చవుతున్న దాఖలాలు లేవు. కార్యక్రమం చేపట్టిన తొలి నాళ్లలో 1200 మంది లబ్దిదారులకు పట్టాలు అందజేసింది. నాటి నుంచి నేటి వరకు టీఆర్ఎస్ సర్కారు కేవలం 12వేల ఎకరాల భూమి మాత్రమే పంపిణీ జరిగింది. పంపిణీ చేసిన వారికి భూమి పత్రాలు అందజేసిందే తప్ప భూములను రిజిస్ట్రేషన్ చేయలేదు. మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పంపిణీ చేసిన భూములు సాగుకు అనుకూలంగా లేకపోవడంతో ఇప్పటికీ దళితులు వాటిని సాగు చేయలేని పరిస్థితి నెలకొంది.

ఐదేండ్లలో 12వేల ఎకరాలే..

భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన తర్వాత తొలి విడతలో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లోని 98 నియోజకవర్గాలను ఎపింక చేసి భూమి లేని దళితులందరికీ ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే 40 నియోజకవర్గాల్లోని 50 గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్టు సీసీఎల్ఏ అధికారులు గుర్తించారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వ భూమి ఉన్న చోట కూడా భూ పంపిణీ జరగడం లేదు. మూడెకరాల కోసం లబ్దిదారులు తహశీల్దార్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భూములు లేనప్పుడు భూ పంపిణీ ఎలా చేస్తామని లబ్దిదారులనే ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వెచ్చించి భూములను కొలుగోలు చేసి లబ్దిదారులకు అందజేయాల్సి ఉండగా అధికార యంత్రాంగం ఆ దిశగా కృషి చేయడం లేదు.

కొత్త జిల్లాలతో చిక్కులు

రాష్ట్రంలో 21 కొత్త జిల్లాలు ఏర్పాటు తర్వాత భూ పంపిణీ మరింత అటకెక్కింది. ఇప్పిటికీ జిల్లా సరిహద్దులు తేలకపోవడం, లబ్దిదారులు ఏ జిల్లాల్లో దరఖాస్తు చేసుకోవాలో తెలియ కపోవడంతో భూ పంపిణీ పూర్తిగా అటకెక్కింది. మహబూబ్‌గనర్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో భూముల ధరలు పెరగడంతో ప్రభుత్వ భూములను పంపిణీ చేయడానికి అధికారులు కూడా అయిష్టత చూపుతున్నట్టు తెలిసింది. ఎకరం భూమి రూ.50 నుంచి రూ కోటి వరకు పలుకుతుండటంతో ప్రభుత్వ భూములను పంపిణీ చేయడం లేదని లబ్దిదారులు తెలిపారు. ఎకరం భూమి రూ.7లక్షల లోపు అందుబాటులో ఉంటే కొనుగోలు చేసేందుకు తాము సిద్ధమని అధికార యంత్రాంగం చెబుతున్నది. మీరే భూములను చూసుకుని దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్లు లబ్దిదారులకు సూచించడం గమనార్హం.

మారిన ప్రాధాన్యతలు

రాష్ట్రంలో పరిశ్రమలకు పెద్ద పీట వేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమాన్ని పక్కన పెట్టింది.పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి భూములను కేటాయించాల్సి ఉన్నందున భూ పంపిణీ తుతూ మంత్రంగా నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఈ కారణం చేతనే మూడెకరాల భూ పంపిణీని అటకెక్కించే ఆలోచనలో సర్కారు ఉన్నట్టు తెలిసింది. ఇదివరకే 3.50లక్షల ఎకరాలతో "భూబ్యాంకు" ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో సేకరించిన భూమి అంతా ప్రభుత్వానిదే కావడం గమనార్హం. ఈ భూమిని దళితులకు పంచాలని, పరిశ్రమలకు ప్రభుత్వ భూమే ఇవ్వాల్సిన అవసరం లేదన్న డిమాండ్లు వస్తున్నా సర్కారు మాత్రం పట్టించుకోవడం లేదు.

భూసేకరణ ఇలా..

- ప్రభుత్వ భూములు లేని చోట వ్యవసాయ భూములు ఉండి విదేశాల్లో స్థిరపడ్డ వారి వివరాలను సేకరించనుంది. ప్రభుత్వమే నేరుగా భూములనుకొనుగోలు చేయనుంది.
- భూమి లేని నిరుపేదలను ఆయా గ్రామాల్లోని దళిత గ్రామ పెద్దలే ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన లబ్దిదారులే నేరుగా వారికి అనువైన భూమిని ఎంచుకోవాల్సి ఉంటుంది.
- ఎంపిక చేసుకున్న భూమిని మండల తహసీల్దార్లకు నివేదించాలి. సంబంధిత తహసీల్దారు గుర్తించిన భూమిని జిల్లా కలెక్టరుకు నివేదిస్తారు.
- ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూ యజమాని అంగీకరిస్తే అందుకు సంబంధించిన చెక్కును నేరుగా కలెక్టర్ భూ యజమానికి అందజేస్తారు.
- ప్రభుత్వం ఇచ్చిన భూములను లబ్దిదారులు తిరిగి విక్రయించకుండా వాటి వివరాలను ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్‌లో (పిఓబి)లో పొందుపరుస్తారు. దీంతో ఆ భూములను అమ్మడానికి వీలుండదు.

తెల్‌తుంబ్డేపై కుట్రపూరిత కేసులు

- నేడు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు: తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి హరగోపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని వర్గాల వారితో సమానంగా పేదవారికి కూడా విద్యావకాశాలు కల్పించాలని ప్రభుత్వంపై పోరాడుతున్న విద్యారంగ ఉద్యమ నాయకుడు, అంబేద్కర్ మనువడు, ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డేపై మహారాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరిత కేసులు బనాయించడం అన్యాయమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. దీనిని నిరసిస్తూ మంగళవారం రోజు దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. తెల్‌తుంబ్డే అరెస్టును నిరసిస్తూ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 డిసెంబర్ 31న ఎల్గార్ పరిషత్ ఆధ్వర్యంలో భీమాకోరేగాంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనంద్ తెల్‌తుంబ్డే పాల్గొని ప్రజలను రెచ్చగొట్టేలా ఉపన్యాసం చేశాడని పోలీసులు అక్రమ కేసులు బనాయించడాన్ని తప్పుబట్టారు. ఎల్గార్ పరిషత్‌తో అభిప్రాయభేదాల కారణంగా తెల్‌తుంబ్డేకు అసలు ఆ కార్యక్రమానికి హాజరుకాలేదని ఆధారాలతో సహా నిరూపితమైన తర్వాత కూడా పూణే పోలీసులు అయన్ని వేధించడం సరిగాదన్నారు. భీమాకోరేగాం అల్లర్లకు కారణమైన అసలు నిందితులు బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులైన శంభాజీ బీడే, మిలింద్ ఎగ్బొటేలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని మోడీ సర్కారు రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగపర్చటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కలకత్తా నగర సీపీపై సీబీఐ దాడి చేయిండాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వంపై సుప్రీం కోర్టుకు వెళ్తామని మోడీ సర్కారు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగా కోర్టులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. శబరిమల దేవస్థానంలోకి వెళ్లేందుకు అడవాళ్లకు అవకాశం కల్పించాలని సుప్రీం కోర్టు చెబితే...మతం అక్కడి ప్రజలను మోడీ, అమిత్ షా కో ఎందుకు ఉసిగొల్పుతుందో చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో ఫాసిస్టు పాలన సాగుతున్నదని, వర్సిటీల్లో ప్రొఫెసర్ల నోర్లను నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగే నిరసన ప్రదర్శనలు, ర్యాలీల్లో ప్రజలు, సామాజిక, ప్రజా సంఘాలకు చెందిన వారంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కె.చంద్రధరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల నాయకులు కె.భగవంతరెడ్డి, ఎమ్ఎన్ క్రిష్టప్ప, కె.రవీందర్, లక్ష్మారెడ్డి, కెఎస్.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డిపై విచారణ పూర్తి

- కలెక్టర్, ఆర్‌జేడీలకు నివేదిస్తాం : జీసీడీఓ ఉదయశ్రీ

నవతెలంగాణ-కూసుమంచి

బాలికలను లైంగిక వైధింపులకు గురిచేస్తున్నాడనే ఆరోపణ నేపథ్యంలో ఖమ్మం జిల్లా కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డిపై ఉన్నతాధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జీసీడీఓ (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) ఉదయ్‌శ్రీ మాట్లాడుతూ.. డీఈఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామనీ, తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులను విచారించామనీ తెలిపారు. విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాలను నివేదిక రూపంలో కలెక్టర్, ఆర్‌జేడీలకు అందజేయనున్నట్టు చెప్పారు. ఆమె వెంట డీసీపీఓ విష్ణువందన, సీడీపీఓ బాలత్రిపురసుందరి, ఎంఈఓ రామాచారి, ఎస్ఐ జి.అశోక్, విద్యాకమిటీ చైర్మన్ హకీమ్‌పాషా, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు ఉన్నారు.

పల్లెల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

- వ్యవసాయ అభివృద్ధికి మరింత కృషి అవసరం: సుప్రీంకోర్టు న్యాయమూర్తి (రిటైర్డ్) జాస్తి చలమేశ్వర్

నవతెలంగాణ- కామేపల్లి



వివిధ రంగాల్లో పనిచేసి రిటైర్ అయినవారు ఫాంహౌస్‌ల్లో విశ్రాంతి తీసుకునే బదులు పల్లెటూర్ల అభివృద్ధికి కృషి చేయాలని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ఊట్కూరులో డాక్టర్ సామినేని రాఘవులు నిర్మించిన సామాజిక కేంద్రం 4వ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చలమేశ్వర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. రైతులు క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి సహజ ఎరువులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వ్యక్తిగత జీవితంలో బిజీగా ఉండేవారు కొంత సమయాన్ని యోగా, ధ్యానంపై దృష్టి పెట్టడం ద్వారా ఉపశమనం పొందొచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. సమాజంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు సహాయ సహకారాలు అందించేందుకు సామాజిక కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతునేస్తం అధ్యక్షులు వై.కోటేశ్వరరావు ప్రకృతి సేంద్రీయ వ్యవసాయంపై సందేశమిచ్చారు. వ్యవసాయ శాస్త్రవేత్త కేవీకే వైరా డాక్టర్ హేమంత్‌కుమార్ మానవ శరీరంపై రసాయనాల ప్రభావం గురించి విశ్లేషణ ఇచ్చారు. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నల్లమల వెంటేశ్వరరావు మాట్లాడుతూ.. నిషేధిత పురుగు మందులు, ఆచరణపై విశ్లేషణ చేశారు.

జిల్లా ఉత్తమ పైలెట్‌గా ప్రశంసలు అందుకున్న కామేపల్లి మండల 108 పైలెట్ రాయల రామారావును చలమేశ్వర్ సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక కేంద్రం నిర్వహణకర్త సామినేని రాఘవులు, సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంత్ వర్మ, రాజశేఖర్, జీవిత, సి.కళ్యాణ్

యాంగ్రీ యంగ్ మ్యాన్ కాదు యాంగ్రీ స్టార్

డా॥ రాజశేఖర్ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో శివాని శివాత్మిక సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'కల్కి'. ఆదాశర్మ, నందితా శ్వేత, స్కార్లెట్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సోమవారం రాజశేఖర్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆదివారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు.
ఈ నేపథ్యంలో హీరో రాజశేఖర్ మాట్లాడుతూ, "గరుడవేగ' తర్వాత ఏం చేయాలనుకున్నప్పుడు ఆరేడు నెలలు కథల కోసం అన్వేషించాం. అప్పుడే ఈ కథ ఓకే చేశాం. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ డేట్స్ కోసం చాలా రోజులు ఎదురుచూశాం. 'గరుడవేగ' చిత్రానికి ప్రవీణ్ సత్తారుతో పనిచేసేటప్పుడు ఎంత కొత్తగా ఫీల్ అయ్యానో, ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మతో పనిచేసేటప్పుడు కూడా అంతే కొత్తగా ఫీల్ అవుతున్నాను. చాలా రోజుల తర్వాత సి.కళ్యాణ్ సంస్థలో నటిస్తున్న చిత్రమిది. నాకు ప్రమోషన్ వచ్చినట్టు భావిస్తున్నా. సినిమాలో విషయం లేకపోతే కళ్యాణ్ నిర్మించరు. కథ నచ్చడమే సినిమా సక్సెస్‌లో ఓ మెట్టు ఎక్కినట్టు భావిస్తున్నా. గతంలో నన్ను యాంగ్రీ యంగ్‌మ్యాన్ అనేవారు. వయసు పెరిగాక ఆ పేరు ఎలా మారుతుందో అనుకునేవాడిని. ఈ చిత్రంతో ప్రశాంత్ నన్ను యాంగ్రీ స్టార్‌గా మార్చారు. ఈ లోకంలో పని దొరకడం చాలా కష్టం. నాకు పని కల్పించిన దర్శక, నిర్మాతలకి థ్యాంక్స్. అందుకే పుట్టిన రోజు కూడా షూటింగ్‌లో పాల్గొంటాను. జీవితం చాలా తక్కువ రోజులు. అందరితో మంచిగా ఉంటూ, సంతోషంగా జీవితాన్ని ముందుకు సాగించాలి' అని అన్నారు.
'లైట్లు కొనడానికి నా దగ్గర డబ్బులు లేని సమయంలో రాజశేఖర్ దంపతులు ఓ తమిళ సినిమా రీమేక్ హక్కులు కొని నన్ను నిర్మాతని చేశారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సాగే చిత్రమిది. 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. ఇంకా 30 శాతం షూటింగ్ బ్యాలెన్స్ ఉంది. ఏప్రిల్‌లో షూటింగ్ కంప్లీట్ చేసి, మంచి టైమ్ చూసి విడుదల తేదీని ప్రకటిస్తాం' అని నిర్మాత సి.కళ్యాణ్ తెలిపారు.
చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ చెబుతూ, 'రాజశేఖర్ పుట్టిన రోజు కానుకగా ఆయనకి యాంగ్రీ స్టార్ అనే పేరును ఇచ్చాం. 'కల్కి'కి కొనసాగింపుగా 'కల్కి2' కూడా ఉంటుంది' అని చెప్పారు. 'మళ్ళీ విజయాన్ని సాధిస్తామా లేదా అనుకున్న రోజులు మా జీవితంలో ఉన్నాయి. అలాంటి సమయంలో 'గరుడవేగ'తో ప్రవీణ్ సత్తారు మ్యాజిక్ చేశారు. కథ సిద్ధం చేశాక ప్రశాంత్ దర్శకత్వం వహించడానికి ఒప్పుకోవడంతో తొలి విజయంగా భావించాం. అప్పుడే కళ్యాణ్ అన్నయ్య సినిమా చేస్తానని ముందుకు రావడం హ్యాపీగా అనిపించింది' అని జీవిత తెలిపారు.

నవచిత్రం

జోడీగా కేథరిన్ కూడా..


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతుంది. కె.ఎస్.రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్ పతాకంపై కె.ఎ.వల్లభ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రాశిఖన్నా, ఐశ్వర్య రాజేష్, ఇజబెల్లా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా మరో హీరోయిన్‌గా కేథరిన్ థ్రెస్సాని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా సినిమాని తెరకెక్కిస్తున్నాం. గతేడాది దసరాకి సినిమాని ప్రారంభించాం. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇందులో నాలుగో కథానాయికగా కేథరిన్‌ని ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. ఇప్పటికే ఆమె చిత్రీకరణలో పాల్గొంటోంది. సినిమాకి గోపీసుందర్ సంగీతం అందిస్తున్నారు. జే.కె సినిమాటోగ్రఫీగా పనిచేస్తున్నారు' అని అన్నారు.

విజయ్‌దేవరకొండకి ఫోర్బ్స్‌లో స్థానం

'అర్జున్‌రెడ్డి', 'గీత గోవిందం', 'టాక్సీవాలా' విజయాలతో స్టార్ హీరోల జాబితాలో చేరిన విజయ్ దేవర కొండ ఇప్పుడు మరో అరుదైన ఘనత సాధించాడు. ప్రతిష్టాత్మకంగా భావించే ఫోర్బ్స్ ఇండియా '30 అండ్ 30'లో స్థానం సంపాదించాడు. భారత్‌లో 30 ఏండ్ల కన్న తక్కువ వయసుకు చెంది, తమ రంగాల్లో అద్భుత ప్రతిభని కనబర్చిన వారి జాబితాని ఫోర్బ్స్ సోమవారం ప్రకటించింది.


కేథరిన్ థ్రెస్సా

బాలుకు మాతృ వియోగం


ఎస్పీ బాలసుబ్రమణ్యం

నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి శకుంతలమ్మ (89) కన్నుమూశారు. చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం నెల్లూరులోని తమ నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం బాలు లండన్ వెళ్ళారు. తల్లి మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన ఇండియాకి బయలుదేరారు. శకుంతలమ్మకు ఇద్దరు కుమారులు, ఐదుగురు అమ్మాయిలున్నారు. వారిలో ఎస్పీ బాలు, ఎస్పీ శైలజ నేపథ్యగాయనీగాయకులుగా రాణిస్తున్న విషయం విదితమే. శకుంతలమ్మ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

అంచనాలు పెరుగుతున్నాయ్


మమ్ముట్టి

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా మహి. వి రాఘవ్ దర్శకత్వంలో 'యాత్ర' చిత్రం తెరకెక్కింది. వైఎస్‌గా మమ్ముట్టి నటించిన ఈ చిత్రాన్ని 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శశిదేవి రెడ్డి, విజయ్ చిల్లా సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ చిత్ర తొలి టికెట్ భారీ రేటుకు అమ్ముడుపోయింది.
ఆ విశేషాలని నిర్మాతలు తెలియజేస్తూ, 'ఇటీవల ప్రీ రిలీజ్ వేడుక గ్రాండ్ సక్సెస్ కావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఓవర్సీస్‌లోనూ భారీ క్రేజ్ నెలకొంది. ఈ చిత్ర ప్రీమియర్ ఫస్ట్ టికెట్‌ని వేలం వేశాం. వైఎస్ఆర్ అభిమాని మునీశ్వర్‌రెడ్డి 4 లక్షల 37 (6,116 డాలర్లు) వేల రూపాయలకి మొదటి టికెట్‌ని దక్కించుకున్నారు. అయితే 12 డాలర్ల విలువ చేసే టికెట్‌ని అతనికి అందించి, మిగతా డబ్బులని వైఎస్సార్ ఫౌండేషన్‌కి విరాళంగా ఇస్తాం. ఈ డబ్బు రాజన్న క్యాంటీన్స్, వాటర్ ప్లాంట్స్ కోసం వినియోగిస్తారు. మా బ్యానర్‌లో గతంలో 'భలే మంచి రోజు', 'ఆనందో బ్రహ్మ' వంటి సూపర్ హిట్ చిత్రాలొచ్చాయి. ఇప్పుడు 'యాత్ర' హ్యాట్రిక్ చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో ఉన్నాం. వైఎస్ చేపట్టిన పాదయాత్ర ప్రధానంగా సినిమా సాగుతుంది. ఆయన పోరాట పటిమ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. అలాంటి ప్రజ్ఞాశాలి జరిపిన పాదయాత్రలో జరిగిన వాస్తవిక, భావోద్వేగ సంఘటనలతో ఈ సినిమా ఉంటుంది. అందరూ చూడాల్సిన చిత్రమిది' అని అన్నారు.

అర్జున్ సురవరంగా వస్తున్న నిఖిల్



నిఖిల్

నిఖిల్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'అర్జున్ సురవరం'. ముందుగా ఈ చిత్రానికి 'ముద్ర' టైటిల్‌ని ఖరారు చేశారు. తాజాగా దీన్ని 'అర్జున్ సురవరం'గా మార్చారు. టి.ఎన్ సంతోష్ దర్శకత్వంలో బి.మధు సమర్పణలో ఔరా సినిమాస్ పీవీటీ, మూవీ డైనమిక్స్ ఎల్ఎల్‌పీ పతాకాలపై కావ్య వేణుగోపాల్, రాజ్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కొత్త టైటిల్ లోగోకి మంచి స్పందన లభిస్తుంది. ఇటీవల యూరప్‌లో చివరి పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి 29న సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇందులో నిఖిల్ జర్నలిస్ట్‌గా నటిస్తున్నారు. ఆయన పాత్ర ఆకట్టుకుంటుంది' అని చిత్ర బృందం తెలిపింది. వెన్నెలకిషోర్, పోసాని, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్యామ్ సిఎస్, కెమెరా: సూర్య, ఆర్ట్: సాహి సురేష్.

మిత్రుడే కాదు.. శత్రువు కూడా ముఖ్యమే


సాయికృష్ణ పెండ్యాల

"మనిషి బతకడానికి మిత్రుడు ఎంత ముఖ్యమో, శత్రువు కూడా అంతే ముఖ్యం' అనే డైలాగ్ నచ్చి 'సీమరాజు' చిత్రాన్ని తీసుకున్నాను' అని అంటున్నారు నిర్మాత సాయికృష్ణ పెండ్యాల. శివ కార్తికేయన్, సమంత, కీర్తిసురేష్ హీరోహీరోయిన్లుగా పొన్రామ్ దర్శకత్వంలో తమిళంలో రూపొంది ఘన విజయం సాధించిన చిత్రం 'సీమరాజ'. ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో నిర్మాత సాయికృష్ణ పెండ్యాల్య విడుదల చేస్తున్నారు. ఈ నెల 8న సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్మాత మీడియాతో మాట్లాడుతూ, 'ఓ మిత్రుడు ఈ సినిమాకి సంబంధించి 'మనిషి బతకడానికి మిత్రుడు ఎంత ముఖ్యమో, శత్రువు కూడా అంతే ముఖ్యం' అనే డైలాగ్ సీన్‌ని పంపించారు. బాగా నచ్చి తెలుగు రిలీజ్ రైట్స్ తీసుకున్నా. ఒకేసారి తమిళంతోపాటు తెలుగులోనూ విడుదల చేయాలని భావించాం. కానీ అదే సమయంలో సమంత నటించిన రెండు సినిమాలు తెలుగులో రిలీజ్ అవుతుండటంతో ఆగాల్సి వచ్చింది. ఈ నెల 8న దాదాపు 300 నుంచి 400 థియేటర్లలో విడుదల చేయనున్నాం. అల్లరి చిల్లర తిరిగే ఓ రాజు ఓ సమస్యని ఛేధించే క్రమంలో, తన తాత పరిపాలన ప్రాధాన్యతని తెలియజేయడంతో అసలైన రాజుగా ఎలా మారాడు అనేది కథ. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇందులో రాజుగా శివకార్తికేయన్, మెయిన్ హీరోయిన్‌గా సమంత నటించారు. కీర్తిసురేష్ పాత్ర 30 నిమిషాల పాటు ఉంటుంది. సిమ్రాన్ నెగటివ్ రోల్ చేశారు. 'మీరు పంచెకట్టుకున్న మగాళ్ళు, నేను చీర కట్టుకున్న మగాడిని' అని సిమ్రాన్ చెప్పే సంభాషణలు అందరినీ ఆకట్టుకుంటాయి. సినిమాలో ఆరు పాటలున్నాయి. 'వన్నెలాడి..' పాటకి విడుదల చేసిన కొద్ది సేపట్లోనే మిలియన్ వ్యూస్ వచ్చాయి. సోమవారం విడుదల చేసిన ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. తెలుగు నేటివిటికి తగ్గట్టుగా డబ్బింగ్ చేయించాం. దీంతో ఆడియెన్‌కి స్ట్రయిట్ తెలుగు సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. తమిళంలో మూడు గంటలకుపైగా ఉంది. దాదాపు 40 నిమిషాలు ట్రిమ్ చేశాం. అన్ని ఏరియాల్లో బిజినెస్ అయ్యింది. సినిమాలోని బలమైన కంటెంట్ అందరికి నచ్చుతుంది. ఎప్పటికైనా స్ట్రయిట్ సినిమా చేయాలనుంది. ఆ అనుభవం కోసమే ఈ డబ్బింగ్ చిత్రాలు చేస్తున్నాను' అని చెప్పారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే విద్యార్థి నాయకుడు


అక్షిత, మనీష్‌బాబు, హసీన మస్తాన్ మీర్జా

మనీష్‌బాబు, అక్షిత, హసీన మస్తాన్ మీర్జా హీరోహీరోయిన్లుగా రాజా వన్నెంరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. జనం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై పి.సత్యారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం సోమవారం జరిగింది. అతిథులుగా విచ్చేసిన నిర్మాతలు బెల్లంకొండ సురేష్. సి.కళ్యాణ్, ప్రసన్నకుమార్, దాసరి కిరణ్ సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ, 'సత్యారెడ్డి ఆప్తమిత్రుడు. తన కుమారుడిని హీరోగా పరిచయం చేస్తూ 'ప్రశ్నిస్తా' సినిమాని రూపొందించారు. అంతా ప్రశ్నించేలా సూపర్ హిట్ కొట్టాలి. చిత్రబృందానికి అభినందనలు' అని అన్నారు.
'మనీష్ చైల్డ్ ఆర్టిస్టు. 'రాజకుమారుడు' టైమ్‌లో మహేష్‌బాబు ఎలా ఉన్నాడో, ఇప్పుడు మనీష్ అలా కనిపిస్తున్నారు. ఓ ఫంక్షన్‌లో చూసినప్పుడు మనీష్ ఆరడుగులు ఉన్నాడు, హీరోగా చేయమని సత్యారెడ్డికి చెప్పా. అన్నట్టుగానే హీరోని చేశాడు. సినిమాకి ఎంత ఖర్చు పెడుతున్నామన్నది ముఖ్యం కాదు, కంటెంట్ ముఖ్యం. సినిమాకి బెస్ట్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. సినిమా బాగా ఆడాలి. మనీష్‌కి మంచి అవకాశాలు రావాలి' అని మరో నిర్మాత సి.కళ్యాణ్ తెలిపారు.
చిత్ర నిర్మాత పి.సత్యారెడ్డి చెబుతూ,'సి.కళ్యాణ్ అన్న మాట నిజమైంది. రాజా వన్నెంరెడ్డి మా అబ్బాయిని హీరోని చేస్తానని 'క్షేమంగా వెళ్ళి లాభంగా రండి' సక్సెస్ టైమ్‌లో మాటిచ్చారు. అన్నట్టే అద్భుతంగా సినిమాని తెరకెక్కించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రభుత్వ పాలసీలను ఓ విద్యార్థి నాయకుడు ఎలా ప్రశ్నించాడనే ఇతివృత్తంతో సినిమాని రూపొందిస్తున్నాం' అని తెలిపారు. 'మా చిత్రానికి దాసరి నారాయణరావు ఆశిస్సులుంటాయని భావిస్తున్నా. గ్రాస్పింగ్ పవర్‌లో సూపర్ స్టార్ కృష్ణ తర్వాత మనీష్‌లో ఉంది. ఫ్యామిలీ ఎమోషన్స్,సెంటిమెంట్ ఉన్న డిఫరెంట్ చిత్రమిది. ట్రెండ్‌కి తగ్గట్టు ఉంటుంది' అని దర్శకుడు రాజా వన్నెంరెడ్డి తెలిపారు. 'సినిమాపై పాజిటివ్ టాక్ పెరుగుతుంది. సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికి థ్యాంక్స్' అని హీరో మనీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కథానాయికలు అక్షిత, హసీన, నిర్మాత ప్రసన్నకుమార్, దాసరి కిరణ్, సంగీత దర్శకుడు వెంగి, రైటర్ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెడ్డీ గ్యాంగ్ ఏం చేసింది?


రమేష్ చౌదరి, మల్లికార్జునరావు, శివాజీరాజా, విక్కీరాజ్

కనగాల రమేష్ చౌదరి దర్శకత్వంలో రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మిస్తున్న చిత్రం 'చెడ్డీగ్యాంగ్'. శ్రీనివాసరెడ్డి ముఖ్య పాత్రధారిగా, అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి, సి.టి, ఖాదర్, లక్ష్మి, శృతి, కావ్య, దేవి, వీణ, జాస్మిన్ కీలక పాత్రధారులుగా రూపొందుతున్న ఈ చిత్ర టీజర్ విడుదలైంది. అతిథిగా విచ్చేసిన 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా మాట్లాడుతూ, 'టైటిల్ బాగుంది. తెలుగు నటీనటులు ఉంటే డబ్బింగ్ చిత్రమనే భావన వచ్చేది కాదు. నటీనటులు ప్రచారానికి వస్తే దర్శక, నిర్మాతలకి హెల్ప్ అవుతుంది. ప్రతీ సినిమా హిట్ కావాలని కోరుకోవడంలోనే పాజిటివ్ థింకింగ్ ఉంటుంది. ఈ సినిమా విజయం సాధించాలి' అని అన్నారు. 'ఈ చిత్రంతో దర్శకుడిగా మారాను. పది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకి టూర్ వెళ్లారు. అక్కడి కోయవారి నిబంధనలని అతిక్రమించి ఇరుక్కుపోతారు. దాన్నుంచి వాళ్ళు ఎలా బయటపడ్డారనేది కథ. 125 రోజుల్లో పూర్తి చేశాం. సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఇలాంటి చిన్న చిత్రాలని ఆదరిస్తే మరిన్ని మంచి చిత్రాలొస్తాయి' అని చిత్ర దర్శకుడు రమేష్ చౌదరి తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ, 'సినిమా ఔట్‌పుట్ చాలా బాగా వచ్చింది. కేరళలోని ఎర్నాకుళం, ఇరిట్టి అడవులు, సారథి స్టూడియో, ఆర్ఎఫ్‌సీ, మలేషియాలో ఈ సినిమాని తెరకెక్కించాం. మలేషియాలో తెరకెక్కించిన సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయి. బాలీవుడ్ నటి స్నేహా కపూర్ చేసిన ఐటమ్ సాంగ్ ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మాలయ మల్లికార్జునరావు, ఎం.ఎస్.రెడ్డి, గీత రచయిత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకు థ్యాంక్స్


రసజ్ఞ దీపిక, శివ కంఠంనేని, రావుల వెంకటేశ్వరావు, శ్రీపాద విశ్వక్

శివ కంఠంనేని ప్రధాన పాత్రలో రామ్ కార్తీక్, శివ హరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక హీరోహీరోయిన్లుగా శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. ఇటీవల విడుదలైన సినిమాకి మంచి స్పందన లభిస్తోన్న నేపథ్యంలో ఇటీవల సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివ కంఠంనేని మాట్లాడుతూ, 'సినిమాకి అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. రివ్యూస్ కూడా పాజిటివ్‌గా వచ్చాయి. చిన్న సినిమా, పెద్ద సినిమా అనేది కాదు, బాగున్న సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మొదటి రెండు రోజుల కలెక్షన్లు సాధారణంగా ఉన్నా, మౌత్ టాక్‌తో ఆదివారం నుంచి కలెక్షన్లు పెరిగాయి. 'భారతీయుడు', 'అపరిచితుడు' చిత్రాల కోవలో అండర్ కరెంట్‌గా డ్రంకన్ డ్రైవ్ పై సందేశం ఉంటుంది. అయినప్పటికీ ఇది పూర్తి కమర్షియల్ చిత్రం. థియేటర్ల పరంగా నిర్మాత సి.కళ్యాణ్ ఎంతో హెల్ప్ చేశారు. ఆయనకి థ్యాంక్స్. సినిమాని ఆదరిస్తున్న ఆడియెన్స్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు' అని అన్నారు. 'కొత్త దనానికి పట్టం కడుతున్న నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా తీసిన చిత్రమిది. చివరి వరకూ సస్పెన్స్‌గా కొనసాగుతూ ప్రేక్షకులకు థ్రిల్ కలిగిస్తోంది' అని దర్శకుడు తెలిపారు. నిర్మాత రావుల వెంకటేశ్వరరావు చెబుతూ, 'మా బ్యానర్‌లో చేసిన తొలి ప్రయత్నమిది. సినిమా ప్రారంభం నుంచి చివరి సన్నివేశం వరకు ఉత్కంఠగా సాగుతూ ప్రేక్షకులను కూర్చో పెట్టడమే మా సక్సెస్' అని చెప్పారు.

ఉమెన్ ఆఫ్ రిథమ్ అద్భుతం

మహిళా వాయిద్యకారుల ప్రతిభని గుర్తించి, గౌరవించడానికి 'ఉమెన్ ఆఫ్ రిథమ్' ప్రపంచంలోనే మొట్టమొదటి కాన్సర్ట్ సిరీస్‌ని నిర్వహిస్తోంది. ఈ సీజన్ 4 కాన్సర్ట్ పోస్టర్‌ని ఎంపీ కవిత ఇటీవల విడుదల చేశారు. 'భారతదేశంలోని పురుషాధిక్య పెర్క్యూషన్ పరిశ్రమలో ఈ సంస్థ ఓ విప్లవాత్మక మార్పుని తీసుకొచ్చింది. అద్భుతమైన మహిళా కళాకారులను హైదరాబాద్‌కి తీసుకొచ్చి నందుకు ఈ బృందాన్ని అభినందిస్తున్నా' అని కవిత అన్నారు. 'మహిళా సాధికారత కోసం పాటుపడుతూ కళలు, సంప్రదాయాలను ప్రోత్సహించే కవిత ఈ పోస్టర్‌ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. 'ఉమెన్ ఆఫ్ రిథమ్' మొదటి మూడు సీజన్స్‌లో భారతదేశంలోని ప్రముఖ మహిళా పెర్క్యూసన్ వాయిద్యకారులలో 20 మంది వివిధ కచేరీలలో తమ ప్రతిభని ప్రదర్శించారు. మార్చి 10 సాయంత్రం 7గంటల నుంచి సీసీఆర్‌టీ అంఫీ థియేటర్, మాధాపూర్‌లో జరగబోయే 4వ ఎడిషన్‌లో అత్యుత్తమ మహిళా సంగీత కారులను చూస్తారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచే మహిళా సంగీతకారులను సత్కరించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మించిన సందర్భం లేదు' అని ఈ 'ఉమెన్ ఆఫ్ రిథమ్' సీజన్ 4ని నిర్వహిస్తున్న ఎలెవెన్ పాయింట్ టూ సంస్థ నిర్వహకులు తెలిపారు. హైదరాబాద్‌కి చెందిన మొటివిటీ ల్యాబ్స్‌తో కలిసి ఎలెవన్ పాయింట్ టూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.


'ఉమెన్ ఆఫ్ రిథమ్' సీజన్ 4 కాన్సర్ట్ పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం


మల్లేశం ఫస్ట్‌లుక్


ప్రియదర్శి, అనన్య

పద్మ శ్రీ చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'మల్లేశం'. మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటిస్తున్నారు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ ఇటీవల విడుదలైంది.
సినిమా గురించి చిత్ర యూనిట్ తెలియజేస్తూ, 'అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరలని కూడా నేసి ప్రపంచాన్ని అబ్బుర పరచిన వ్యక్తి మల్లేశం. తను సాధించిన విజయాలతో చేనేత ప్రాముఖ్యతని దేశ వ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత మల్లేశం సొంతం. అలాంటి గొప్ప వ్యక్తి జీవితం ఆధారంగా సినిమా తెరకెక్కించడం హ్యాపీగా ఉంది. చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సిరిసిల్ల జిల్లాలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి విశేష స్పందన లభిస్తుంది. పలు చిత్రాలతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న సౌండ్ డిజైనర్ నితిన్ లుకోస్ ఈ సినిమాకి సౌండ్ డిజైనర్‌గా పనిచేయడం విశేషం' అని అన్నారు. ఈ సినిమాకి సంగీతం : మార్క్ కె రాబిన్, కెమెరా: బాబు శాడిలాస్య, ఆర్ట్: లక్ష్మణ్ ఆలే.

నా జీవితానికి దీపికే వెలుగు..

'నా లైఫ్‌లో నేను కనిపెట్టిన అద్భుతమైన వ్యక్తి దీపిక. దీపికలో ప్రేమ, జాలి, దయ, తెలివి, అందం, సేవాతత్వం కలగలిపి ఓ విశ్వమే ఉంది. ఈ గుణాలే ఆమె ప్రపంచంలోనే నిజాయితీ గల అత్యుత్తమ నటిని చేశాయి. ఆమె క్రమశిక్షణ, కమిట్‌మెంట్ అసమానమైనది. ఆమె పాత్ బ్రేకింగ్ ఎచీవ్‌మెంట్ చాలా విషయాలను మార్చేస్తుంటాయి. నేనొక ఉత్తమమైన వ్యక్తిగా మారడానికి ఆమె ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆమె నా జీవితాన్ని విలువైనదిగా మార్చింది. నా జీవితానికి వెలుగునిచ్చింది' అంటూ దీపిక బర్త్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్స్ వెబ్‌సైట్‌లో రణ్‌వీర్ సింగ్ తన భార్యను పొగడ్తలతో ముంచెత్తాడు.


దీపికా పదుకొనె,రణ్‌వీర్ సింగ్

'ఏకీకృతం'కు లైన్‌క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

సవరణ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సవరణ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు విచారించి రాష్ట్రపతి ఇచ్చిన సవరణ ఉత్తర్వులపై స్టేటస్ కో విధించింది. 2018, ఆగస్టు మొదటివారంలో విచారణ చేపట్టింది. సుదీర్ఘ వాదోపవాదాల అనంతరం తీర్పును రిజర్వు చేసి ఆగస్టు 28న రాష్ట్రపతి ఉత్తర్వులు చెల్లవంటూ తీర్పు వెల్లడించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2018లో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) వేసింది. ఆ పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు విచారించింది. ఏకీకృత సర్వీసు నిబంధనలు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చేనెల 25వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలు చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెడ్మాస్టర్, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్లు, బీఈడీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు లభించనున్న విషయం తెలిసిందే. ఏకీకృత సర్వీసు నిబంధనలు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడం లేదనీ, ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలనీ కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (జీటీఏ) కోర్టు ధిక్కరణ కింద మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 9న ఆ పిటిషన్ విచారణకు రానుంది. సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. సుప్రీం మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశముంది. అప్పటి వరకు ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం లేదని అధికార వర్గాలు చెప్తున్నాయి. అయితే పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టే అవకాశముంది. ఏకీకృత సర్వీసు నిబంధనలు అమల్లోకి రావడంతో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు వస్తాయి. దీంతో ఉపాధ్యాయుల సీనియార్టీ వివరాలను సేకరించే పనిలో విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈనెల 9న హైకోర్టు నుంచి అనుమతి పొందిన ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే అవకాశముంది. ఆ తర్వాతే ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కానుంది. ఇప్పటికే అధికారులు సమాలోచన మొదలుపెట్టారు. సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు చేస్తున్నట్టు సమాచారం.

పదోన్నతులకు చర్యలు చేపట్టాలి : యూఎస్‌పీసీ

ఏకీకృత సర్వీసు నిబంధనలపై సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల పట్ల తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) హర్షం ప్రకటించింది. ఈ మేరకు యూఎస్‌పీసీ ప్రతినిధులు సిహెచ్ రాములు, చావ రవి, మైస శ్రీనివాసులు, టి లింగారెడ్డి, షౌకత్ అలీ, పోచయ్య, కొమ్ము రమేష్, ఎస్ మధుసూదన్‌రావు, జాడి రాజన్న, సుభాష్, మసూద్ అహ్మద్, హరికృష్ణ, కుర్సం రామారావు, బి కొండయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలు రూపొందించి సహజ న్యాయం, సమాన న్యాయం ప్రాతిపదికన అర్హులైన వారందరికీ పదోన్నతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఈవో, డిప్యూటీఈవో, శిక్షణ కళాశాలల్లోని అధ్యాపకుల ఖాళీలను పదోన్నతులద్వారా భర్తీచేయాలనికోరారు. విద్యారంగంలో నెలకొన్న సంక్షోభానికి ముగింపు పలకాలని సూచించారు.

సత్వరం పదోన్నతులివ్వాలి : ఎస్టీయూ

సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఉపాధ్యాయులకు సత్వరమే పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు బి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి సర్వీసు రూల్స్‌ను రూపొందించి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి : పీఆర్టీయూ

ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీలు కె జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే విధించడంతో పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించుకోవడానికి వీలు ఏర్పడిందని పేర్కొన్నారు.

తక్షణం పదోన్నతులివ్వాలి : డీటీఎఫ్

ఉమ్మడి సర్వీసు నిబంధనలపై హైకోర్టు తీర్పును సుప్రీం నిలుపుదల చేసినందున తక్షణమే ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వాలని డీటీఎఫ్ అధ్యక్షులు ఎం రఘుశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

పీఆర్టీయూ తెలంగాణ హర్షం

ఏకీకృత సర్వీసు నిబంధనలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేస్తూ సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సర్వీసు నిబంధనలు రూపొందించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి : టీఎస్టీయూ

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను చేపట్టాలని టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సుప్రీం ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం : టీటీయూ

ఏకీకృత సర్వీసు నిబంధనలు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని టీటీయూ అధ్యక్షులు ఎం మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని న్యాయపరమైన సమస్యలకు తావివ్వకుండా వెంటనే అన్ని క్యాడర్లలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

సుప్రీంను మళ్లీ ఆశ్రయిస్తాం : జీటీఏ

ఏకీకృత సర్వీసు నిబంధనలు చెల్లవని హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేస్తూ సుప్రీం ఇచ్చిన తీర్పుపై మరోసారి విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టును మళ్లీ ఆశ్రయిస్తామని జీటీఏ ప్రధాన కార్యదర్శి ఎం వీరాచారి ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 25వ తేదీకి వాయిదా వేయడం వల్ల ఇప్పుడే పదోన్నతులు చేపట్టే అవకాశం లేదని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది ధాన్యం కొనుగోలుకు శిక్షణా తరగతులు

- పౌరసరఫరాల శాఖ యాక్షన్ ప్లాన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే ఏడాదిలో ధాన్యం కొనుగోలుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకునేలా పౌరసరఫరాల శాఖ ఉద్యోగులకు శిక్షణా తరగతులను నిర్వహించింది. కేంద్ర కార్యాలయంలో పనిచేసే అధికారులతో పాటు జిల్లా స్థాయిలో పనిచేసే డీసీఎస్ఓ, ఏసీఎస్ఓ, జిల్లా మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లకు సోమవారం నాడు ఎంసీఆర్ఐహెచ్ఆర్‌డీలో ఒక రోజు శిక్షణా తరగతులను నిర్వహించింది. ఈ తరగతులను పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ ప్రారంభించారు. నిర్ణీత కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలంటే శాఖను పునరుత్తేజితం చేయాల్సిన అవసరం ఉందని, దానికి అనుగుణంగా అధికారులకు పునశ్చరణ, శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ అన్నారు. ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులతో పాటు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు వంటి రైతు సంక్షేమ చర్యలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి ఏటేటా ధాన్యం దిగుబడి పెరుగుతున్నది. రానున్న రబీ, ఖరీఫ్ సీజన్‌లో శాఖ రైతుల నుండి భారీగా ధాన్యం కొనుగోలు చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. దీన్ని ద ష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన చర్యలపై అధికారులు ఇప్పటి నుంచే దష్టి సారించి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

గత ఏడాది ఖరీఫ్, రబీ రెండూ సీజన్‌లో కలిపి 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఒక ఖరీఫ్‌లోనే ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సష్టించింది. పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు ప్రణాళికలను రూపొందించుకుని, రైతులకు కనీస మద్దతు ధర అందించడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించే పనిలో ఆ శాఖ నిమగ్నమైంది. ఇందులో భాగంగా బిజినెస్ విభాగాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నది. అలాగే ప్రజాపంపిణీలో అక్రమాలను నిరోధించి, అర్హులకే నిత్యావసర సరుకులు అందేలా ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానంతో అనేక చర్యలు చేపట్టింది. వీటిని మరింత పటిష్ట, విస్తతపరిచే దిశగా ముందుకు సాగుతున్నది. ధాన్య సేకరణ, సీఎంఆర్, గోదాముల్లో బియ్యం నాణ్యత, ధాన్య సేకరణలో గన్నీ సంచుల వినియోగం, ఆర్థికంగా రాష్ట్రంపై భారం పడకుండా నిర్దేశిత సమయంలో రేషన్ బియ్యం రవాణా, పంపిణీపై, ఇతర ఆర్థికపరమైన అంశాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ విభాగం నిఘాపై, సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా ప్రవేశపెట్టిన విధానాలు, ధాన్యం చెల్లింపులకు సంబంధించి ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ వంటి అంశాలపై అధికారులకు ఒకరోజు శిక్షణ ఇచ్చామని అధికారులు తెలిపారు.

దళిత ప్రొఫెసర్‌పై హిందూత్వ శక్తుల దాడి

(మొదటిపేజీ తరువాయి)

పరిషత్ (ఏబీవీపీ)కి చెందిన కొందరు కార్యకర్తలు, బయటి వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి కొట్టారని, అనంతరం ఆయనకు బూట్ల దండ వేసి యూనివర్సిటీ కాంపస్‌లో ఊరేగించారని తెలుస్తోంది. ఘటన జరిగిన కొద్ది రోజుల తరువాత ఇందుకు సంబంధించిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావటంతో ఈ ఘటన వెలుగు చూసింది. ఈ ప్రొఫెసర్ దళిత వర్గానికి చెందిన వాడైనందునే ఆయన్ను టార్గెట్ చేసినట్టు ఊహాగానాలు వ్యాపించాయి. మరో విభాగాధిపతి అరవింద్‌కుమార్ జోషి ఒక విద్యార్థినితో గోవా బీచ్‌లో విహరిస్తున్న దృశ్యాలను చిత్రీకరించిన మనోజ్ కుమార్ వర్మ వాటిని తన ఫేస్‌బుక్ ఖాతాలో అభ్యంతరకర వ్యాఖ్యలతో పోస్ట్ చేశారని ఒక విద్యార్థి తనను కలిసిన మీడియా ప్రతినిధులకు చెప్పారు.

ఒక వేళ ఆయన అలాంటి అభ్యంతరకరమైన పోస్టులు చేసి వుంటే వాటిపై శాఖాపరమైన విచారణ జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి తప్ప, ఆయన్ను నిర్దాక్షిణ్యంగా కొట్టటం దారుణమని ఆ విద్యార్థి వ్యాఖ్యానించాడు. వర్మ అగ్రకులానికి చెందిన వాడైతే ఆయనపై దాడి చేయటానికి ఏ ఒక్కరూ ధైర్యం చేసే వారు కాదన్నాడు. అరవింద్ కుమార్ జోషి తన డిపార్ట్‌మెంట్‌ను తన సొంత పద్ధతిలో నడుపుతుండటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేశానని, దీనితో అతడు తన విద్యార్థులతో తనను బెదిరించాడని వర్మ చెప్పారు. తన కులాన్ని టార్గెట్ చేయడం వల్లే తనపై దాడి చేశారని స్పష్టం చేశారు.

తగిన పరిహారం ఇవ్వాలి

- హైవే విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్నాం
- సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో రైతుల రాస్తారోకో
- వేములవాడలో రైల్వేలైన్ సర్వే అడ్డగింత



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

నవతెలంగాణ-వేములవాడ/వట్‌పల్లి

నేషనల్ హైవే నెంబర్ 161 విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న తమకు తగిన నష్టపరిహారం చెల్లించాలని సంగారెడ్డి జిల్లా రైతులు ఆందోళనకు దిగారు. సింగూరు జల సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం ఆధ్వర్యంలో అల్లాదుర్గం మండల కేంద్రంలోని అకోల-నాందేడ్ రహదారిపై సోమవారం బైటాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పెరిగిన మార్కెట్ ధరలకనుగుణంగా భూములకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. 179 సర్వే నెంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఇండ్లు, భూములు పోతున్నాయని వాపోయారు. ప్రభుత్వం చెల్లిస్తున్న నష్టపరిహారం ఇండ్లు కట్టుకునేందుకు కూడా సరిపోదన్నారు. ప్రభుత్వమే తమకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. అధికారులు తప్పుడు సర్వేలు నిర్వహించి తమను మోసగించారని ఆరోపించారు. అరకొర పరిహారం చెల్లించి చేతులు దులుపుకునేందుకు కుట్రపన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్ భూనిర్వాసితులకు చెల్లించిన విధంగా తమకూ పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలన్నారు. రైతుల రాస్తారోకోతో అరగంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై గౌస్ అక్కడికి చేరుకుని సముదాయించడంతో రాస్తారోకో విరమించారు.

రైల్వేలైనుతో తమ భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రైతులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో అధికారులు చేపట్టిన కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వేలైన్ సర్వేను వారు అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ.. పాత అలాట్‌మెంట్ కాకుండా కొత్తగా చేపట్టిన సర్వేతో తమ భూములు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. భూములను రైల్వే లైన్‌కు ఇవ్వబోమని తేల్చిచెప్పారు. పాత అలాట్‌మెంట్ ద్వారానే రైల్వే లైన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. వేములవాడ అర్బన్ తహసీల్దార్ నక్క శ్రీనివాస్ అక్కడికి చేరుకుని సర్వేకు సహకరించాలని కోరినా రైతులు ససేమీరా అనడంతో సర్వేను నిలిపివేశారు.

అమిత్ 'షాక్'

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ శ్రేణులు నినాదాల హోరు పుట్టించాయి. అక్కడి ఎమ్మెల్యే శివాజీ, పలువురు టీడీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ నుంచి విజయనగరంలో అడుగుపెట్టిన అమిత్‌షాకి అనుకోని కష్టం ఎదురైంది. ఆయన సభలో జనాలు లేక సభ వెలవెల బోయింది. కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. దీంతో షా వేదిక పైకి వెళ్లలేదు. వాస్తవానికి యాత్ర ప్రారంభించాక.. భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. జనాలు ఎవరూ లేకపోవడంతో బస్సు పై నుంచే అమిత్‌షా మాట్లాడారు. ప్రత్యేకహోదాకు బదులుగా ఒకటిన్నర రెట్లు నిధులతో ప్యాకేజీ ఇస్తామంటే ఒప్పుకున్నది సీఎం చంద్రబాబేనని అమిత్‌షా అన్నారు. సోమవారం విజయనగరంలోని మెసానిక్ టెంపుల్ ఆవరణంలో బీజేపీ ఉత్తరాంధ్ర శక్తి కేంద్రాల నాయకుల సమావేశంలోనూ, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ రైల్వేగ్రౌండ్‌లో బీజేపీ చేపట్టిన సత్యమేవ జయతే ప్రజా చైతన్య యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ఆయన మాట్లాడారు. వైసీపీ, టీడీపీ కుటుంబ పార్టీలని, అవినీతిలో కూరుకుపోయాయని విమర్శించారు.

ఎక్కడ నుంచి దిగుదాం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్.. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తారనే వార్తల నేపథ్యంలో పలు ఎంపీ స్థానాలు తెరపైకి వస్తున్నాయి. తాజాగా ఆయన ఖమ్మం నుంచి పోటీ చేస్తారంటూ టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్ ఎంపీగా పోటీ చేయబోతున్నారంటూ గత కొద్ది నెలలుగా ప్రచారం జరుగుతున్నది. తొలుత మెదక్ నుంచి, ఆ తర్వాత నల్లగొండ నుంచి బరిలోకి దిగుతారంటూ వార్తలు వెలువడ్డాయి. తాజాగా ఈ రెండు స్థానాలు కాకుండా ఖమ్మం నుంచి పోటీకి దిగబోతున్నారనే చర్చ కొనసాగుతుండటం గమనార్హం.

ఆయన అక్కడి నుంచి పోటీకి దిగటానికి పలు కారణాలున్నాయని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో మిగతా అన్ని జిల్లాలతో పోలిస్తే ఖమ్మం.. టీఆర్ఎస్‌కు కొరకరాని కొయ్యగా మారింది. అక్కడ కేవలం ఒకే ఒక్క స్థానానికి ఆ పార్టీ పరిమితమైంది. దీనికి పార్టీలోని అంతర్గత సమస్యలే కారణమంటూ కేసీఆరే స్వయంగా ప్రకటించారు. ముఖ్యంగా ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్యనున్న విబేధాలే దీనికి కారణమని ఆయన పరోక్షంగా చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో పొంగులేటికి చెక్ పెట్టాలని టీఆర్ఎస్ అధినేత భావించారు. ఈ క్రమంలోనే ఆయన దృష్టి ఖమ్మంపై పడింది. అక్కడ పరిస్థితిని చక్కబెట్టేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగాలని సీఎం నిర్ణయించారు. ఎంపీగా పోటీ చేయటం ద్వారా అక్కడి అసంతృప్తులు, అసమ్మతులను సరి చేయొచ్చని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. ఎంపీ హోదాలో ఖమ్మంలో రెండు, మూడు నెలలకోసారి పర్యటించటం ద్వారా నిర్మాణపరంగా, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయొచ్చని కేసీఆర్ యోచిస్తున్నట్టు సమాచారం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు ఇటు పార్టీ బలోపేతం, అటు పొంగులేటికి చెక్ పెట్టటం రెండూ జరిగిపోతాయన్నది సీఎం ఆలోచనగా కనబడుతున్నది.

మరోవైపు శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో పార్టీ ఓడిపోవటాన్ని కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇందుకు కారణంగా భావిస్తున్న పొంగులేటిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారనే వార్తలు కూడా అప్పట్లో వినిపించాయి. ఆయన్ను బహిష్కరిస్తే.. వేరే పార్టీలోకి వెళ్లిపోతారు.. అదే పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేస్తారు.. ఆయన అనుచరులు, పార్టీ శ్రేణుల్లో కొంతమంది పొంగులేటికి మద్దతు పలుకుతారు. ఇది టీఆర్ఎస్‌కు ఇబ్బందికరం. అందువల్ల సస్పెండ్ చేయకుండా ఉండటమే మంచిదని టీఆర్ఎస్ బాస్ నిర్ణయించారు. ఇదే సమయంలో ఎంపీ సీటును పొంగులేటికి ఇవ్వకుండా పక్కనబెట్టి.. తానే స్వయంగా రంగంలోకి దిగితే అందర్నీ సెట్ చేయొచ్చన్నది కేసీఆర్ భావన. అందుకే ఇప్పుడు ఆయన ఖమ్మంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు సమాచారం.

బొప్పాయి.. కేజీ రూపాయి

(మొదటిపేజీ తరువాయి)

నష్టం వాటిల్లింది. తెగుళ్లు సోకడం, దీనికితోడు నాసిరకం విత్తనాలు కావడంతో పండ్లు ఎదగలేదు. దీంతో కొనడానికి మధ్యవర్తులు ఆసక్తి చూపకపోవడంతో ఎంతో కొంతకు గంప గుత్తగా రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఎకరాకు రూ.2లక్షల ఖర్చు


ఎకరాకు రూ.2లక్షల పెట్టుబడి అయితే, రూ.10వేలు కూడా చేతికి రాకపోడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట చేతికొచ్చే దశలో కురిసన తుఫాను పెద్ద నష్టమే చేకూర్చింది. ప్రధానంగా స్థానిక మార్కెట్ లేకపోవడం, పండ్లను నిల్వచేసేందుకు చల్లటి ప్రదేశాలు ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేకపోవడం కూడా రైతులు నష్టపోవడానికి కారణమే. పండ్లను హైదరాబాద్‌కు తరలించాల్సి వస్తుంది. ధర తగ్గడంతో రవాణా, కూలీ ఖర్చులు కూడా రావడం లేదని రైతులు పంటను వదిలేస్తున్నారు. కొందరేమో గంపగుత్తగా వచ్చినకాడికి మధ్యవర్తులకు అమ్ముకుంటున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డలో రైతు సురేందర్‌రెడ్డి నాలుగెకరాల బొప్పాయి పంట సాగు చేశాడు. రూ.8లక్షల పెట్టుబడి అయింది. మంచిగా పంట వస్తే దిగుబడి ఎకరాకు 80టన్నులు రావాలి. ఇలా మూడుసార్లు వస్తుంది. ఒక్కసారి కేజి రూ.30 ఉంటే రెండు లక్షల 40వేల ఆదాయం వస్తుంది. ఎకరాకు 2లక్షలు ఖర్చులకు పోగా 40వేలు మిగులుతాయి. కానీ ఈసారి కిలో రూపాయి మాత్రమే ఉండటంతో సురేందర్‌రెడ్డి పంటను తియ్యకుండానే వదిలిపెట్టాడు. ఇదే గ్రామంలో కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నాలుగెకరాల్లో, జైపాల్‌రెడ్డి నాలుగెకరాల్లో బొప్పాయి పంట సాగు చేశాడు. వీరికి రూ.20లక్షల నష్టం వచ్చినట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయ శాఖ వైఫల్యం

వాతావరణం అనుకూలించక పంట నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించాల్సిన వ్యవసాయ అధికారులు విఫలమయ్యారు. వనపర్తి జిల్లా పెద్దమందడిలో 12వందల ఎకరాల్లో బొప్పాయి తోట వేశారు. సరైన ధర లేదని 400 ఎకరాల తోటను జేసీబీ సాయంతో తొలగించారు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా మొత్తంగా నెలకొంది.

రూ. 8లక్షలు ఖర్చు చేశాను:
-సురేందర్‌రెడ్డి - నడిగడ్డ, తెలకపల్లి మండలం-
నాగర్‌కర్నూల్ జిల్లా



నాలుగెకరాల బొప్పాయి తోటకు రూ.8లక్షలు పెట్టుబడి పెట్టాను. కేజీ 40 రూపాయలుంటే మంచి లాభాలు వచ్చేవి. కానీ, రూపాయికి కిలో ఉండటం వల్ల పెట్టుబడి కూడా రావడం లేదు. బ్యాంకు నుంచి, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చిసాగు చేశాం. ప్రభుత్వం నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలి.

హరీశ్‌రావు రాజకీయ బ్లాక్‌మెయిలర్

- నన్ను జైల్లో పెట్టించింది ఆయనే...
- కేసీఆర్‌తో తనకు ఎలాంటి వైరుధ్యమూ లేదు
- జిల్లా అభివృద్ధి కోసం త్వరలోనే కేసీఆర్, కేటీఆర్‌లను కలుస్తా : ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు బ్లాక్ మెయిలర్ రాజకీయ నాయకుడని, ఆయన ఉనికి కోసమే తనను జైల్లో పెట్టించారని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తనకు ఎలాంటి వైరుధ్యం లేదని చెప్పారు. కేసీఆర్‌పై తానెప్పుడూ రాజకీయ విమర్శలే చేశానని, వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం త్వరలోనే కేసీఆర్, కేటీఆర్‌లను కలుస్తానని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. తనను జైల్లో పెట్టడానికి హరీశ్‌రావు ప్రధాన కారకుడని మండిపడ్డారు. తానేన్నడూ హరీశ్‌రావును నమ్మలేదని, ఆయన కంటే కేటీఆర్ బెటర్ అని చెన్నారు. గతంలో బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసి పొరపాటు చేసినట్టు తెలిపారు. 2004లో తాను టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచానన్నారు. కేసీఆర్ వల్ల తనకు రెండు లాభాలు జరిగాయని చెప్పారు. కేసీఆర్ పార్టీ పెట్టడంతో తాను ఎమ్మెల్యేగా గెలువడం, తనను కేసీఆర్ జైళ్లో పెట్టినప్పటికి నా కూతుర్ని రాజకీయ వారసురాలిగా ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్‌లో హేమా హేమీలున్నా తాను జైల్లో ఉన్నప్పుడు ఉత్తమ్, వీహెచ్ మినహా కాంగ్రెస్ నేతలెవరూ పరామర్శించడానికి రాలేదన్నారు.

ఈ విషయంలో తాను చాలా బాధ పడినట్టు చెప్పారు. 2008లో హరీశ్‌రావు కాంగ్రెస్ నేత కెవిపి రామ చంద్రరావు ద్వారా మంతనాలు జరిపిన మాట వాస్తవమేనన్నారు. హరీశ్ రావు పార్టీ మారితే ఆయన రాజకీయ జీవితం ముగిసినట్టేనన్నారు. తనను ప్రచార కమిటీలో సభ్యుడిగా నియమించినప్పటికి తనను చూసి ఓట్లు ఎవరు వేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో లాబీయిస్టులదే హవా నడుస్తోందన్నారు. ఇప్పుడు పదవులు వచ్చిన వారికి లాబీయింగ్ ద్వారానే వచ్చాయని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 7 లేదా 8 ఎంపీ సీట్లు గెలిచే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీహెచ్ఎంసీలో రాంకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

- ఈ నెల 19న జీహెచ్ఎంసీ ఎదుట ధర్నా: జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయివేటు ప్రాజెక్టు కింద చెత్త తరలింపు, ట్రాన్స్‌పోర్టు, సాలిడ్ వేస్ట్ పనులకు రాంకీ ఎన్విరో లిమిటెడ్ సంస్థతో జీహెచ్ఎంసీ చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దుచేయాలని జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ఈ నెల 19న జీహెచ్ఎంసీ ఎదుట భారీ ధర్నా చేస్తామని హెచ్చరించింది. జీహెచ్ఎంసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ ప్రతినిధులు పాలడుగు భాస్కర్, జె.వెంకటేశం, వివి.మంగపతి(సీఐటీయూ), ఏసురత్నం, జి.యాదయ్య(ఏఐటీయూసీ), రెబ్బా రామారావు, ఇ.వెంకటేష్(హెచ్ఎమ్ఎస్), కె.భరత్(ఏఐయుటీయూసీ), బాలు(టీఆర్ఎస్‌కేవీ) మాట్లాడారు. జీహెచ్ఎంసీలో20, 25 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. చెత్త సేకరణ ద్వారా ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.80 వసూలు చేస్తున్నారని, దీనికి అదనంగా రాంకీ సంస్థ కూడా ప్రతి ఇంటికీ పెనాల్టీ విధిస్తున్నదని వివరించారు. దీని వల్ల ప్రజలపై అదనపు భారం పడుతున్నదన్నారు. జీహెచ్ఎంసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విలువైన భూములను, యంత్రాలను రాంకీకి అప్పగించటం అంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటమే అన్నారు. రాంకీతో చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే జీహెచ్ఎంసీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 12 నలుంచి డిమాండ్ బ్యాడ్జీలు ధరించాలని, 16వ తేదీ వరకు జోనల్ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలపాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అప్పటికీ స్పందించకుంటే ఈ నెల 19న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు.

ఎనిమిది ఇంజినీరింగ్ కాలేజీలు మూత

విద్యార్థుల్లేక నడపలేని స్థితిలో యాజమాన్యాలు

- రేపటివరకు అనుబంధ గుర్తింపు దరఖాస్తు గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడనున్నాయి. ఇప్పటికే ఆయా కాలేజీ యాజమాన్యాలు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్)కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. 2019-20 విద్యాసంవత్సరంలో అనుబంధ గుర్తింపునకు దరఖాస్తు చేసేందుకు తుది గడువు మంగళవారం వరకు ఉంది. దీంతో ఎన్ని కాలేజీలు అనుబంధ గుర్తింపునకు దరఖాస్తు చేస్తాయో, ఎన్ని కాలేజీలు మూసివేతకు దరఖాస్తు చేస్తాయో మంగళవారం అర్ధరాత్రి స్పష్టత రానుంది. విద్యార్థులు చేరకపోవడమే కాలేజీల మూసివేతకు ప్రధాన కారణంగా ఉన్నది. విద్యార్థుల్లేకపోవడంతో నడపలేని స్థితిలో ఆయా కాలేజీ యాజమాన్యాలున్నాయి. దీంతో ఎనిమిది కాలేజీ యాజమాన్యాలు మూసివేతకు దరఖాస్తు చేసినట్టు ఉన్నతాధికారులు చెప్పారు. 2018-19 విద్యాసంవత్సరంలో 205 ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. ఇందులో 17 ప్రభుత్వ, 188 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. 205 కాలేజీల్లో 96,518 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరంలో 68,296 మంది విద్యార్థులు చేరారు. దీంతో 28,222 సీట్లు మిగిలాయి. రాష్ట్రంలో 2014-15 విద్యాసంవత్సరంలో 354 ఇంజినీరింగ్ కాలేజీలుంటే, 96,228 సీట్లు న్నాయి. అదే 2015-16 విద్యాసంవత్సరంలో 268 కాలేజీల్లో 1,15,912 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2016-17 విద్యాసంవత్సరంలో 220 ఇంజినీరింగ్ కాలేజీల్లో 1,04,758 సీట్లున్నాయి. ఇక 2017-18 విద్యాసంవత్సరంలో 212 కాలేజీల్లో 97,961 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇలా ఏటా ఇంజినీరింగ్ కాలేజీలు తగ్గడంతోపాటు సీట్లు సైతం తగ్గుతూ వచ్చాయి. 2014-15లో ఇంజినీరింగ్ కాలేజీలు 354 ఉంటే, 2018-19లో 205కు పడిపోయాయి. అంటే 149 ఇంజినీరింగ్ కాలేజీలు తగ్గాయి. ఇక 2015-16లో 1,15,912 సీట్లు అందుబాటులో ఉంటే, 2018-19 విద్యాసంవత్సరంలో 96,518 సీట్లు తగ్గాయి. అంటే 19,394 సీట్లు తగ్గుముఖం పట్టాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రమాణాలు పాటించిన కాలేజీలకే అనుబంధ గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ప్రమాణాలు పాటించని ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి.

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల వివరాలు

విద్యాసంవత్సరం	కాలేజీలు	సీట్లు	భర్తీ	సీట్లు మిగులు
2014-15	354	96,228	61,909	34,319
2015-16	268	1,15,912	70,792	45,120
2016-17	220	1,04,758	73,686	31,072
2017-18	212	97,961	68,594	29,367
2018-19	205	96,518	68,296	28,222

చేద్దామన్నా..పనిలేదు

(మొదటిపేజీ తరువాయి)

స్టాండర్డ్ ఈ నివేదికను బహిర్గతం చేసింది. ఎన్ఎస్ఎస్‌వో నివేదికను వెల్లడించకుండా మోడీ సర్కార్ తొక్కిపెట్టిందన్న విమర్శలున్నాయి. ఇప్పటికే నిరుద్యోగితపై ఎన్ఎస్ఎస్‌వో నివేదికను జాతీయ మీడియా వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగుల సంఖ్య 2017-18లో 6.1 శాతానికి పెరిగింది. 45 ఏండ్లలో ఇదే అత్యధికమని ఆ నివేదిక తెలిపింది. ప్రభుత్వ గణాంక సంస్థయైన ఎన్ఎస్ఎస్‌వో నివేదిక ప్రకారం 2011-12లో నిరుద్యోగుల సంఖ్య 2.2 శాతం మాత్రమేనన్నది గమనార్హం.

దేశంలో శ్రామికశక్తిలోకి ప్రవేశార్హమైన పని వయసును 16 ఏండ్ల నుంచి 64 ఏండ్లుగా నిర్ణయించారు. 14 ఏండ్లలోపువారిని బాల కార్మికులుగా భావిస్తారన్న విషయం తెలిసిందే. బాలకార్మిక వ్యవస్థను నిషేధిస్తూ తెచ్చిన చట్టం అమలులో ఉన్నది.

యాదాద్రికి అవసరమైనన్ని నిధులు..


(మొదటిపేజీ తరువాయి)



దేవాలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని అన్నారు. పునరుద్ధరణ తర్వాత యాదాద్రికి భక్తుల సంఖ్య ఎన్నోరెట్లు పెరుగుతుందని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యాదాద్రి మాడవీధులు, ప్రాకారాలు కలుపుకుని 4.5 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన దేవాలయం నిర్మించాలని చెప్పారు. మొత్తం 302 ఎకరాల విస్తీర్ణంలో దేవాలయ ప్రాంగణం ఉంటుందని వెల్లడించారు. దేవాలయానికి సంబంధించి ఏయే నిర్మాణాలను ఎక్కడెక్కడ నిర్మించాలనే దానిపై తుది నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారమే నిర్మాణాలను ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. గుట్ట కింది భాగంలో గండి చెరువును తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నిత్యం ఈ చెరువుకు నీటి సరఫరా చేస్తామని వెల్లడించారు. గండి చెరువుకు అనుబంధంగా కోనేరు, కళ్యాణకట్ట నిర్మించాలని చెప్పారు. గుట్ట కింద భాగంలోనే ఆలయ బస్టాండ్ నిర్మించాలని, అక్కడి నుంచి భక్తులను దేవాలయ వాహనాల ద్వారా గుట్టపైకి తీసుకురావాలని చెప్పారు. గుట్టపైకి వెళ్లి, రావడానికి వేర్వేరు దారులు ఉపయోగించాలని చెప్పారు. గుట్ట కింద మండల దీక్ష చేపట్టిన భక్తుల కోసం ఆశ్రమం నిర్మించాలని నిశ్చయించారు. యాదాద్రి ఆలయం చుట్టూ రింగు రోడ్డు నిర్మించాలని, దానికి అనుబంధంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. యాదాద్రి నుంచి తుర్కపల్లికి నాలుగు లేన్ల రోడ్లు వేయాలని ఆదేశించారు.

నిర్మాణ పనులన్నీ అత్యంత పటిష్టంగా జరగాలని, నాణ్యత విషయంలో రాజీపడొద్దని సీఎం సూచించారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయిన తర్వాత పరిపూర్ణ ఉపాసకులతో అతిపెద్ద యాగం నిర్వహిస్తామని, దీనికి దేశ విదేశాల నుంచి ప్రముఖులను ఆహ్వానిస్తామని వెల్లడించారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ యాగం కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయడానికి ఓ కమిటీని నియమించనున్నట్టు చెప్పారు. భక్తులు బస చేయడానికి వీలుగా టెంపుల్ సిటీలో 340 క్వార్టర్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని చెప్పారు. టెంపుల్ సిటీలో రోడ్లు, మంచినీరు, విద్యుత్, డ్రైనేజి లాంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. యాదాద్రిలోని ప్రతీ బ్లాకుకు దేవుళ్ల, దేవతల పేర్లు పెడతామని సీఎం చెప్పారు. యాదాద్రి టెంపుల్ సిటీ అంతా ప్రకృతి రమణీయత గోచరించేలా, ఆహ్లాదం వెల్లివిరిసేలా ఉద్యానవనాలు, ఫౌంటేన్లు నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మతోపాటు ఆర్ అండ్ బీ, దేవాదాయశాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲113 36,582	నిఫ్టీ ▲18 10,912	డాలరుకు రూపాయి విలువ 71.80	బంగారం (10.గ్రా) రూ. 33,230	వెండి (కేజీ) రూ. 40,480	కోడిగుడ్లు (వందకి) హైదరాబాద్ 400, ఒక్కగుడ్డుకు 4.50, వరంగల్ 399, విజయవాడ 397, చెన్నై 435, ముంబయి 450



కొత్త రెనాల్ట్ క్విడ్



న్యూఢిల్లీ : ఆటోమొబైల్ దిగ్గజం రెనాల్ట్ తన ఎంట్రీ లెవల్ కారు రెనాల్ట్ క్విడ్‌లో కొత్త కారును ఆవిష్కరించింది. న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద దీని ధర రూ.2.67-4.63 లక్షలుగా నిర్ణయించింది. మెరుగైన భద్రతా ఫీచర్స్‌తో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని రెనాల్ట్ ఇండియా పేర్కొంది. 0.8 లీటర్, 1లీటరు పెట్రోల్ ఇంజిన్లలో మాన్యువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో తయారు చేసింది. క్విడ్‌లో ఇప్పటి వరకు 2.75 లక్షల పైగా యూనిట్లను విక్రయించినట్లు వెల్లడించింది.

నోకియా 8.1లో కొత్త వేరియంట్



న్యూఢిల్లీ : నోకియా ఫోన్లను తయారు చేసే హెచ్‌ఎండి గ్లోబల్ తాజాగా భారత మార్కెట్లోకి నోకియా 8.1లో నూతన వేరియంట్‌ను 6 జిబి ర్యామ్, 128 జిబి రామ్‌లతో ఆవిష్కరించింది. అదనపు పనితీరు, స్టోరేజ్‌లతో ఇది లభ్యం కానుందని ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 6 నుంచి నోకియా.కామ్/ఫోన్స్, అమెజాన్.ఇన్ మొబైల్ రిటైల్ స్టోర్స్‌లో ఇది లభ్యం అవుతుందని పేర్కొంది. దీని ధరను రూ.29,999గా నిర్ణయించినట్లు హెచ్‌ఎండి గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్ అజేయ్ మెహతా పేర్కొన్నారు. జెయిస్ ఆప్టిక్స్‌తో వచ్చే దీని 12 ఎంపి మెయిన్ కెమెరా, 20 ఎంపి అడాప్టివ్ ఫ్రంట్ కెమెరా తిరుగులేని విధంగా రాత్రి పూట కూడా సెల్ఫీలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందన్నారు.

ఆద్యంతం ఊగిసలాట



- చివరి గంటలో మార్కెట్లకు మద్దతు

ముంబయి : బడ్జెట్ అనంతరం స్టాక్ మార్కెట్లలో తొలి ట్రేడింగ్ సోమవారం ఆద్యంతం ఊగిసలాటకు గురై.. తుదకు చివరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో ముగిసింది. ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ సూచీలు మధ్యాహ్నం తర్వాత పుంజుకున్నాయి. చివరి గంటలో బ్యాంక్, ఎనర్జీ, ఐటి రంగాల సూచీల మద్దతుతో సెన్సెక్స్ 113 పాయింట్లు లేదా 0.31 శాతం రాణించి 36,582కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 18 పాయింట్లు లేదా 0.17 శాతం లాభపడి 10,912 వద్ద ముగిసింది. బిఎస్‌ఇ ఉదయం 93 పాయంట్ల నష్టంతో ప్రారంభమై ఒకానొక దశలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురైంది. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 200 పాయింట్లకుపైగా నష్టపోయింది. కాగా చివరి గంటలో కొనుగోళ్లు పుంజుకోవడంతో నష్టాల నుంచి బయటపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఒఎన్‌జిసి, బజాజ్ ఆటో, టిసిఎస్ కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఎన్‌ఎస్‌ఇలో యస్ బ్యాంక్, హిందాల్కో, హిందుస్థాన్ పెట్రోలియం, పవర్ గ్రిడ్, ఎన్‌టిపిసి షేర్లు అధిక నష్టాలను చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. కాగా ఆటో, లోహ, ఎఫ్‌ఎంసిజి, ఫార్మా రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

కృత్రిమ మేధస్సులో రాణింపు..

హైదరాబాద్: ఐటి రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పుల్లో కృత్రిమ మేధస్సు (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రొబోటిక్స్‌లో భారత్ ప్రపంచ దేశాలకు పోటీగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనూప్ వాధవన్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఇండియా సాఫ్ట్-2019కు హాజరైన అనూప్ ఐటి రంగంలోని ఈ అవకాశాలను భారత కంపెనీలు బాగా వినియోగించుకుంటున్నాయన్నారు. ఇందులో 250 మంది ఎగ్జిబీటర్లు పాల్గొనగా.. 60 దేశాల నుంచి 400 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు.

అనిల్ దివాలా పిటిషన్...

కుప్పకూలిన ఆర్‌కామ్ షేర్లు

ఇంట్రా ట్రేడింగ్‌లో 54% పతనం

- అడాగ్ ఇతర షేర్లు ఢమాల్

న్యూఢిల్లీ : అప్పుల సంక్షోభంలో చిక్కుకున్న అనిల్ అంబానీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) షేర్ల విలువ అమాంతం పడిపోయింది. దివాల పరిష్కార ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఆర్‌కామ్ స్టాక్ ఎక్స్ఛేంజిలకు సమాచారం ఇచ్చింది. దీంతో సోమవారం సెషన్‌లో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్(అడాగ్) కంపెనీ షేర్లు భారీ నష్టాలు చవి చూశాయి. ముఖ్యంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేర్ నిఫ్టీలో ఉదయం రూ.10.45 శాతం వద్ద మొదలైన సూచీ ఒక దశలో 54.3 శాతం కుప్పకూలి రూ.5.30 రికార్డు కనిష్టానికి చేరింది. తుదకు 34.91 శాతం పతనమై రూ.7.55 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో ఇంట్రా ట్రేడింగ్‌లో 48.27 శాతం నష్టపోయి రూ.6 వద్ద నమోదయ్యింది. ఇదే బాటలో అడాగ్‌కు చెందిన రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ నిప్పన్ లైఫ్, రిలయన్స్ నావల్, రిలయన్స్ పవర్, రిలయన్స్ కాపిటల్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర స్టాక్స్ భారీ నష్టాలు మూటగట్టుకున్నాయి. టెలికాం రంగంలో దివాల పరిష్కార ప్రక్రియకు చేరిన రెండో కంపెనీగా ఆర్‌కామ్ నిలిచింది. అంతకు ముందు ఎయిర్ సెల్ దివాల పరిష్కార ప్రక్రియకు చేరింది.



అనీల్ అంబానీ గ్రూపునకు చెందిన ఇతర స్టాక్స్ కూడా భారీ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రిలయన్స్ కాపిటల్ లిమిటెడ్ 19.80 శాతం నష్టపోయి రూ.151.70కు పడిపోయింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్ 14.87 శాతం దిగజారి రూ.227.25కు క్షీణించింది. రిలయన్స్ పవర్ లిమిటెడ్ 35.10 శాతం నష్టపోయి 17.10 వద్ద ముగిసింది. రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ షేర్లు 14.72 శాతం కోల్పోయి రూ.10.08కి పడిపోయింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ షేర్లు 12.74 శాతం తగ్గి రూ.301.15 వద్ద ముగిసింది. 2018 మార్చి ముగింపు నాటికి రిలయన్స్ కమ్యూనికేషన్స్ రూ.46,547 కోట్ల అప్పుల్లో ఉంది.

స్టాక్స్‌ను ముంచిన పిటిషన్..

గత కొన్ని నెలలుగా ఎరిక్‌సన్ తమ బకాయి చెల్లింపులు చేయాలని సుప్రీంకోర్టు ద్వారా ఆర్‌కామ్‌పై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తుంది. మరోవైపు ఆర్‌కామ్ ఆస్తుల విక్రయానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌కామ్ అనూహ్యంగా దివాలా పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ద్వారా ఫాస్ట్ ట్రాక్ తీర్మానం కోరుతూ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయం చేశారు. ఈ విషయాన్ని ఆ కంపెనీ స్టాక్ మార్కెట్లకు వెల్లడించింది. దీంతో అనిల్ అంబానీ కంపెనీల షేర్లు భారీ నష్టాలను చవి చూశాయి. సుమారు రూ.40వేల కోట్ల పైగా రుణ పరిష్కారాలకు సంబంధించిన అంశంలో 40 రుణదాత సంస్థల నుంచి సంపూర్ణ అనుమతి లభించకపోవడంతో ఆర్‌కామ్ తాజా నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. గత 18నెలలుగా ఆస్తుల విక్రయం ద్వారా రుణ చెల్లింపులకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రుణ పరిష్కార అంశం ముందుకు సాగలేదని ఆర్‌కామ్ తెలిపింది.

మరోవైపు స్వీడిష్ టెలికాం పరికరాల తయారీదారు ఎరిక్‌సన్ ఇటీవల ఆర్‌కాంపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించింది. దీనిపై సుప్రీంకోర్టు ఆర్‌కామ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్‌కామ్ దివాలా పిటిషన్‌కు వెళ్లడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.

జియోకు చౌకబేరం..!

ఆర్‌కామ్ ఎన్‌సిఎల్‌టికి వెల్లడం ద్వారా ఆ కంపెనీ ఆస్తులు జియోకు చౌకబేరంగా లభించనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆర్‌కామ్ ఆస్తుల కొనుగోలుకు జియోతో ఎప్పటి నుంచో చర్చలు జరుగుతున్నాయి. ఆర్‌కామ్‌కు 800, 900, 1800, 2100 మెగాహెడ్జెస్ బాండ్‌లో ఉన్న 122.4 మెగాహెడ్జెస్ స్పెక్ట్రమ్.. అదే విధంగా ఆర్‌కామ్‌కు 43,000 టవర్లు, 1.78 లక్షల కిలోమీటర్ల ఆప్టిక్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్, 248 మీడియా కన్వర్జెన్సీ నోడ్స్‌ను ఉపయోగించుకోవడానికి రిలయన్స్ జియో ఇది వరకే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఆస్తులను ఆర్‌జియో వైర్‌లెస్, ఫైబర్ టు హోమ్ సేవల కోసం వినియోగించుకుంటుంది. ఏ ఇతర టెలికం ఆపరేటర్లకు లేనటువంటి అత్యంత విలువైన 800 మెగాహెడ్జ్ ఆర్‌కామ్ వద్ద ఉంది. దీన్ని రేడియో ఫ్రీక్వెన్సీకి వాడుతున్నారు. ఆర్‌కామ్ ఆస్తులపై భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు ఎలాంటి ఆసక్తిని కనబర్చడం లేదు.

నల్లధనంపై రిపోర్టులను బహిర్గతం చేయలేం

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ



న్యూఢిల్లీ : దేశంలోపల, వెలుపల గల నల్లధనంపై అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి అంచనాలు, నివేదికలు వెలువడలేదు. అయితే నల్లధనంపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్‌ఐపీఎఫ్‌పీ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకానమిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐఎఫ్‌ఎం)లు చేసిన అధ్యయనాలను బహిర్గతం చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిరాకరిస్తున్నది. ఈ మూడు నివేదికలను బహిరంగపర్చలేమని తెలిపింది. ఈ మూడు రిపోర్టులను పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలిస్తున్నదని, అందువల్ల ఈ నివేదికల కాపీలను బహిరంగపరిస్తే.. పార్లమెంట్ గౌరవానికి భంగం కలుగుతుందని వివరించింది. ఈ రిపోర్టులు ప్రభుత్వానికి చేరి నాలుగేండ్లకు పైగానే గడిచిపోవడం గమనార్హం. ఈ మూడు సంస్థల నివేదికలు ప్రభుత్వానికి 2013, 2014లలోనే అందినట్టు ఓ ఆర్టీఐ సమాధానంలో వెల్లడైంది.

నల్లధనంపై అధ్యయనం చేసేందుకు ఈ మూడు సంస్థలను 2011లో యూపీఏ ప్రభుత్వం పురమాయించింది. అయితే, ఈ మూడు నివేదికలతోపాటు వాటిపై ప్రభుత్వ స్పందనను స్టాండింగ్ కమిటీ(ఫైనాన్స్) ముందు పెట్టేందుకు లోక్‌సభ సెక్రెటేరియట్‌కు పంపినట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్టీఐ సమాధానంలో తెలిపింది. నివేదికల వెల్లడికి నిరాకరిస్తూ.. ఆర్టీఐ యాక్ట్ సెక్షన్ 8(1)(సీ) కింద పార్లమెంట్ గౌరవానికి భంగం కలిగించే సమాచారాన్ని బహిర్గతపర్చడంపై మినహాయింపు ఉన్నదని వివరించింది. ఈ నివేదికలు 2017 జూలై 21న ప్యానెల్‌కు అందజేశారు. నల్లధనానికి సంబంధించి ఇప్పటివరకు అధికారిక అంచనాలేవీ లేవు. అయితే 2005-2014 మధ్యకాలంలో 770 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 53.90లక్షల కోట్లు) నల్లధనం భారత్‌లోకి చేరిందని, అలాగే 165 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 11.55లక్షల కోట్లు) నల్లధనం భారత్ నుంచి వెలుపలికి వెళ్లినట్టు అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ సంస్థ తన నివేదికను వెల్లడించింది.

మూడు రెట్లయిన ఐడీబీఐ బ్యాంకు నష్టాలు..

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఐడీబీఐ బ్యాంకు నష్టాలు మూడు రెట్లు ఎగిసి రూ.4,185.48 కోట్లకు చేరాయి. మొండి బాకీలు అమాంతం పెరగడంతో ఈ బ్యాంకు మరోమారు తీవ్ర నష్టాలను ఎదుర్కొంది. 2017-18 ఇదే క్యూ3లో రూ.1,524.31 కోట్ల నష్టాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.7,125.20 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం క్యూ3లో రూ.6,190.94 కోట్లకు తగ్గిపోయిందని సోమవారం ఆ బ్యాంకు ఫలితాల్లో వెల్లడించింది. క్రితం క్యూ3లో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 29.67 శాతానికి ఎగిశాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 24.72 శాతం స్థూల నిరర్థక ఆస్తులు నమోదయ్యాయి, ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 16.02 శాతం నుంచి 14.01 శాతానికి తగ్గాయి. గత ఏడు సంవత్సరాల్లో తొలి సారిగా ఒక త్రైమాసికంలో అతి తక్కువగా కొత్తగా రూ.2.211 కోట్ల మొండి బాకీలను చవి చూడటం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ బ్యాంకులో ఎల్‌ఐసీ మెజారిటీ వాటా కలిగి ఉంది.

బజాజ్ నుంచి కొత్త మిక్సర్లు

హైదరాబాద్ : బజాజ్ ఎలక్ట్రికల్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి శక్తివంతమైన మిక్సర్లు, గ్రైండర్లు విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మిక్సింగ్ అప్లయెన్సెస్ విభాగంలో తమ ఆధిపత్యాన్ని మార్కెట్‌లో కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ అతుల్ శర్మ పేర్కొన్నారు. ఈ కొత్త ఉత్పత్తుల ధరలను రూ.4,815 నుంచి రూ.5,799 మధ్య నిర్ణయించినట్లు తెలిపారు. 100 శాతం రాగి మోటార్‌తో తయారు చేసిన ఈ ఉత్పత్తులు వినియోగించడానికి అతి సులభంగా ఉంటాయన్నారు.

హరితహారం దేశానికి దిక్సూచి

- సీఎం స్వయంగా చొరవ తీసుకోవడం ఆదర్శనీయం: యూపీ అటవీ శాఖ అధికారుల బృందం కితాబు


నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హరితహారం పథకం దేశానికే దిక్సూచి అని, పర్యావరణ రక్షణ కోసం ప్రజల్ని భాగస్వామ్యం చేస్తూ సీఎం స్వయంగా చొరవ తీసుకోవడం అదర్శనీయమని ఉత్తరప్రదేశ్ గ్రీన్ ప్రాజెక్ట్ మిషన్‌డైరెక్టర్, గోరఖ్ పూర్ చీఫ్ కన్జర్వేటర్ బివాస్ రంజన్ నేతత్వంలోని బృందం కొనియాడింది. హరితహారంపై అధ్యయనం చేసేందుకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 10 మంది అటవీ అధికారుల బృందం హైదరాబాద్‌కు విచ్చేసింది. అరణ్యభవన్‌లో తెలంగాణ అటవీ శాఖ అధికారులతో ఐదు గంటలపాటు భేటీ అయింది. అడవుల రక్షణ, పచ్చదనం పెంపు కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం పథకం దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శనీయమని బివాస్ రంజన్ కొనియాడారు. కోట్లాది మొక్కలు నాటాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పాన్ని ప్రశంసించారు. ఈ యేడాది వర్షాకాలంలో యూపీలోని 22 కోట్ల మంది ఒక్కో మొక్క నాటాలనే నిర్ణయాన్ని తమ ప్రభుత్వం తీసుకున్నదని తెలిపారు. ఎలా సన్నద్ధం కావాలనే ప్రణాళికలో భాగంగానే తాము తెలంగాణ పర్యటనకు వచ్చామన్నారు. పచ్చదనం గ్రామ అభివద్ధిలో తప్పనిసరి అని నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందుపర్చటం బాగుందన్నారు.ఎలా సన్నద్ధం కావాలనే ప్రణాళికలో భాగంగానే తాము తెలంగాణ పర్యటనకు వచ్చామన్నారు.

గుండెకు కణతి.. అరుదైన చికిత్స

- సన్‌షైన్ ఆస్పత్రి వైద్యుల ఘనత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గుండెలోని రక్తనాళాలు మూసుకుపోయాయి. కణతి కూడా ఏర్పడింది. వీటికితోడు వారంలో మూడు సార్లు డయాలసిస్ చుట్టుముట్టిన జబ్బులతో బతుకీడుస్తున్న ఓ వ్యక్తికి గచ్చిబౌలిలోని సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు కంబైండ్ సిఏజీబీ అండ్ హార్ట్ ట్యూమర్‌తో శస్త్రచికిత్స నిర్వహించి అరుదైన రికార్డు సాధించారు. ఈ తరహా శస్త్రచికిత్స నిర్వహించడం ఇదే ప్రథమమని ఈ విధానాన్ని మెడికల్ జర్నల్స్‌లో ప్రచురణ కోసం పంపినట్టు వైద్యులు తెలిపారు. క్లిష్టమైన శస్త్రచికిత్స జరిగిన తీరును ఆస్పత్రి చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ప్రతిక్ భట్నాగర్ వివరించారు. యమన్ దేశస్తుడైన సలీమ్ (54) గత ఐదేండ్లుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నారు. సమస్య తీవ్రం కావడంతో అతనికి వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూత్రపిండాల జబ్బుతో బాధపడుతున్న సలీంకు గత కొంతకాలంగా శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా మారింది. వీపరీతంగా ఆయాస పడుతున్న అతను జనవరి 21న సన్‌షైన్ ఆస్పత్రికి వచ్చారు. అతనికి పరీక్షలు నిర్వహించగా గుండెకు ఎడమ వైపున పెద్ద కణతి ఉందని తేలింది. దీనిని వైద్య పరిభాషలో 'లెఫ్ట్ ఏట్రియల్ మైకోమా' అంటారు అతని వైద్య పరిస్థితిని మరింత నిర్ధారించుకోవడానికి యాంజియోగ్రాఫీ చేయగా గుండెకు రక్త సరఫరా చేసే రెండు రక్తనాళాలు పూర్తిగా పూడుకుపోయాయి. దీనితో అతనికి కణితి తొలగించడం, రక్తనాళాలను బైపాస్ చేయ్యవలసిన పరిస్థితి నెలకొంది. రెండు సమస్యలను ఒకేసారి సరిచేయడానికి కంబైండ్ సిఎబిజి అండ్ హార్ట్ ట్యూమర్ సర్జరీనే ఏకైక మార్గమని భావించి శస్త్రచికిత్స చేశామని వివరించారు. శస్త్రచికిత్సలో డాక్టర్ ప్రతిక్ భట్నాగర్‌తోపాటు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కృష్ణపాటిల్, డాక్టర్ సంజీవ్ కుమార్, డాక్టర్ ఆనంద్ జోషి ఉన్నారు.

కోయిలకొండ ఉద్రిక్తం

పాలమూరు జిల్లాలోనే కొనసాగించాలని ఆందోళన

- దామాయపల్లి రహదారిపై అఖిలపక్షం వంటావార్పు
- పోలీసులపైకి రాళ్లురువ్విన నిరసనకారులు
- సీఐతో పాటు పలువురికి గాయాలు



గాయాలపాలైన సీఐ పాండురంగారెడ్డి

నవతెలంగాణ-కోయిలకొండ

కోయిలకొండ మండలాన్ని యథావిధిగా పాలమూరు జిల్లాలోనే కొనసాగించాలని 40 రోజులుగా అఖిలపక్షం నాయకులు, స్థానికులు చేస్తున్న నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. కొత్తగా ఏర్పడబోయే నారాయణపేట జిల్లాలో మండలాన్ని చేర్చొద్దని పట్టుబడుతున్నారు. సోమవారం మహబూబ్‌నగర్ రహదారి దామాయపల్లిలో వివిధ పార్టీల నాయకులు, స్థానికులు ఉదయం ఆరుగంటలకే బస్టాండ్ వద్ద ధర్నాకు దిగారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పేవరకూ కదిలేదిలేదని రోడ్డుపై వంటావార్పు చేశారు. పోలీసులు ధర్నా విరమించాలని సూచించినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనను ఉద్రిక్తం చేశారు. పరిస్థితి చేయిదాటుతోందని గ్రహించిన పోలీసులు లాఠీచార్జీకి దిగారు. ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో కోపోద్రిక్తులైన ఆందోళనాకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దాడిలో భూత్పూర్ సీఐ పాండు రంగారెడ్డి తలకు గాయాలయ్యాయి. అదేసమయంలో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే దాడికి పాల్పడ్డవారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ 12 మండలాలతో నారాయణపేటను జిల్లా చేయడానికి ఇదివరకే సర్కార్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందనీ, కోయిల్‌కొండ మండలాన్ని కలపడం సరికాదనీ అన్నారు. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపేటలో ఈ మండలాన్ని కలపొద్దని కోరారు. ఈ విషయమై 44 గ్రామాల సర్పంచులు పంచాయతీల్లో తీర్మానించి ప్రభుత్వానికి నివేదించినట్టు గుర్తుచేశారు. ఈ నెల 15 నాటికి మహబూబ్‌నగర్ జిల్లాలోనే కొనసాగిస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలనీ, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతమవుతాయనీ హెచ్చరించారు.

అలాగే, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని గుంపుల తిరుమలగిరి మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ డి.అమయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చివ్వెంల మండల కేంద్రానికి అనేక గ్రామాలు దూరంగా ఉన్నాయనీ, మండలంలో 31 గ్రామాలు ఉన్నాయనీ తెలిపారు. జాతీయ రహదారిపై ఉన్న గుంపుల తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లోని 13 గ్రామాలతో నూతన మండలంగా గుర్తించాలని కోరారు.



దమాయపల్లి రహదారిపై భోజనాలు చేస్తున్న ప్రజలు

విలీనంపై ఆందోళన

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 గ్రామాలను విలీనం చేస్తూ జారీచేసిన జీవోను ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పీవైఎల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో నాయకులు సుధాకర్ మాట్లాడారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్, ఖానాపూర్, సారంగాపూర్, గూపన్‌పల్లి, ముబారక్ నగర్, మోపాల్ మండలంలోని పాంగ్రా, బోర్గాం(పీ) మక్లూర్ మండలంలోని మానిక్‌బండర్, బోర్గాం(కే) గ్రామాలను నిజామాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్టు జీవో విడుదల చేసినట్టు తెలిపారు. ఇప్పుడిప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయనీ, వాటిని కార్పొరేషన్‌లో విలీనం చేసి చిన్నాభిన్నం చేయొద్దనీ కోరారు.

ఆరోగ్యం కోసం 'ఆర్గానిక్ ఫెస్టివల్'

- హైదరాబాద్‌లో ఈ నెల 6 నుంచి 10 వరకు పండుగ
- మహిళా రైతులను ప్రోత్సహించేందుకే : మహిళా,శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్' తొలిసారిగా రాష్ట్రం ఆతిథ్యమివ్వనుంది. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్ శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో ఈ వేడుగను కేంద్ర, రాష్ట్ర మహిళా, శిశ అబివృద్ధి సంక్షేమ శాఖలు సంయక్తంగా నిర్వహించనున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఆర్గానిక్ రంగంలో ఉన్న మహిళా రైతులు, వ్యాపారవేత్తలను ప్రోత్సహించడంతో పాటుగా వారిని గుర్తించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 2015 నుంచి 'ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్' కేంద్రం న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నది. ఆర్గానిక్ ఉత్పత్తులపై రాష్ట్ర ప్రజలకు ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఫెస్టివల్ ఈ సారి హైదరాబాద్‌లో జరిపేందుకు కేంద్రం అంగీకరించింది. వేడుకలో మహిళా ఆర్గానిక్ వ్యవసాయదారులు, వ్యాపారవేత్తలు విస్తృతస్థాయిలో ఆర్గానిక్ ఉత్పత్తులను



ప్రదర్శించనున్నారు. ప్రతి సంవత్సరం ఈ ఫెస్టివల్‌కు అపూర్వమైన స్పందన లభిస్తున్నదని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రతి ఆర్గానిక్ ఫెస్టివల్లోనూ అమ్మకాలు పెరుగుతున్నాయని.. అలాగే, సందర్శకులూ పెరుగుతుండటం ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజల ఆదరణను తెలియజేస్తున్నదని స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో ఆర్గానిక్ సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటుగా ఉపాధి కల్పన, వ్యవసాయానికి తోడ్పాటునందించడం ద్వారా మహిళా రైతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నాం. తొలిసారిగా దక్షిణ భారతదేశంలో అందులోనూ తెలంగాణ జరుగుతున్నది. గత ఆరేండ్లలో జరిగిన మంచి స్పందన ఇక్కడా లభిస్తుందని ఆశిస్తున్నాం' అని రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.జగదీశ్వర్, డైరెక్టర్ విజయేంద్ర బోయి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు.

ఇంజినీరింగ్ ఇంటర్న్‌షిప్ సులభతరం

నైపుణ్యం పెంచేందుకు పలు చర్యలు

- కొత్త కోర్సులపై కసరత్తు చేస్తున్నాం: ఏఐసీటీఈ డిప్యూటీ డైరెక్టర్ నీతూభగత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేయడం తప్పనిసరి చేశామని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) డిప్యూటీ డైరెక్టర్ నీతూభగత్ చెప్పారు. అయితే ఇంటర్న్‌షిప్‌ను సులభతరం చేశామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యాసదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ గతంలో ఇంటర్న్‌షిప్ కేవలం పరిశ్రమల్లోనే చేసేందుకు అవకాశముండేదని అన్నారు. తాజాగా పరిశ్రమలతోపాటు ఎంఎస్‌ఎంఈ, ఇతర కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసినా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఇంటర్న్‌షిప్ చేయడం వల్ల విద్యార్థులకు బహుళ ప్రయోజనాలున్నాయని అన్నారు. మార్కెట్ అవసరాలు ఏమున్నాయో తెలుసుకోవడంతోపాటు విద్యార్థులకు నైపుణ్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని చెప్పారు. ఉద్యోగాలు పొందాలంటే ఎలాంటి నైపుణ్యం అవసరమో తెలుస్తుందన్నారు. దానికి తగ్గట్టుగా విద్యార్థులు ఇంజినీరింగ్ చదువుతుండగానే సన్నద్ధమవుతారని అన్నారు.



విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ఏఐసీటీఈ పలు చర్యలు తీసుకుందని చెప్పారు. కొత్త కోర్సులపై ఏఐసీటీఈ కసరత్తు చేస్తోందని అన్నారు. మార్కెట్ అవసరాలు, పరిశ్రమలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు పెంచే కోర్సులను ప్రవేశపెట్టడంపై దృష్టి సారించామని చెప్పారు. అందులో భాగంగానే డాటా అనలిటిక్స్, రోబోటిక్స్ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని సమాలోచన చేస్తున్నామని అన్నారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో పీహెడీల కొరత ఉందన్నారు. అయితే పీహెచ్‌డీ చేసే ఇంజినీరింగ్ విద్యార్థులను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇప్పటికే ఇంజినీరింగ్ పీజీ చేసే విద్యార్థులకు నెలకు రూ.12,400 స్కాలర్‌షిప్ అందజేస్తున్నామని వివరించారు. పీహెచ్‌డీ చేసే విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించే దిశగా సమాలోచన చేస్తున్నామని అన్నారు. ప్రమాణాలు పాటించి, అర్హులైన అధ్యాపకులుంటే కొత్త ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు.



ఎల్లమ్మ కథ మన సమాజపు పోకడలను పట్టిచ్చే అద్దం వంటిది. పురుషాహంకారం, పాతివ్రత్యంపేరుతో స్త్రీలను అమానవీయంగా హింసించి వేధించడం వంటి సకల భారతీయ సమాజపు అవలక్షణాలు ఈ కథలో మనకు స్పష్టంగా కనపడతాయి. అదే సమయంలో దళిత బహుజనులు కష్టాల్లో ఉన్న స్త్రీలను ఎట్లా అక్కున చేర్చుకుంటారో కూడా రేణుక ఎల్లమ్మ కథ మనకు చెబుతుంది. అటువంటి అద్భుతమైన ఎల్లమ్మ కథతో ముడివడిన జానపదుల జీవితాన్ని మీకందిస్తోంది 'జాతర'.

భావ సంఘర్షణకు ప్రతీక ఎల్లమ్మ కథ

అక్షరజ్ఞానం, చదువు సందెలు తక్కువని భావింపబడే దళిత సమూహాల్లో కళాకారులకు, తాత్వికులకు కొదవలేదు. ప్రత్యేకంగా తమవని చెప్పుకోదగిన కొన్ని కళారూపాలను తరాల నుండీ దళిత సమూహాలు కాపాడుకుంటూ వస్తున్నాయి. వీటిలో ఎల్లమ్మ కథ, జాంబవపురాణం, చిందుభాగవతం, ఒగ్గు కథ వంటి కళలు ముఖ్యమైనవి. ఈ కళారూపాలను నిరక్షరాశ్యులైన గ్రామీణ దళితులు స్వంతంగా రూపొందించుకొని ప్రదర్శించడం విశేషం. ఆయా కళారూపాల్లో ఉపయోగించే పనిముట్లు పరోక్షంగా దళిత సంస్కృతికి అద్దం పడతాయి. ఇవి దళిత భావజాలాన్ని, అనార్య సంస్కృతిని, మాతృస్వామ్య వ్యవస్థతో దళితులకు ఉన్న దగ్గరి సంబంధాన్ని ప్రతిబింబిస్తాయి. ఆర్య-అనార్య తెగలకు, పితృస్వామిక-మాతృస్వామిక వ్యవస్థలకు, మార్గ-దేశీ సంప్రదాయాలకు, శిష్ట-జానపద సంస్కృతులకు మధ్య వుండే వైరుధ్యం దళిత కళారూపాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

ఈ వ్యాసరచనకు దళిత కళారూపమైన ఎల్లమ్మ కథను పరిశీలనాంశంగా తీసుకున్నాం. ఎల్లమ్మ కథను తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లో భవనీలు లేక బైండ్లవారు ప్రదర్శిస్తారు. వీరు దళితుల్లో మాదిగ ఉపకులానికి చెందినవారు. భవనీల ప్రస్తావన శిష్టసాహిత్యంలో శ్రీనాథుడు రచించిన 'క్రీడాభిరామం'లో కూడా కనిపిస్తుంది. వీరు కాకతీయుల కాలంలో జమిడిక (జవనిక) వాయిస్తూ పరశురాముడి కథను, రేణుకా ఎల్లమ్మ కథను గానం చేస్తూ జీవించినట్టు 'క్రీడాభిరామం' పేర్కొంది.

ఎల్లమ్మను దళితవర్గాల్లో అట్టడుగు ప్రజలు ఆరాధిస్తారు. భవనీల కుల దైవం ఎల్లమ్మ. ఈమె రేణుకాదేవి అనీ, రేణుకా ఎల్లమ్మ అనీ, ఏకవీర అనీ, మహురం అనీ గ్రామాల్లో వెలిసింది. నిజామాబాద్ జిల్లాలో ఈమె పేరున "ఎల్లమ్మ" గుట్ట ఉండగా, వరంగల్ పట్టణంలో ఒక వీధి ఎల్లమ్మ వీధిగా పిలువబడుతుంది. ఎల్లమ్మను ఆంధ్రప్రాంతంలోనే కాకుండా ఆంధ్రరాష్ట్రానికి సరిహద్దుగా గల మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా పూజిస్తున్నారు.

రకరకాల కథలు... భావం ఒక్కటే

ఎల్లమ్మ కథలో పాఠ్యభేదాలున్నాయి. ఒక కథనం ప్రకారం రేణుకాదేవి జమదగ్ని మహాముని భార్య, పరశురాముడి తల్లి, ఈమే పార్వతీ పరమేశ్వరుల సంతానంగా పేర్కొనబడింది. జమదగ్ని నిర్వహించే పూజాకార్యక్రమాలకు నీటిని రేణుకాదేవి ప్రతిరోజూ ఏటినుంచి తీసుకొస్తూ ఉంటుంది. ఆనవాయితీగా నీటికోసం ఏటి ఒడ్డుకు వెళ్లిన రేణుకకు అక్కడ జలకాలాడే అప్సరసల శృంగార సన్నివేశం కంటబడి ఆమె మనసు చలిస్తుంది. రేణుక నీటిని తీసుకొని జమదగ్ని ఉండే పర్ణశాలకు రాగా, అతడు ఆమె పవిత్ర హృదయంతో నీటిని తీసుకురాలేదని గ్రహించి ఆ నీటిని స్వీకరించక తన కుమారుల్లో ఒకరిని ఆమె తల ఖండించవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. అందుకు రేణుకా జమదగ్నుల కుమారుడు పరశురాముడు అంగీకరించి ఆమె తలను కత్తితో తెగనరుకుతాడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించిన పరశురాముడిని మెచ్చుకొని ఏమికావాలో కోరుకొమ్మని అడుగగా, పరశురాముడు తన తల్లియైన రేణుకను తిరిగి బతికించమని కోరడం, తన మహిమతో ఆమెను తిరిగి బతికించడంతో కథ సుఖాంతమవుతుంది. ఈ కథలో పరశురాముడు నరకగా తెగిపడిన రేణుక తల ఎగిరి భవనీల కాలనీలో పడుతుంది. వారు ఆమెను ఆదరంగా స్వీకరించి ఆమె తమకెల్లరకు అమ్మవంటిదని 'ఎల్లమ్మ' అనే పేరుతో పూజించడం ప్రారంభించారు. ఎల్లమ్మ కథాగానం బైండ్లవారి కులవృత్తిగా మారింది.

ఎల్లమ్మ కథను రాయలసీమ బైండ్లవారు మరోవిధంగా చెబుతారు. ఈ కథలో కూడా రేణుకాదేవి పరశురాముడి తల్లిగానే ఉంటుంది. పరశురాముడు తన తల్లియైన రేణుకాదేవి శీలాన్ని శంకిస్తూ తానెలా పుట్టిందీ, తన తండ్రి ఎవరో





చెప్పమని ఆమెని రకరకాలుగా హింసిస్తూ ఉంటాడు. కుమారుని వేధింపులు భరించలేని రేణుక పారిపోయి మాదిగవాడలో తలదాచుకుంటుంది. మాదిగలు ఆమెను ఆదరిస్తారు. ఆమె తలదాచుకున్న ఇంట్లో కొడుకు మరణించగా యవ్వనవతియైన కోడలు, వితంతువైన అత్తా ఉంటారు. వీరికి రేణుక తన సమస్యను వివరించి తనను వెదకుతూ పరశురాముడు ఇక్కడికొస్తాడని చెబుతుంది. వితంతువులైన అత్తాకోడళ్ళు పరశురాముడి రాక కోసం వాకిట్లో మంచంవేసి అతని కోసం తాంబూలాన్ని సిద్ధంగా ఉంచుతారు. రేణుక చెప్పినట్టు పరశురాముడు తల్లిని వెదుక్కొంటూ అక్కడికి వస్తాడు. కోడలు అతనికి మర్యాదచేసి మంచంపై కూర్చొండబెట్టి తాంబూలం ఇస్తుంది. పరశురాముడు తాంబూలం సేవించి నోటిలో ఉన్న పిప్పిని ఉమ్ముతాడు. ఆ ఉమ్మి నుంచి ఇద్దరు మగపిల్లలు పుడతారు. ఆ పిల్లలే బైండ్లవారు. ఆ పిల్లల్ని చూసి ఆశ్చర్యపడిన పరశురాముడు వీళ్ళు ఎలా పుట్టారని అడుగుతాడు. అప్పటివరకు ఇంటిలోపల దాగివున్న రేణుకాదేవి బయటకొచ్చి ఈ పిల్లలు ఎలా పుట్టారో నువ్వు కూడా అలాగే పుట్టావని పరశురాముడికి ధీటైన సమాధానం ఇచ్చి అతని సందేహాన్ని నివృత్తి చేస్తుంది. అప్పటి నుండి బైండ్లవారు రేణుకను తమ ఇంటి అమ్మగా (ఇల్లు+అమ్మ) "ఇల్లమ్మ"గా కాలక్రమంలో ఎల్లమ్మగా పూజిస్తూ ఆమె కథను ప్రదర్శనా కళగా మలచుకున్నారు.

బహుజన కళారూపాల ప్రత్యేకతలు

కింది కులాలకు చెందిన కళారూపాల్లో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఆయా కులాలకు తమవైన పూజా విధానాలు, కళాసాహిత్యాలు ఉన్నాయి. ఈ కులాలు తమ కళారూపాల్లో నిర్దిష్టమైన కథాంశాన్ని ఎన్నుకుని ప్రత్యేక సంగీత వాయిద్యాలను ఉపయోగించడం వెనుక తమ సంస్కృతిని, సంప్రదాయాలను అన్నింటికీ మించి తమ భావజాలాన్ని కాపాడుకోవాలనే కోరిక కనిపిస్తుంది. వీరు ఉపయోగించే జమిడిక, డప్పు, డోలు, తప్పెట్లు మొదలైనవి బ్రాహ్మణీయ వాద్యపరికరాలకు భిన్నంగా ఉంటాయి. ఇతరుల కళారూపాలు, సంగీత వాయిద్యాల వలె ఇవి సున్నితంగా, ఆహ్లాదకరంగా ఉండవు. సంగీతం కర్ణకఠోరంగా ఉండి, కథనం సాహసంతోనూ, ఉద్వేగంగానూ ఉంటుంది. ఎల్లమ్మ కథలో బైండ్లవారు ఉపయోగించే జమిడిక 'జుంజుంజుం' మంటూ తాత్వికంగా సాగుతుంది.

ఎల్లమ్మ కథ ప్రాచీనత ఏనాటిదో చెప్పడం కష్టం. కాకతీయుల కాలంనాటికే ఈ కథా ప్రాశస్త్యం గురించి శిష్టసాహిత్యంలో పేర్కొనబడింది. ఇది మౌఖికంగా ఎంత ప్రాచీనకాలం నుండి ప్రచారంలో వుండి ఉంటుంది. ఈ కథలో ప్రాంతాలవారీగా ఎన్ని పాఠాంతరాలున్నప్పటికీ ఎల్లమ్మకూ, మాదిగవారికీ దగ్గరి సంబంధం, ఆమెను వారు కాపాడుకున్నవైనం అన్ని కథల్లోనూ ప్రధానాంశంగా కనిపిస్తుంది. రేణుకాదేవి, జమదగ్ని, పరశురాముడు పితృస్వామిక వ్యవస్థలో పురుషాధిపత్యం, స్త్రీలకు కర్మ, జ్ఞానాధికారాలను నిరాకరించడం, వారి ప్రవర్తనపై నియంత్రణ సాధించడం అనేవి రేణుకాదేవి విషయంలో జరిగాయి. ఆమె లైంగికతపై నియంత్రణ సాధించే క్రమంలో ఆమె శీలాన్ని అనుమానించి శృంగార దృశ్యాలను చూసినంత మాత్రానే ఆమె అపవిత్రమైపోయిందనే శంకతో ఏకంగా రేణుక భర్త జమదగ్ని ఆమె తలను నరికి వెయ్యాలని ఆజ్ఞాపించడమనేది పితృస్వామ్య వ్యవస్థ లక్షణం. ఈ కథలో రేణుకాదేవి తల ఎగిరి దళితవాడలో పడగా, ఆమెను వారు స్వీకరించడం లేక పరశురాముడి వేధింపులు భరించలేక రేణుక దళితవాడలో తలదాచుకోవడం అనేవి సహజమైన పరిణామాలు. అనార్య సంస్కృతికి చెందిన దళితజాతులకు మాతృస్వామిక లక్షణాలు, స్త్రీలను గౌరవించే సంప్రదాయం ఉండబట్టే ఆ మాదిగ వారు రేణుకను సాదరంగా కాపాడుకోవడమే కాక ఆమెను తమ కులదైవంగా స్వీకరించడమనేది అనార్య సంస్కృతికి చిహ్నం.

ఆర్య సంస్కృతికి ప్రతీక పరశురాముడు

పరశురాముడు ఆర్య సంస్కృతికి పితృస్వామ్య వ్యవస్థకు, రాజ్యానికి ప్రతినిధిగా కనిపిస్తాడు. అతడు తన తల్లి రేణుక విషయంలో కొడుకుగా కాక ఒక పురుష దురహంకారిగా కనిపిస్తాడు. పరశురాముడు రేణుక శీలాన్ని శంకించడమే కాకుండా ఆమె పారిపోయినప్పుడు ఆమెను వెంటాడి వేధించే వాడిగా, ఎల్లమ్మ కథలో దర్శనమిస్తాడు. ఈ కథలో రేణుకకు ఆశ్రయమిచ్చిన వారిని స్త్రీలుగా చిత్రించడం, మాదిగ స్త్రీ అందివ్వగా పరశురాముడు నమిలి ఉమ్మిన తాంబూలం నుండి బైండ్లవారు పుట్టినప్పటికీ వారిని తండ్రివైపు నుండి కాక తల్లివైపు నుండి గుర్తించడం అనేవి కూడా అనార్య దళిత జాతుల్లో వుండే మాతృస్వామిక లక్షణాలను సూచిస్తాయి.

అనార్య, ఆదివాసీ తెగలపై ఆధిపత్య ఆర్యసంస్కృతి ఎంతగా రుద్దబడినప్పటికీ ఆయా తెగలు తమ సంస్కృతి చిహ్నాలను కాపాడుకునే క్రమంలో కళారూపాలను సృష్టించుకోవడం, ఆ కళల తీరు భావజాలాన్ని ప్రతిబింబించడం జరుగుతుంది. ఈ క్రమానికి ఎల్లమ్మ కథ ప్రతీకగా నిలుస్తుంది. సామాజిక పరిణామక్రమంలో దళిత జాతుల సంస్కృతీకరణకు గురైనప్పటికీ అచ్చమైన దళిత సంస్కృతి ఒకప్పుడు ఉండేదనడానికి ఈ కథ సాక్ష్యం. ఈనాడు అన్ని సామాజిక వర్గాలు సంప్రదాయంగా మాత్రమే ఉండేది. ఎల్లమ్మవంటి గ్రామదేవతలను వెనుకబడిన ప్రాంతాల్లోని దళిత కులాలు కులదైవంగా పూజించడం, ఆడపిల్లలకు



'రేణుక', 'ఎల్లమ్మ' అనే పేర్లు పెట్టడం కొనసాగుతుంది. మధ్యయుగాల్లో ఈ కథను బైండ్ల స్త్రీలు ప్రదర్శిస్తూ ఉండేవారని చారిత్రక ఆధారాలున్నాయి. ప్రస్తుతం ఎల్లమ్మ కథను బైండ్ల పురుషులు ప్రదర్శించడం యాదృచ్ఛికం కాదు. కాలక్రమంలో దళిత సంస్కృతిలో పెంపొందిన పురుష ప్రాధాన్యత ఇందుకు కారణం. కాబట్టి అగ్రకుల పురుషదురహంకారాన్ని, ఆధిపత్యధోరణిని వ్యతిరేకించే దళిత స్త్రీలే ప్రారంభంలో ఎల్లమ్మ కథను రూపొందించి ఉంటారని భావించవచ్చు.

ద్వంద్వ నీతి

జమదగ్ని, పరశురాముడు పాత్రల చిత్రీకరణలో శిష్టుల లిఖిత సాహిత్యానికి, జానపదుల మౌఖిక సాహిత్యానికి భేదం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. శిష్టసాహిత్యంలో జమదగ్ని మహాముని అని, కర్మకాండలపట్ల నియమనిష్టలు కలవాడు అని చిత్రిస్తూ, మతపరమైన పూజాధికాలపై అతనికున్న అచంచల గౌరవం, నిష్ఠల కారణంగానే అతడు భార్య చిత్తచపలత్వానికి ఆగ్రహించి, ఆమె తలను ఖండించవలసిందిగా ఆజ్ఞాపించడం, తర్వాత పితృవాక్య పరిపాలన గావించిన పరశురాముడిని అభినందించి అతని కోరిక మేరకు తిరిగి రేణుకను బతికించడం మొదలైన సంఘటనలన్నీ శిష్ఠసాహిత్యంలో గొప్పవిషయాలుగా చిత్రీకరించబడ్డాయి. శిష్టసాహిత్యం పరశురాముడి విషయంలో కూడా ద్వంద్వ నీతిని పాటిస్తుంది. ఒకవైపు అతనిని పితృవాక్య పరిపాలకునిగానూ, మరోవైపు అతనికి తల్లిపట్ల ఉన్న మమకారం కారణంగానే తండ్రి నుండి వరం పొంది తిరిగి ఆమెను బతికించుకున్నట్టు ఆ సాహిత్యం పేర్కొంది. 'పతిభక్తి', 'దేశభక్తి', 'పితృవాక్య పరిపాలన', 'మాతృభక్తి' వంటి భావాలను ప్రచారం చెయ్యడం అనేది రాజాస్థానాల్లో వర్ధిల్లిన శిష్టసాహిత్య లక్షణం.

కానీ బైండ్ల మౌఖికసాహిత్య రూపమైన ఎల్లమ్మ కథలో ద్వంద్వ ప్రవృత్తి కనిపించదు. వారి ప్రకారం జమదగ్ని, పరశురాముడు పాత్రలు ఏ విధంగాను పాజిటివ్‌గా ఉండవు. బైండ్ల కథలో వీరిద్దరూ అగ్రవర్ణ పురుష దురహంకారులుగానూ, రేణుకాదేవి ఆచారాలు, సంప్రదాయాల పేరున పురుష దాష్టీకానికి బలైపోయిన స్త్రీగానూ కనిపిస్తుంది. స్త్రీ స్వాభిమానాన్ని భవనీలు గుండెలకు హత్తుకోవడం ద్వారాఎల్లమ్మను కులదైవంగా భావించడం, రేణుకాదేవి పేరును ఎల్లమ్మగా మార్చి ఆమె కథను గానం చెయ్యడం అనేవి దళిత సమూహాలు తమ సంస్కృతీ చిహ్నాలను ఇంకా పదిలంగా కాపాడుకోవడంలో భాగంగానే చూడాలి. అంతేకాక ఒకానొక చారిత్రక సందర్భంలో ఆర్య, అనార్య తెగల మధ్య నెలకొన్న సాంస్కృతిక వైరుధ్యానికి, భావసంఘర్షణకూ ఎల్లమ్మ కథ ప్రతీక. ఆ కథను కళారూపంగా మలచుకొని తరాల నుండీ జవజీవాలతో కాపాడుకుంటూ వస్తున్న బైండ్ల వారిని నిజమైన తాత్వికులుగానూ, సమాంతర సాహితీవేత్తలుగానూ గుర్తించక తప్పదు.



- ప్రొ॥చల్లపల్లి స్వరూపరాణి
9440362433

చారిత్రక ఆవశేషాల మాలిక బాసర

బాసర ప్రస్తుతం నిర్మల్ జిల్లా (ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా)లో వుంది. బాసర నిజానికి ఒక ఊరు కాదు. ఐదు గ్రామాల సముదాయం: 1.బాసర 2. రేణుకాపురం, 3.మహదాపురం, 4.రత్నాపురం, 5.మయిలాపురం. ప్రస్తుతం బాసర, మయిలాపురం మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగిలిన ఊర్లు రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే ఉన్నాయి.

బాసరలో జ్ఞానసరస్వతిని వ్యాసుడు ప్రతిష్ఠించినట్లు చెప్పబడుతున్నది. కాని, ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు పాలించిన కరికాళచోళ రాజైన రెండవ బిజ్జలదేవుడే ఇక్కడ ఆలయాలను నిర్మించినాడని చరిత్రకారులు అభిప్రాయం. తాను జైనుడు. అతని బావ వీరశైవప్రవక్త బసవేశ్వరుడు. వారి కాలంలో వీరశైన ప్రాబల్యంవల్ల జరిగిన జైనంశైవాల సంఘర్షణలకు దర్పణంగా వుంది బాసర. బాసర జ్ఞానసరస్వతి దేవాలయానికి వెనుకగా చిన్నగుట్ట మీద పాపహరేశ్వరాలయంగా పిలువబడే పురాతన శివాలయముంది.

ఈ దేవాలయావరణలోని స్తంభశిలలు, శాసనస్తంభాలు, శిల్పాలు అన్నీ వేటికవి ప్రత్యేకమైనవి. రాష్ట్రకూటుల కాలం నుంచి వేములవాడ చాళుక్యుల వరకు వివిధ సందర్భాలలో ప్రతిష్ఠించబడిన దేవాలయాలు, కూల్చబడిన, మార్చబడిన జైనబసదులు, వీరశిలలు, సతిశిలలు, శాసనాలు, శిథిలాలు ఒకేచోట అగుపిస్తున్నాయి.

శిథిలాలయం: రాష్ట్రకూటుల నుంచి (అంతకుముందు కూడా) కాకతీయుల దాక లలాటబింబంగా చెక్కబడిన గజలక్ష్మి ఇక్కడి శిథిలదేవాలయపు ద్వారం మీద వుంది. జైనులైన రాష్ట్రకూటులు తాము నిర్మించిన గుడులమీద, శాసనాలమీద తామరపూలరేకులను చెక్కించడం ఒక ప్రత్యేకశైలిగా మనం గుర్తించవచ్చు. అదే శైలి ఈ దేవాలయం ఉత్తరాశి మీద కనిపిస్తుంది. సాధారణంగా జైన బసదుల ముందర వుండే శంఖలతాతోరణం, ఏనుగులున్న చంద్రశిల ఇక్కడ కనిపిస్తున్నది. ఏక, త్రి.. దేవతాధిష్ఠాన పీఠాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. రెండుచేతులున్న జైన గణపతి బయట కనిపిస్తున్నాడు. జైన నిశీథులు కూడా ఇక్కడ కనిపించాయి. జైన గురు పరంపరను తెలిపే జైన స్తంభమొకటి వుంది. రాష్ట్రకూటుల కాలం నాటి రెండు గణపతి విగ్రహాలు అక్కడున్నాయి.

శైవం: రాష్ట్రకూటుల పిదప చాళుక్యులు రాజ్యపాలనకు వచ్చే సంధికాలంలో వీరశైవం విస్తరించింది. వీరశైవులు జైనులనెందరినో పట్టి పరిమార్చినట్టు శాసనాలు, గ్రంథాలు చెపుతున్నాయి. జైనబసదులెన్నో కూల్చబడ్డాయి లేదా శైవాలయాలుగా మార్చబడ్డాయి. ఇక్కడ కూడా అట్లాంటి సాక్ష్యాలు మనకు లభిస్తున్నాయి. ఎక్కడెక్కడో బయటపడివున్న విగ్రహాలను ఈ పాపహరేశ్వరుని ప్రాంగణంలోనికి చేర్చినట్టున్నారు. శైవానికి సంబంధించిన భైరవుడు, చాముండి దేవతలు, రెండు సమలింగాలు (బ్రహ్మ, విష్ణు, రుద్ర భాగాలతో), నాగశిల్పాలు, పాతగర్భాలయాన్ని పెంచి కట్టిన రంగ, ముఖ మంటపాలు అగుపిస్తున్నాయి. దూరంగా దీపస్తంభమొకటున్నది.

శాసనాలు: అక్కడి స్తంభాలమీద చెక్కిన శాసనాలలో 9వ శతాబ్దపు తెలుగులిపిలో 1. శ్రీవైశ్య కులతిలక .... పయ సెట్టి, 2. స్వస్తిశ్రీ రేచయ్య కొట్టద్రమ్మ నూరు, 3. స్వస్తిశ్రీ బిజ్జకప్పియ్య కొట్టద్రమ్మ నూరు, (4. లిపి స్పష్టంగా కనిపించడం లేదు) అని వుంది. బినోలలో బాహుబలి అని అనుకుంటున్న శిల్పం బాహుబలిది కాదు, జైన తీర్థంకరుడు శాంతినాథునిది. శిల్పపాదపీఠం మీద ఒక'వైశ్యకులతిలకుడు' చేయించిన శాంతినాథుని శిల్పమని రాసున్నది. ఇక్కడ కూడా ఒక శాసనంలో వైశ్యకులతిలక అనే మాట వుంది. గోదావరి అవతల బినోల, ఇవతల బాసరలలోని ఈ శాసనలిపులు ఒకే కాలానికి చెందినవి.

సతిశిలలు: అన్నింటి కన్నా ప్రత్యేకమైనవి ఇక్కడ కనిపిస్తున్న రెండు సతిశిలలు. తెలంగాణలో అరుదుగా కనిపించేవి సతి శిలలు. భర్తలు వీరమరణం పొందినపుడు సతీసహగమనం చేసిన స్త్రీలకు, ఆత్మాహుతి చేసుకున్న స్త్రీలకు సతిశిలలను నిలుపుతుంటారు. ఈ సతిశిలలను నిలిపే ఆచారం మనకు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాతులలో ఎక్కువగా కనిపిస్తుంది.

మహిషాసురమర్దిని: ఇక్కడ కనిపించిన అన్ని శిల్పాల కన్న మిన్నయైన శిల్పం రాతిగుండుకు చెక్కిన మహిషాసురమర్దిని విగ్రహం. చతుర్భుజియైన ఈ దేవతకు వెనక కుడిచేతిలో గంట, ఎడమచేతిలో శంఖు వున్నాయి. ముందరి రెండు చేతులలో కుడిచేతిలోని శూలంతో మహిషాసురుని వధిస్తున్నట్టుంది. ఎడమచేయి దున్నపోతు రూపంలో వున్న మహిషాసురుని తోక పట్టి పైకిలాగినట్టుంది. ఎడమకాలితో మహిషం తలను తొక్కిపట్టినట్లున్నది. ఇటువంటి శిల్పం చాలా అరుదైనటువంటిది.

బాసరకు వ్యాసపురి అని పేరుందని, వ్యాసుడిక్కడ తపస్సు చేసుకుంటు నివసించినందువల్ల ఆ పేరు వచ్చిందని జనాభిప్రాయం. అయితే జైన బసదులిక్కడ ఎక్కువగా వుండటంవల్ల బసది అనే పిలుపు 'బాసర' కావడానికి కూడా అవకాశముంది.

ఈ శిల్పాలన్నింటిని తన క్షేత్రపర్యటనలో చూసింది, ఫోటోలుతీసింది మిత్రులు బాసరవాసి టీచర్ రామ్మోహన్, భూపాలపల్లి కి చెందిన టీచర్ మాదారపు రామయ్య,. వారిచ్చిన సమాచారమే ఈ వాసానికి మూలం.





– శ్రీరామోజు హరగోపాల్

దక్కన్ చరిత్ర, సంస్కృతులపై అంతర్జాతీయ సదస్సు

ఫిబ్రవరి 16, 17 తేదీల్లో హైదరాబాదు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, సిఎస్‌టిడి బిల్డింగ్‌లో మధ్యయుగం చివరి భాగంలోని దక్కన్ రాజ్యాలకు, ఇరాన్ కి మధ్య ఉన్న సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న 'దక్కన్ హిస్టరి సొసైటీ' జనరల్ సెక్రెటరీ ప్రొ. సైయద్ అయూబ్ అలీ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇది తాము నిర్వహిస్తున్న ద్వితీయ అంతర్జాతీయ సదస్సు అని, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చరిత్ర శాఖ, ముంబయిలోని ఇరాన్ కల్చర్ హౌస్‌తో కలిసి ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'సోషియో పొలిటికల్, ఎకనామిక్ అండ్ కల్చరల్ రిలేషన్స్ ఆఫ్ దక్కన్ స్టేట్స్ విత్ ది రూలర్స్ ఆఫ్ ఇరాన్ ఫ్రం 14 టు 18 సెంచరి' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ ఇంటర్నేషనల్ సెమినార్‌కి ఇరాన్, టర్కీ దేశాల నుంచేకాక, ఇండియాలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా పరిశోధకులు వచ్చి తమ పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు. అట్లాగే ప్రొ.బషీరుద్దిన్ స్మారక ఉపన్యాసాన్ని న్యూఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామిక్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు ప్రొ.ఎస్.ఎమ్. అజీజుద్దీన్ హెస్సేన్ ఇస్తారని, 'దక్కన్ సమాజంపై సూఫీ ప్రభావం' అన్న ది ఆయన ఉపన్యాస అంశమని, దక్కన్ చరిత్ర, సంస్కృతులపై ఆసక్తి ఉన్నవారందరూ ఈ సదస్సుకు రావచ్చని ప్రొ.అయూబ్ అలీ తెలియజేశారు.



మిషన్ 2019 ప్రయోగం ఫలించింది. ఇంగ్లాండ్ పరిస్థితులను పోలివుండే కివీస్‌లో కఠిన పరిస్థితుల్లో టీమ్ ఇండియా నిలిచింది. ఆందోళన కలిగించిన మిడిల్ ఆర్డర్ సైతం ఫామ్‌లోకి వచ్చింది. అన్నింటా జోరుమీదున్న టీమ్ ఇండియా ఇక ధనాదన్ ధమాకాకు సిద్ధమైంది. కివీస్ గడ్డపై టీ20 సిరీస్ విజయంపై కన్నేసింది. అబ్బాయిల జట్టుతో పాటు అమ్మాయిలు సైతం టీ20 వేటలో నిలిచారు. మెన్స్, ఉమెన్స్ మ్యాచులు ఒకే రోజు జరుగనుండటం అభిమానులకు టీ20 డబుల్ ధమాకా!.

ధనాదన్ ధమాకా



- రేపట్నుంచి కివీస్‌తో పొట్టి పోరు
- మరో సిరీస్‌పై టీమ్ ఇండియా గురి

వెల్లింగ్టన్ (న్యూజిలాండ్)

50 ఓవర్ల ఆట ముగిసింది. ఇక 20 ఓవర్ల ఉత్కంఠకు తెర లేవనున్నది. వన్డేల్లో సమవుజ్జీలుగా బరిలోకి దిగినా టీమ్ ఇండియా ఏకపక్ష విజయాలు సాధించింది. తొలి మూడు వన్డేల్లో ఆతిథ్య న్యూజిలాండ్ పూర్తిగా తేలిపోయింది. పొట్టి ఫార్మాట్‌లో సైతం న్యూజిలాండ్ బలమైన జట్టే. ఆ జట్టుకు నాణ్యమైన ఆల్‌రౌండర్ల అండ ఉంది. దీంతో పొట్టి పోరు హోరాహోరీగా సాగటం ఖాయమని చెప్పవచ్చు. ఇదే సమయంలో అమ్మాయిలు సైతం సమాంతరంగా పోటీపడుతున్నారు. 2-1తో వన్డే సిరీస్ సాధించిన అమ్మాయిలు, టీ20 సిరీస్‌పైనా కన్నేశారు. మిథాలీ రాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించిన తర్వాత టీమ్ ఇండియా ఆడబోయే తొలి సిరీస్ ఇదే కావటం గమనార్హం. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, మిథాలీ రాజ్‌లపైనే ప్రధానంగా ఫోకస్ కనిపిస్తోంది. 50లో ఓడిన కివీ అమ్మాయిలు 20లోనైనా మెరవాలని చూస్తున్నారు. బుధవారం తొలి మ్యాచ్ జరుగనుండగా, శుక్ర, ఆదివారాల్లో చివరి రెండు టీ20లు జరుగనున్నాయి. అదే రోజు ఉదయం అమ్మాయిల మ్యాచ్ ముగిసిన తర్వాత అబ్బాయిల ఆట మొదలవ్వనున్నది. అన్ని మ్యాచులు స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం అవుతాయి.

చెలరేగుతారా? : ఎం.ఎస్ ధోని సాధికారిక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నా, అతడిలో మునుపటి హిట్టింగ్ సత్తా లోపించింది. కొన్ని సార్లు మహి ఆట విసుగు తెప్పిస్తోంది!. ఎటువంటి ఒత్తిడి లేని వేళ ధనాదన్ ఆటపై ధోని దృష్టి పెట్టనున్నాడు. ఈ సిరీస్‌లో ధోని అవసరమైతే బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చే అవకాశం లేకపోలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. హార్దిక్ పాండ్య, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్‌లు దూకుడు మీదున్నారు. బంతితో భారత్ ఇప్పుడు బ్యాటింగ్ లైనప్ కంటే పటిష్ఠంగా కనిపిస్తోంది. ప్రధాన బ్యాట్స్‌మన్ కోహ్లి, ప్రధాన బౌలర్ బుమ్రా లేకపోయినా పొట్టి సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుండటం విశేషం.

వన్డే సిరీస్‌ను చిత్తుగా కోల్పోయిన న్యూజిలాండ్ ఊరట కోసం పొట్టి సిరీస్ నెగ్గాలని చూస్తోంది. వన్డే సిరీస్ ఓటమి భారం లేని కొత్త ఆటగాళ్ళు టీ20కి ఆడనుండటం కివీస్‌కు కలిసొచ్చే అంశం. కెప్టెన్ విలియమ్సన్, రాస్ టేలర్ సహా బౌల్ట్, సౌథీ ఆతిథ్య జట్టుకు కీలకం కానున్నారు.



ఈసారి అందుతుంది!

ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్‌పై గోపీచంద్

నవతెలంగాణ, హైదరాబాద్

1980లో తొలిసారి ప్రకాశ్ పదుకొణె సాధించాడు. రెండు దశాబ్దాల నిరీక్షణ అనంతరం 2001లో పుల్లెల గోపీచంద్ ముద్దాడాడు. అతడూ అందుకొని 18 ఏండ్లు గడిచిపోయింది. ఈ సమయంలో భారత్ ఎంతో మెరుగైంది, ఎన్నో అనితర సాధ్యమైన విజయాలు సాధించింది. కానీ ఆ ఒక్కటి ఇంకా ఊరిస్తూనే ఉన్నది. అదే ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టైటిల్. ఈ బుధవారం నుంచి బర్మింగ్‌హామ్ వేదికగా ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ మొదలవ్వనున్నది. బ్యాడ్మింటన్‌లో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ టైటిల్ కోసం సైనా నెహ్వాల్, పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు ఈ సారి రేసులో నిలిచారు. 18 ఏండ్ల నిరీక్షణకు ఈ ఏడాది తెర పడే అవకాశం ఉందని భారత చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అభిప్రాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గోపీచంద్ మీడియాతో మాట్లాడారు. ' మన స్టార్స్ క్రీడాకారుల్లో ఒకరు ఆల్ ఇంగ్లాండ్ సాధిస్తారని ఆశిస్తున్నాను. సైనా నెహ్వాల్, సింధు సహా శ్రీకాంత్ మంచి ఫామ్‌లో ఉన్నారు. సైనా ఇటీవల ఇండోనేషియా టైటిల్ నెగ్గింది. సింధు సైతం మెరుగ్గా ఆడింది. శ్రీకాంత్ మంచిగా ఆడుతున్నాడు. శ్రీకాంత్ ఈ ఏడాది అద్భుతంగా రాణించగలడని అంచనా వేస్తున్నాను' అని గోపీచంద్ పేర్కొన్నాడు.

విండీస్ కెప్టెన్ హోల్డర్‌పై వేటు

- ఓ టెస్టు నిషేధం విధించిన ఐసీసీ



దుబాయ్ : మసకబారిన వెస్టిండీస్ క్రికెట్‌కు అగ్ర జట్టు ఇంగ్లాండ్‌పై అద్వితీయ విజయాలతో సిరీస్ సాధించి, కొత్త రెక్కలు తొడిగిన సారథి జేసన్ హోల్డర్. బ్యాట్‌తో అజేయ ద్వి శతకం, బంతితో వికెట్ల వేట సాగించిన హోల్డర్ స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ వేటుకు గురయ్యాడు. ఆంటిగ్వా టెస్టును మూడు రోజుల్లోపే విండీస్ 10 వికెట్ల తేడాతో నెగ్గినా, వెస్టిండీస్ ఓవర్ రేట్ నెమ్మదించింది. దీంతో కెప్టెన్ హోల్డర్‌పై ఐసీసీ ఓ టెస్టు మ్యాచ్ నిషేధం పడింది. సెయింట్ లూయిస్‌లో జరిగే చివరి, మూడో టెస్టులో హోల్డర్ ఆడబోవటం లేదు. వైస్ కెప్టెన్ క్రెగ్ బ్రాత్‌వేట్ సారథ్య పగ్గాలు అందుకునే అవకాశం ఉంది.

పుంజుకున్న విదర్భ

- రెండో రోజు ఆ జట్టు పైచేయి
- పుజార నిష్క్రమణతో సౌరాష్ట్ర నైరాశ్యం
- రంజీ ట్రోఫీ ఫైనల్స్



నాగ్‌పూర్ : తొలి రోజు కీలక ఆటగాళ్లను స్వల్ప స్కోర్లకే కోల్పోయి వెనుకంజ వేసిన డిఫెండింగ్ చాంపియన్ విదర్భ, రంజీ ట్రోఫీ ఫైనల్లో అమోఘంగా పుంజుకున్నది. అక్షయ్ కర్నెవార్ (73), అక్షయ్ వాకారె (34) రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులు చేసిన విదర్భ, బౌలర్ల మెరుపులతో పట్టు బిగించింది. సీమర్ ఆదిత్య (3/55), అక్షయ్ వాకారె (2/42) చెలరేగటంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 158/5తో చిక్కుల్లో కూరుకున్నది. స్టార్ బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (1)ను ఒక్క పరుగుకే పరిమితం చేసిన ఆదిత్య మానసికంగా విదర్భను ఆధిక్యంలో నిలిపాడు. హార్విక్ దేశాయ్ (10), విశ్వరాజ్ జడేజా (18), అర్పిత్ వసవడ (13), షెల్డన్ జాక్సన్ (9) విఫలమయ్యారు. ఓపెనర్ స్నేల్ పటేల్ (87 నాటౌట్, 160 బంతుల్లో 14 ఫోర్లు) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. ప్రేరక్ మన్కడ్ (16) పటేల్ తోడుగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి క్రీజులో కొనసాగుతున్నాడు. విదర్భ తొలి ఇన్నింగ్స్‌కు సౌరాష్ట్ర మరో 154 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది.

అగ్రస్థానం మనదే!

- కోహ్లి, బుమ్రా వరల్డ్ నం.1
- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్ : ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా స్టార్స్ అగ్రస్థానం నిలుపుకున్నారు. బ్యాటింగ్ జాబితాలో కెప్టెన్ విరాట్ కోహ్లి, బౌలర్ల జాబితాలో జస్‌ప్రీత్ బుమ్రా ప్రపంచ నం.1గా కొనసాగుతున్నారు. ఆస్ట్రేలియాపై, న్యూజిలాండ్‌లపై వరుస సిరీస్‌లు నెగ్గిన టీమ్ ఇండియా 122 పాయింట్లతో, వరల్డ్ నం.1 ఇంగ్లాండ్ (126) తర్వాత స్థానంలో కొనసాగుతోంది. హ్యాట్రిక్ అర్ధ సెంచరీలతో మెరిసిన ఎం.ఎస్ ధోని బ్యాటింగ్ ర్యాంక్ మెరుగుపర్చుకున్నాడు. మూడు స్థానాలు ఎగబాకి 17వ స్థానంలో నిలిచాడు. మణికట్టు స్పిన్నర్ చాహల్ ఓ స్థానం మెరుగై ఐదో ర్యాంక్ సాధించగా, భువనేశ్వర్ ఆరు స్థానాలు మెరుగై 17వ స్థానంలో నిలిచాడు. కేదార్ జాదవ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి బ్యాట్స్‌మన్‌గా 35వ ర్యాంక్‌లో నిలిచాడు.

ఢిల్లీకి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

రాహుల్‌గాంధీతో నేడు భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్ని కలపై ఏఐసీసీ కసరత్తు ప్రారంభిం చింది. రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో నేరుగా చర్చించేందుకు రంగంలోకి దిగింది. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ ఆహ్వా నం మేరకు ఎమ్మెల్యేలు సోమవారం రాత్రి 10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో రాహుల్‌గాంధీతో సమావేశమవుతారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలు, కొంత మంది ఎమ్మెల్యేలు విజయం సాధించడానికి, ఎక్కువ మంది పార్టీ అభ్యర్థులు ఓడిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో పార్టీ ఓటమిపై అధిష్టానం సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలతో ఆయన సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకున్నది. పార్టీ ఓడిపోయిన తర్వాత రాష్ట్రానికి చెందిన 150 మంది సీనియర్ నాయకులు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ అడిగారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియాతో సహా ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని గాంధీభవన్ వర్గాలు చెప్పాయి. తెలంగాణలో పార్టీఓటమిపై అధిష్టానం సీరియస్‌గా ఉందన్న విషయం దీంతో తేటతెల్లమైంది. రాష్ట్ర నాయకత్వాన్ని పక్కన పెట్టి నేరుగా ఎమ్మెల్యేలను ఢిల్లీకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూల, ప్రతికూల పరిస్థితులను తెలుసుకోనున్నారు. ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించనున్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ తరుపున గెలిచినప్పటికి తమను రాష్ట్ర నాయకత్వం పట్టించుకోవడంలేదన్న అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు టీఆర్ఎస్ ఆపరేషన్ ఆకర్ష్...మరోవైపు రాష్ట్ర నాయకత్వం పట్టించుకోవడంతో నేరుగా రాహుల్‌గాంధీ వారితో చర్చించడం కొనమెరుపు. పార్లమెంటు అభ్యర్థుల విషయంలోనూ ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతోపాటు కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, ఉపాధ్యక్షులను బృందాలుగా ఏర్పాటు చేసి, జిల్లాలకు పంపించే యోచనలో ఉన్నట్టు పార్టీవర్గాలు చెప్పారు.

పులులు 25లోపే!

ఈ నెలాఖర్లో కేంద్ర అటవీశాఖ ప్రకటించే అవకాశం



రాజీవ్ టైగర్ ప్రాజెక్టులో 15 లోపే..

- కవ్వాల్ పరిధిలో 8 నుంచి 10..
- మంచిర్యాల జిల్లాలో ఇటీవల రెండు పులుల చంపివేత
- తగ్గుదలపై మేల్కొన్న తెలంగాణ అటవీశాఖ
- సంరక్షణ కోసం స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం ప్రతిపాదన
- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడమే తరువాయి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పులిని చంపి చర్మాన్ని అమ్మేందుకు యత్నించి ముఠా పట్టుబడటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. తీగలాగితే డొంక కదిలిన చందంగా కలప అక్రమ రవాణా, జంతువుల వేటగాళ్ల చిట్టా రోజుకోటి బయటకొస్తున్నది. అందులో అటవీశాఖ అధికారుల పాత్ర కూడా తేటతెల్లమవుతున్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పులుల సంఖ్య 25 లోపునకు ఎందుకు పడిపోయింది? ఏటేటా ఎందుకు తగ్గుతున్నాయి? ఉన్నవి ఎక్కడుంటున్నాయి? వాటి పరిరక్షణకు సర్కారు పాత్ర ఏంటీ? అన్న చర్చ మొదలైంది.

తెలంగాణలో ప్రధానంగా అమ్రాబాద్, కవ్వాల్ పరిధిలో పులుల సంరక్షణ కేంద్రాలున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్ పరిధిలోని రాజీవ్ టైగర్ ప్రాజెక్టు 6.5 లక్షల ఎకరాల్లో విస్తరించింది. 14 నుంచి 16 పులులున్నట్టు ఇటీవల అధికారులు చేపట్టిన ప్రాథమిక గణనలో తేలింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో విస్తరించియున్న కవ్వాల్ అటవీప్రాంతంలో ఏడు నుంచి 10 వరకు పులులున్నట్టు రాష్ట్ర అటవీ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. కవ్వాల్ పరిధిలోని పులులు గతంలో ఒకటి నుంచి నాలుగు మాత్రమే ఉండేవని అధికారులు చెబుతున్నారు. శివారులో ఉన్న మహారాష్ట్ర అటవీ ప్రాంతంలో పులుల సంఖ్య పెరిగింది. సగటున ఒక్కో పులి తన ఆవాస ప్రాంతాన్ని ఆహారం, నీటివసతి, దట్టమైన అటవీసంపద, జంతువుల లభ్యత ఆధారంగా 10 నుంచి 50 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించుకుంటాయి. దీంతో తమ ఆవాస ప్రాంతాన్ని వెతుక్కోవడంలో భాగంగా పులులు తెలంగాణ వైపు వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అయితే, నెల వ్యవధిలో మంచిర్యాల జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో చర్మాలను అమ్మి సొమ్ము చేసుకునేందుకు రెండు పులులను వేటగాళ్లు చంపడం ఆందోళన కలిగిస్తోంది. పులుల భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

గణన ఇలా...తగ్గుతున్నది ఇలా...

తెలంగాణలో 25లోపే పులులున్నట్టు ఇటీవల చేపట్టిన ప్రాథమిక పులుల గణనలో తేలింది. తొలుత రాష్ట్ర అటవీ శాఖ అధికారులు పులులు సంచరించే ప్రాంతాల్లో రోజుకు నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించి అవి విసర్జించే మల, మూత్రాలను సేకరిస్తారు. పులులు తిరిగే క్రమంలో నేలపై పడే వేలిముద్రలను ప్రత్యేక పరికరాల ద్వారా సేకరిస్తారు. ఆయా ప్రాంతాల్లో కనిపించే కళేబరాల సంఖ్యను కూడా ఒక ఆధారంగా స్వీకరిస్తారు. వీటికి తోడు పులులు చెట్లపై గోళ్లతో గీరటం, వాటి అరుపులను కూడా పరిగణనలోకి తీసుకుని సంఖ్యపై ప్రాథమిక నిర్ధారణకు వస్తారు. పలు కోణాల్లో సేకరించిన ఆధారాలను డెహ్రాడూన్‌లో వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్‌కు పంపిస్తారు. అక్కడ అనేక విశ్లేషణల తర్వాత కేంద్ర అటవీ శాఖ ఒక నిర్ధారణకు వచ్చి ఆయా రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లో ఉన్న పులుల సంఖ్యను అధికారికంగా ప్రకటిస్తుంది. పులుల గణన ప్రతి నాలుగేండ్లకోసారి జరుగుతుంది. 2006లో చేపట్టిన పులుల గణనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 90 పులులున్నట్టు తేలింది. 2010లో విడుదల చేసిన నివేదికలో ఏపీలో 72 పులులున్నట్టు ప్రకటించారు. 2014లో ప్రకటించిన గణనలో ఉమ్మడి ఏపీలో 66 పులులున్నట్టు కేంద్ర అటవీశాఖ తెలిపింది. 2018 పులుల గణన సేకరణ ప్రక్రియ పూర్తి అయింది. గణన తుది జాబితాను కేంద్ర అటవీ శాఖ ఈ నెలాఖరులోగా విడుదల చేసే అవకాశం ఉన్నది. రాష్ట్ర అటవీ శాఖ అధికారులు వచ్చిన ప్రాథమిక నిర్ధారణలో నల్లమలలో విస్తరించియున్న రాజీవ్ టైగర్ ప్రాజెక్టులో 14 నుంచి 16, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించియున్న కవ్వాల్ అటవీ ప్రాంతంలో 8 నుంచి 10 వరకు పులులున్నట్టు తేలింది. కవ్వాల్ అటవీ ప్రాంతంలో ఇప్పటికే రెండు పులులు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మృత్యువాతపడ్డాయి.

రాష్ట్ర అటవీశాఖ తేరుకున్నా...ప్రభుత్వ ఆమోదం లభించేదెన్నడో..?

కలప అక్రమరవాణాతో అటవీ ప్రాంతం పలుచబడి, వేటగాళ్ల బారిన పడి పులుల సంఖ్య గణనీయంగా పడిపోతుండటంతో రాష్ట్ర అటవీ శాఖ మేల్కొంది. ఇటీవల జరిగిన ఉన్నతాధికారుల సమీక్షలో పులుల సంరక్షణ కోసం 222మంది సిబ్బందితో రెండు కంపెనీల స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఒక్కో కంపెనీలో 111 మంది సాయుధ అటవీ అధికారులు ఉంటారు. ఏసీఎఫ్ అధికారి పర్యవేక్షణలో ఇది కొనసాగుతుంది. మళ్లీ ఆ కంపెనీని 3 ప్లాటూన్లుగా విడగొడతారు. ఒక్కో ప్లాటూన్‌లో ఒక రేంజ్ ఆఫీసర్, 27 మంది టైగర్ గార్డ్స్, 9 మంది టైగర్ వాచర్స్ ఉంటారు. వీరంతా అటవీ ప్రాంతంలో రోజుకు 25 నుంచి 30 కిలోమీటర్లు నడుస్తూ పులులను సంరక్షించాల్సి ఉంటుంది. ఈ కంపెనీల్లో 25 నుంచి 40 ఏండ్ల లోపువారే ఉంటారు. 40 ఏండ్లు దాటితే వారిని అటవీశాఖలోని రెగ్యులర్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తారు. ఇలా ఏర్పడ్డ రెండు కంపెనీల దళాలు నల్లమల్ల, కవ్వాల్ అటవీ ప్రాంతాల్లో పులుల సంరక్షణ కోసం నిరంతరం గస్తీ తిరగాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇలాంటి కంపెనీలు దేశంలో 13 ఉన్నాయి. కాజీరంగా(అస్సాం), తడోబా (మహారాష్ట్ర) అటవీ ప్రాంతాల్లో పులుల సంఖ్య పెరిగేందుకు ఈ కంపెనీలు దోహదపడుతున్నాయి. అటవీ అధికారులు రెండు కంపెనీల ఏర్పాటు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినప్పటికీ ఎప్పటికి ఆమోద ముద్ర పడుతుందో..? తెలంగాణలో పులుల మృత్యువాతకు ఎప్పుడు అడ్డుకట్ట పడుతుందో? వేచిచూడాల్సిందే.

కేంద్ర బడ్జెట్‌పై మౌనం..

కేటాయింపుల్లో అన్యాయంపై నోరెత్తని అధికార పార్టీ

- ట్విట్టర్‌లో కామెంట్లకే పరిమితమైన కేటీఆర్
- టీఆర్ఎస్‌పై సర్వత్రా విమర్శలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాల హక్కులు, సమాఖ్య వ్యవస్థ అంటూ పదేపదే మాట్లాడుతున్న టీఆర్ఎస్ నేతలు.. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌పై మాత్రం మౌనం దాల్చారు. కేవలం ట్విట్టర్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తప్ప వారు ఈ అంశంపై బహిరంగంగా పెదవి విప్పకపోవటం గమనార్హం. కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి అనేక పథకాలు, కార్యక్రమాలకు ఆర్థిక సాయం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలుగా విజ్ఞప్తి చేసింది. ప్రధానిని కలిసినప్పుడల్లా ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక వినతి పత్రాలు సమర్పించారు. మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రామ కృష్ణారావు సైతం ఇదే విషయమై కేంద్రానికి అనేకమార్లు లేఖలు రాశారు. అయినప్పటికీ మోడీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో గత రెండు నెలల వరకూ కేంద్ర సాయాలపై విమర్శలు గుప్పించిన కేసీఆర్.. తాజాగా ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్‌పై మాత్రం స్పందించకపోవటం గమనార్హం.

ముఖ్యంగా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు ఆర్థిక సాయం చేయాలంటూ కేసీఆర్.. గతంలో కేంద్రాన్ని కోరారు. ఈ రెండింటికి కలిపి రూ.24 వేల కోట్లు కావాలంటూ ఆయన అభ్యర్థించారు. కానీ బడ్జెట్ ప్రతిపాదన సందర్భంగా కేంద్రం ఈ అంశాన్ని మాటమాత్రం కూడా ప్రస్తావించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించటం, కరీంనగర్‌లో ట్రిబుల్ ఐటీ, హైదరాబాద్‌లో ఐఐఎమ్, ఆదిలాబాద్‌లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణ, జహీరాబాద్‌లో నిమ్జ్, వరంగల్‌లో మెగా జౌళిపార్కు ఏర్పాటు, దానికి వెయ్యి కోట్ల నిధుల కేటాయింపు, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీతోపాటు రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు తదితరాంశాలపై కేంద్ర బడ్జెట్‌లో హామీ లభిస్తుందంటూ రాష్ట్ర ప్రజలు భావించారు. వీటిలో ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీలాంటి వాటిని విభజన చట్టంలో పొందుపరిచారు. కానీ వీటిన్నంటికీ కేంద్రం మొండి చేయి చూపింది. అయినా ముఖ్యమంత్రి కేసీఆర్‌గానీ, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌గానీ ఈ అంశంపై స్పందించలేదు. ఆ పార్టీకి చెందిన ఇతర నేతలెవ్వరూ కేంద్ర వైఖరిపై మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ వ్యవహారశైలిపై పలు విమర్శలొస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్‌ను రూపు దిద్దుతామంటున్న కేసీఆర్.. ఇప్పుడు కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మౌనంగా ఉంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోకపోవటం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ కవితకు కేరళ అసెంబ్లీ అహ్వానం

క్యాస్ట్స్ అండ్ ఇట్స్ డిస్కంటెట్స్ అంశంపై ప్రసంగించాలని స్పీకర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

దేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులతో కేరళ అసెంబ్లీ నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించాల్సిందిగా నిజా మాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను కేరళ అసెంబ్లీ స్పీకర్ పి. శ్రీరామకృష్ణన్ కోరారు. ఈ మేరకు ఆయన ఎంపీ కవితను ఆహ్వానిస్తూ లేఖ రాశారు. కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23 నుంచి 25 వరకు సదస్సు నిర్వహిస్తున్నారు. 23న దీనిని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ప్రారంభిస్తారు. అదే రోజు మధ్యాహ్నం తిరువనం తపురంలోని కేరళ అసెంబ్లీ కాంప్లెక్స్‌లో జరిగే సదస్సులో 'క్యాస్ట్స్ అండ్ ఇట్స్ డిస్కంటెట్స్' అంశంపై ప్రసగించాల్సిందిగా ఎంపీ కవితను కేరళ స్పీకర్ కోరారు. కేరళ సీఎం విజయన్‌తో పాటు దేశ నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరవుతారని, యూనివర్సిటీల నుంచి 2 వేల మంది విద్యార్థులు సదస్సులో పాల్గొంటారని శ్రీరామ కష్ణన్ లేఖలో పేర్కొన్నారు. కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను గత ఏడాది అగస్టులో రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా అనేక సెమినార్లు నిర్వహిస్తున్నారు. యువతలో ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, ప్రజాస్వామిక ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో సదస్సు నిర్వహిస్తున్నారు. కేరళ అసెంబ్లీ, ఆ రాష్ట్ర ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు సంయుక్తంగా ఎంఐటీ- వరల్డ్ పీస్ యూనివర్సిటీ, పుణె సాంకేతిక సహకారంతో ప్రజాస్వామ్యంపై ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.